సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50


సంపుటి: 16 సంచిక: 158

సోమవారం 28-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



ఉష్ణోగ్రతల్లో వేగంగా మార్పులు

'చంద్రుడి ఉపరితలంపై 20 లేదా 30 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు కాస్త అటూఇటూగా ఉష్ణోగ్రతలు ఉండొచ్చని అంచనా వేశాం. కానీ, 70 డిగ్రీల ఉష్ణోగ్రతలున్నాయి' అని ఇస్రో శాస్త్రవేత్త చెప్పారు.


- వివరాలు 6లో



బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఆదివారం ఉదయం బాణాసంచా కర్మాగారంలో పేలుడు సంభవించి 8 మంది చనిపోయారు.

- వివరాలు 6లో



విశ్వ విజేత

ప్రపంచ చాంపియన్‌షిప్ జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు స్వర్ణం

భారత బల్లెం వీరుడు నీరజ్ చోప్రా ప్రపంచ చాంపియన్‌షిప్ జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించాడు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ప్రపంచ వేదికపై స్వర్ణం గెలిచిన తొలి భారత అథ్లెట్‌గా చోప్రా రికార్డు సృష్టించాడు.

- వివరాలు 12లో



ఖమ్మంలో బీజేపీ సభకు హాజరైన ప్రజలు



ఆదివారం ఖమ్మం సభలో విల్లు ఎక్కుపెట్టిన అమిత్ షా. చిత్రంలో కిషన్‌రెడ్డి

వచ్చేది మేమే..

కేసీఆర్... నీ పనైపోయింది

- నువ్వు కానీ, నీ కొడుకు కానీ సీఎం అయ్యే ప్రసక్తే లేదు
- ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తాం..
- కాంగ్రెస్ 4జీ, బీఆర్ఎస్ 2జీ, మజ్లిస్ 3జీ పార్టీలు
- కేసీఆర్, ఒవైసీతో బీజేపీ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు

కేసీఆర్ కారు భద్రాచలం వచ్చినా.. రాములోరి దగ్గరికి రాదు

కారు స్టీరింగ్ ఒవైసీ చేతిలో ఉంది

ఖమ్మం బహిరంగ సభలో బీజేపీ అగ్రనేత అమిత్‌షా

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'రైతు, దళిత, యువత, మహిళా వ్యతిరేక కేసీఆర్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించాల్సిన సమయం ఆసన్నమైంది. కేసీఆర్‌ను ఇంటికి పంపి బీజేపీని అధికారంలోకి తెద్దాం. గుర్తుపెట్టుకో కేసీఆర్.. నీ పనైపోయింది. నువ్వు కానీ, నీ కొడుకు కానీ ముఖ్యమంత్రి అయ్యే ప్రసక్తే లేదు..' అని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా అన్నారు. 'కాంగ్రెస్ పార్టీ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ వంశపారంపర్య 4జీ పార్టీ. బీఆర్ఎస్ కేసీఆర్, కేటీఆర్ 2జీ పార్టీ. ఇక మజ్లిస్ 3జీ పార్టీ. ఈ 2జీ, 3జీ, 4జీ పార్టీలకు కాలం చెల్లింది. బీజేపీ ప్రజల పార్టీ. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..' అని స్పష్టం చేశారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేయడంతో పాటు తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'రైతుగోస-బీజేపీ భరోసా' సభకు ఉమ్మడి ఖమ్మంతో పాటు

మిగతా 2వ పేజీలో ▶

కేసీఆర్ పాలనలో వ్యవసాయ విధ్వంసం

రాష్ట్రాన్ని కల్తీ సీడ్‌బౌల్‌గా కల్వకుంట్ల కుటుంబం మార్చింది: కిషన్‌రెడ్డి

2లో

నీళ్లు ఊరికే రావు..!

గృహాలు, సాగు, పరిశ్రమలకు నీటిని ఉచితంగా ఇవ్వొద్దు

- అలా చేస్తే దుర్వినియోగం అవుతాయి.. ప్రాజెక్టుల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు భారంగా మారింది
- నల్లాలకు మీటర్లు.. కాల్వలకు నీటిని కొలిచే యంత్రాలు బిగించాలి

ప్రైసింగ్ ఆఫ్ వాటర్ ఇన్ పబ్లిక్ సిస్టమ్ నివేదికలో సీడబ్ల్యూసీ సిఫారసు

సాక్షి, హైదరాబాద్ :''ప్రస్తుతం నీటికి భారీగా డిమాండ్ పెరుగుతోంది...అయితే నీటి లభ్యత పరిమితంగా ఉన్న దృష్ట్యా ఉచితంగా సరఫరా చేయొద్దు. గృహ, సాగు, పారిశ్రామిక అవసరాలకు సరఫరా చేసే నీటికి ధరలు ఖరారు చేయాలి. కనీసం సాగునీటి ప్రాజెక్టులపై పెట్టిన పెట్టుబడితో పాటు నిర్వహణ, పర్యవేక్షణ(ఓఅండ్ఎం) వ్యయాలు రాబట్టుకునే విధంగా నీటి ధరలు ఉండాలి''...అని కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) అన్ని రాష్ట్రాలకు సిఫారసు చేసింది. 'ప్రైసింగ్ ఆఫ్ వాటర్ ఇన్ పబ్లిక్ సిస్టమ్ ఇన్ ఇండియా–2022'పేరుతో రూపొందించిన పంచవర్ష నివేదికలో నీటికి చార్జీలు వసూలు చేయాల్సిందేనని నొక్కి చెప్పింది. నీటి ధరలపై ప్రతి ఐదేళ్లకోసారి ఈ నివేదిక

మిగతా 5వ పేజీలో ▶

నిర్వహణ, పెట్టుబడి రాబట్టుకోవాలి

దేశంలో ప్రస్తుతం వసూలు చేస్తున్న నీటి ధరలు భారీ రాయితీతో ఉన్నాయి. దీంతో ఆదాయానికి గండిపడుతోంది. రైతుల శక్తిసామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని నీటి ధరలు రాష్ట్రాలు ఖరారు చేస్తున్నాయి. కనీసం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వ్యయం కూడా రావడం లేదు. దీంతో నిర్వహణ సరిగా ఉండడం లేదు. పూర్తి నిర్వహణ వ్యయంతో పాటు పాక్షికంగా పెట్టుబడి ఖర్చు రాబట్టుకునేలా నీటి ధరలు ఉండాలి. సెకండ్ ఇరిగేషన్ కమిషన్(1972), డాక్టర్ వైద్యనాథన్ కమిటీ(1991), వివిధ ఫైనాన్స్ కమిషన్లు, ఇంటిగ్రేటెడ్ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్–2016 నిబంధనలు సైతం సరైనరీతిలో నీటి ధరలు ఖరారు చేసి నీటిపారుదల చార్జీల రూపంలో కనీసం నిర్వహణ వ్యయం వసూలు చేసుకోవాలని సిఫారసులు చేశాయి.

న్యూస్‌రీల్

పీయూష్ వ్యాఖ్యలతోనే బీజేపీకి నూకలు చెల్లాయి



తెలంగాణ ప్రజలు నూకలు తినాలని పీయూష్ వెక్కిరించినప్పుడే.. బీజేపీకి తెలంగాణలో నూకలు చెల్లిపోయాయని మంత్రి హరీశ్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయని అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించారు.

- వివరాలు 2లో

అర్హులకు టోకరా!



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు అర్హులకు అందడం లేదనే అభిప్రాయం ఉంది. బలమైన సిఫారసు ఉంటేనే గృహలక్ష్మి, బీసీ, మైనారిటీ బంధు పథకాల జాబితాలో చోటు దక్కుతోందని అన్నివిధాలా అర్హులైన వారు వాపోతున్నారు.

- వివరాలు 3లో

చాంప్ రాయలసీమ కింగ్స్



ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో రాయలసీమ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. వైజాగ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో విహారి సారథ్యంలోని రాయలసీమ కింగ్స్ జట్టు ఐదు వికెట్లతో డిఫెండింగ్ చాంపియన్ కోస్టల్ రైడర్స్ జట్టుపై గెలిచింది.

- వివరాలు 12లో

సర్వీసులో చనిపోయే ఆర్టీసీ ఉద్యోగి ఫ్యామిలీకి సాయం



భవిష్యనిధి ఆధారిత 'ఎంప్లాయ్ డిపాజిటెడ్ లింక్డ్ ఇన్సూ్యరెన్స్ ఫెసిలిటీ' ని వర్తింప చేసేందుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. సర్వీసులో ఉంటూ చనిపోయే ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు గరిష్టంగా రూ.7 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది.

- వివరాలు 10లో

ఒక్కో పోస్టుకు 61 మంది..



- పోస్టులు తక్కువ... పోరు ఎక్కువ
- నిరుద్యోగుల టార్గెట్ డీఎస్సీ...
- ప్రిపరేషన్ కోసం చలో హైదరాబాద్...
- తాత్కాలిక ఉద్యోగాలకు సెలవ్. ప్రైవేటు స్కూళ్లలో టీచర్ల కొరత
- మధ్యలో మానేయడంతో బోధనకు ఇక్కట్లు... పుట్టగొడుగుల్లా కోచింగ్ సెంటర్స్
- స్టడీ మెటీరియల్ బేరం మరూ.. సిలబస్, పరీక్ష మెథడ్‌పై మల్లగుల్లాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రకటన నిరుద్యోగుల్లో ఆశలు రేపింది. ప్రభుత్వ టీచర్ పోస్టు దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. మొత్తం 6612 పోస్టులను భర్తీ చేస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.5 లక్షల మంది ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పాసయిన వాళ్ళున్నారు. డీఎస్సీలో టెట్ అర్హులకు వెయిటేజ్ ఉంటుంది. ఇక కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు కూడా పోటీకి సిద్ధమవుతున్నారు. మొత్తంగా భర్తీ చేసే 6,612 పోస్టులకు దాదాపు 4 లక్షలకుపైగా పోటీ పడే పరిస్థితి కన్పిస్తోంది. ఈ లెక్కన ఒక్కో పోస్టుకూ 61 మంది పోటీ పడే వీలుందని అంచనా వేస్తున్నారు.

మళ్లీ కోచింగ్ హడావుడి..

డీఎస్సీ పరీక్షకు సంబంధించి విధివిధానాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోటీ తీవ్రతను

మిగతా 5వ పేజీలో ▶


నైతిక 'కృత్రిమ మేధ' అత్యావశ్యం

లేదంటే సమాజంపై ఏఐ ప్రతికూల ప్రభావాలు తప్పవు

బీ20 సదస్సులో ఆందోళన వ్యక్తంచేసిన ప్రధాని మోదీ

"ఏఐ వినియోగానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయి ఏకరూప మార్గనిర్దేశకాలు అవసరం. నిబంధనల చట్రం లేకుంటే క్రిప్టో కరెన్సీ వంటి అంశాల్లో సమస్యలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదముంది. పర్యావరణానికి హాని తలపెట్టని రీతిలో జీవన, వ్యాపార విధానాలకు పారిశ్రామిక వర్గాలు ప్రాధాన్యతనివ్వాలి. ఇందుకు వ్యాపారవర్గాలు, ఆయా దేశాల ప్రభుత్వాలు కలిసి కట్టుగా ముందుకు సాగాలి.

6లో



మహిళా సాధికారతకు చంద్రయాన్–3 చిహ్నం

మన్‌కీ బాత్‌లో తెలుగు వారికి శుభాకాంక్షలు తెలిపిన మోదీ

"ఇండియా డాటర్స్ ఇంత ప్రతిష్టాత్మకంగా ఉంటే భారత్ అభివృద్ధిని ఎవరు అడ్డుకోగలరు. మహిళల నేతృత్వంలో జరిగే అభివృద్ధి మన దేశ స్వాభావిక లక్షణంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో అసాధ్యమైనది ఏదైనా ఉంటే మహిళా శక్తితో సుసాధ్యంగా చేయొచ్చు. చంద్రయాన్–3 మిషన్ దీనికి నిలువెత్తు ఉదాహరణ. - ప్రధాని మోదీ

30న సీపీఎం తొలి జాబితా!

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయబోయే అభ్యర్థులతో ఈ నెల 30వ తేదీన మొదటి జాబితా విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పొత్తులకు సంబంధించిన అంశంపై చర్చించేందుకు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదివారం సమావేశమైంది.

- 3లో

సీపీఐ నేతలతో మాణిక్‌రావ్ భేటీ

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష పార్టీలతో జత కట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. మాణిక్‌రావ్ ఠాక్రే కమ్యూనిస్టులతో మధ్యవర్తిత్వం మొదలుపెట్టారు. ఆదివారం సీపీఐ నేతలు కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకటరెడ్డి, చాడ వెంకటరెడ్డితో సమావేశమయ్యారు.

- 3లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkob CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate				
₹ 57 per dozen	Ex Farm Live Bird	113 kg	Dressed with Skin	156 kg
	Retail Live Bird	135 kg	Skin Less	223 kg

Conditions Apply

Issued in the interest of consumers

ఇదండీ సంగతి



దీనికి ష్యూరిటీ ఎవరుంటారని అడుగుతావేం! వెళ్లు వెళ్లు!



పీయూష్ వ్యాఖ్యలతోనే బీజేపీకి నూకలు చెల్లాయి

మంత్రి హరీశ్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు నూకలు తినాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెక్కిరించినప్పుడే.. బీజేపీకి తెలంగాణలో నూకలు చెల్లిపోయాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు నూకలు చెల్లాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు ట్విట్టర్ వేదికగా తీవ్రంగా స్పందించారు. 'బ్యాట్ సరిగ్గా పట్టడం చేతకాని మీ అబ్బాయిని ఏకంగా బీసీసీఐలో కీలక పదవి ఎలా వరించిందో అందరికీ తెలుసు. అలాంటిది మీరు కుటుంబ పాలన గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది'.. అని వ్యంగ్యంగా హరీశ్ వ్యాఖ్యానించారు. 'పెద్ద ఎత్తున రైతులు ఉద్యమిస్తే కార్పొరేట్ కొమ్ముకాసే చట్టాలను ఉపసంహరించుకుని తోకముడిచిన మీరా.. రైతు బాంధవుడైన కేసీఆర్‌ను విమర్శించేది? 2జీ 3జీ 4జీ కాదు.. కేంద్రంలో దశాబ్ద కాలంగా నాజీలను మించిన నియంతృత్వ పాలన మీది.. రాబోయే ఎన్నికల్లో మీరు మాజీ లే'.. అని ట్వీట్ చేశారు. రాబోయే ఎన్నికల్లో సీఎం సీటు తమదే అంటున్న బీజేపీ నాయకులు ముందు తెలంగాణలో సింగిల్ డిజిట్‌లో సీట్లు తెచ్చుకొనే ప్రయత్నం చేయాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజీలేని యోధుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. అబద్ధపు విమర్శలు, అవుట్‌డేటెడ్ ఆరోపణలతో రాసిచ్చిన స్క్రిప్ట్‌తో హోం మంత్రి స్కిట్ చేస్తున్నారని హరీశ్ వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

అది బీజేపీ రాజకీయ గోస



సాక్షి, హైదరాబాద్: బీజేపీది రైతు గోస కాదని.. అది ఆ పార్టీ రాజకీయాల కోసం పడు తున్న గోస.. అని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఖమ్మంలో బీజేపీ నిర్వహించిన 'రైతు గోస–బీజేపీ భరోసా' సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. అదాని ఆస్తులను పెంచేందుకు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి అన్నదాతల నడ్డి విరవాలని కేంద్రంలోని బీజేపీ సర్కార్ కుట్రలు పన్నిందని ఆరోపించారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా చేసిన అసమాన పోరాటంతో తోకముడిచి దేశంలో రైతాంగానికి క్షమాపణ లు చెప్పింది నరేంద్ర మోదీ కాదా? అని ఆయన ప్రశ్నించారు.

'అమిత్ షా సభకు సర్కార్ సంపూర్ణ సహకారం'



మిరుదొడ్డి(దుబ్బాక): 'బీఆర్‌ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటే. ఇవి కాంగ్రెస్ పార్టీపై ప్రత్యక్షంగా, పరోక్షంగా యుద్ధం చేస్తున్నాయి' అని ఖమ్మం మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బహిరంగ సభకు బీఆర్‌ఎస్ పార్టీ, అధికార యంత్రాంగం సహకరించాయని ఆరోపించారు. దుబ్బాకలో కొనసాగుతున్న హాత్‌సే హాత్ జోడో యాత్ర ఆదివారం నాటికి 100వ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో సాగిన యాత్రలో పొంగులేటి పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ బహిరంగ సభకు ఒక్క ఆర్టీసీ బస్సును కూడా ఇవ్వని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తాజాగా ఖమ్మంలో జరిగిన అమిత్ షా బహిరంగ సభకు వెయ్యి బస్సులు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు.

బీజేపీలో 'మైనంపల్లి' చేరిక ఊహాగానమే



మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బీజేపీలో చేరుతున్నారనేది ఊహాగానమే తప్ప.. వాస్తవం కాదని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు స్పష్టం చేశారు. ఆయన మల్కాజిగిరిలో విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీలో నాయకులు, కార్యకర్తలను ఆదరించే వారికే చోటు ఉంటుందన్నారు. గతంలో అగ్ర నేతలను దూషించడమే కాకుండా.. నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడి.. జైలుకు పంపించిన మైనంపల్లికి చోటులేదని పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు చేయూతను అందించింది కేసీఆరే

ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: రాష్ట్రంలో అన్ని వర్గాలకు చేయూతనందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి పేర్కొన్నారు. ఆదివారం ఆనంద్‌బాగ్‌లోని క్యాంపు కార్యాలయంలో 250 మంది బీసీ కులాల లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కులవృత్తుల వారికి మరింత ఉపయోగపడేందుకే చేయూతనందిస్తున్నామన్నారు. ఇప్పటికే మైనారిటీ రుణాలు మంజూరయ్యాయన్నారు. దళితబంధు ద్వారా అర్హులైన ఎస్సీలకు రుణాలు మంజూరవుతాయన్నారు.



ఖమ్మం సభలో అభివాదం చేస్తున్న అమిత్ షా. చిత్రంలో విజయరామారావు, గరికపాటి మోహన్‌రావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, తరుణ్ ఛుగ్, బండి సంజయ్, జితేందర్‌రెడ్డి, కిషన్ రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, ఈటల, డీకే అరుణ, ఇంద్రాసేనారెడ్డి, కూనశ్రీశైలంగౌడ్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రఘునందనరావు, రవీంద్రనాయక్

వచ్చేది మేమే..

▶ మొదటి పేజీ తరువాయి

మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలను ఉద్దేశించి అమిత్‌షా ప్రసంగించారు. 'తిరుపతి వెంకటేశ్వర స్వామి, ఖమ్మంలో స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామికి నమస్కారం. తెలంగాణ విమోచన కోసం పోరాడిన ఖమ్మం వాసి జమలాపురం కేశవరావుకు నివాళులు..' అంటూ ఆయన తన ఉపన్యాసం ప్రారంభించారు. అమిత్‌షా హిందీలో చేసిన ప్రసంగాన్ని పార్టీ నేత డాక్టర్ లక్ష్మణ్ తెలుగులోకి అనువదించారు.

రాముడికి వస్త్రాలను విస్మరించారు..

'భద్రాచలానికి దక్షిణ భారత అయోధ్యగా పేరుంది. 17వ శతాబ్దం నుంచి తెలంగాణలో ఎవరు పాలించినా.. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కూడా ప్రభుత్వం తరఫున శ్రీరామనవమి సందర్భంగా రాముడికి వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ కేసీఆర్ ప్రభుత్వంలో మాత్రం.. కారు భద్రాచలం వరకు వస్తున్నా మందిరంలోకి వెళ్లకుండా ఆగుతోంది. కారు స్టీరింగ్ ఒవైసీ చేతిలో ఉండటమే ఇందుకు కారణం. మిత్రుడికి బాధ కలుగుతుందనేది కేసీఆర్ ఆలోచన. కానీ కేసీఆర్ పని అయిపోయింది. బీజేపీ ప్రభుత్వం రాగానే.. మా సీఎం ఎవరైనా కమల పుష్పాన్ని భద్రాచల రాముడి పాదపద్మాల ముందు అర్పిస్తాం. కేసీఆర్ ఇక భద్రాచలానికి రావాల్సిన అవసరం లేదు. స్టీరింగ్ చేతుల్లోలేని కేసీఆర్ కారు మనకు అవసరం లేదు..' అని అన్నారు.

బెదిరింపులకు వెనక్కు తగ్గం..

'బీజేపీ నేతలపై దౌర్జన్యాలు చేసి అక్రమ నిర్బంధాలు విధిస్తే, బెదిరింపులకు గురిచేస్తే వారు వెనక్కు తగ్గుతారని అనుకుంటున్నారు. మా కిషన్‌రెడ్డి, మా బండి సంజయ్, మా ఈటల రాజేందర్‌ను అడ్డుకుంటే మేం వెనక్కు తగ్గం. పేదలకు ఇళ్లు, యువతకు ఉద్యోగాలు, దళితులకు ఆర్థికంగా భరోసా ఇస్తామన్నారు. రైతులకు మరో హామీ ఇచ్చారు. ఇలా అబద్ధపు హామీలు ఇస్తూ కేసీఆర్ కాలం వెళ్లదీస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటే అని అంటున్నాడు. కానీ ఒవైసీ, కేసీఆర్‌తో బీజేపీ పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదు. ఈ రెండు పార్టీలతో కనీసం వేదిక కూడా పంచుకునే పరిస్థితి లేదు..' అని అమిత్‌షా స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో కేసీఆర్ రాజకీయం..

కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉండగా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.2 లక్షల కోట్ల నిధులు ఇచ్చింది. మేము ఒక్క తెలంగాణకే తొమ్మిదేళ్లలో రూ.2.80 లక్షల కోట్ల నిధులు ఇచ్చాం. రాష్ట్రంలో ప్రధాని మోదీ 33 లక్షల మంది పేదలకు మరుగుదొడ్లు కట్టించారు. 1.90 కోట్ల మంది పేదలకు నెలకు ఐదు కిలోల ఉచిత రేషన్ ఇస్తున్నాం. 11 లక్షల మందికి ఉజ్వల్ పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇచ్చాం. 2.5 లక్షల మంది పేదలకు ఇళ్లు నిర్మించాం. ఆనాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం రూ.22 వేల కోట్ల బడ్జెట్ పెడితే.. ఇవాళ మోదీ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ రూ.1.25 లక్షల కోట్ల బడ్జెట్ ఇచ్చింది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం రూ.7 లక్షల కోట్ల అప్పులు, ఇతర సబ్సిడీలిస్తే.. మోదీ ప్రభుత్వం రూ.20 లక్షల కోట్ల విలువైన సహాయ సహకారాలు అందిస్తోంది. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం 475 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వం 900 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించింది. ధాన్యం కొనుగోళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయం చేస్తున్నారు. మోదీ ప్రభుత్వమే తెలంగాణలో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించింది. పంటల కనీస మద్దతు ధరను మా ప్రభుత్వం 65 శాతం పెంచింది. దేశంలో 11 కోట్ల మంది రైతులకు రూ.2.60 లక్షల కోట్ల కిసాన్ సమృద్ధి నిధిని అందిస్తోంది..' అని షా తెలిపారు.

విల్లు ఎక్కుపెట్టి..

అమిత్‌షా సభావేదిక పైకి రాగానే ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ నేతలు బంగారు వర్ణంలో ఉన్న బాణం, విల్లును అందజేయడంతో ఆయన వాటిని ఎక్కుపెట్టారు. అలాగే నేతలు నాగలిని కూడా బహూకరించి, సీతారామచంద్రస్వామి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం గజమాలతో సన్మానించారు. కాగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ వేదికపైకి ఎక్కి పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్నప్పుడు, వారు మాట్లాడుతున్నంత సేపు సభికుల నినాదాల హోరు మిన్నంటింది. ఈ సభలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సాల్, మరో ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. బీజేపీ నేతలు గరికపాటి మోహన్‌రావు, బంగారు శ్రుతి, ఇంద్రసేనారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, మురళీధర్‌రావు, సోయం బాపూరావు, రఘునందన్‌రావు, వివేక్ వెంకటస్వామి తదితరులు కూడా హాజరయ్యారు.

కల్వకుంట్ల ప్రభుత్వానికి తిరోగమనం

'తెలంగాణలో అక్రమ, అవినీతి కుటుంబ పాలకులు రజాకార్ల మద్దతుతో కొనసాగుతున్నారు. తెలంగాణ కోసం యువత ప్రాణత్యాగం చేసింది. కానీ కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా రజాకార్ల పార్టీ ఎంఐఎంతో అంటకాగుతోంది. ఫలితంగా నాటి ప్రజల త్యాగాలకు విలువ లేకుండా పోయింది. ఎన్నికలు వస్తున్నాయి.. కల్వకుంట్ల ప్రభుత్వానికి తిరోగమనం మొదలైంది.. కేసీఆర్ తప్పకుండా ఓడుతున్నాడు. బీజేపీ ప్రభుత్వం పూర్తి మెజార్టీతో రాష్ట్రంలో అధికారంలోకి వస్తుంది..' అని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్ పాలనలో వ్యవసాయ విధ్వంసం

- రాష్ట్రాన్ని కల్తీ సీడ్‌బౌల్‌గా కల్వకుంట్ల కుటుంబం మార్చింది
- ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తన సబ్సిడీ, పంటల బీమా పథకం అమలు లేదు
- వ్యవసాయ రుణాలు లేవు.. మాఫీ లేదు
- ఖమ్మం సభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: తెలంగాణను విత్తన భాండాగారంగా చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారని, కానీ రాష్ట్రాన్ని కల్తీ సీడ్‌బౌల్‌గా కల్వకుంట్ల కుటుంబం మార్చిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ విధ్వంసం జరిగిందని విమర్శించారు. కల్తీ విధానాలపై ఉక్కుపాదం మోపుతామని అసెంబ్లీలో, బయట సీఎం కేసీఆర్ పేర్కొన్నప్పటికీ ఏ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన 'రైతుగోస.. బీజేపీ భరోసా' సభలో ఆయన మాట్లాడారు.

కేసీఆర్ హయాంలో వ్యవసాయం దండుగలా మారింది..

'వ్యవసాయ ఒక పండుగ అన్నారు కానీ కేసీఆర్ పాలనలో వ్యవసాయం దండుగ అనే పరిస్థితి ఏర్పడింది. ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తన సబ్సిడీ, పంటల బీమా పథకం అమలు చేయడం లేదు. గత తొమ్మిదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం పంటల బీమా పథకం అమలు చేయని కారణంగా లక్షలాది మంది రైతులు నష్టపోతున్నారు. ఇక వరి పంట వద్దని ప్రభుత్వమే చెబుతోంది. మరోవైపు వ్యవసాయ రుణాలు రావడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా వ్యవసాయ రుణాల మీద పావలా వడ్డీ ఇవ్వడం లేదు. రైతుబంధు అన్నింటికీ పరిష్కారంలా వ్యవహరిస్తోంది. అందరికంటే ఎక్కువగా కౌలు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆత్మహత్యల్లో 75 శాతం కౌలు రైతులవే ఉన్నాయి. ఐదేళ్లుగా రైతు రుణమాఫీ వాయిదా వేసి ఎన్నికలకు ముందు ప్రకటించారు. అయినా మెజార్టీ రైతులకు మాఫీ జరగలేదు. నాలుగున్నరేళ్లుగా వడ్డీలు, చక్రవడ్డీలు పెరిగిపోయి రూ.లక్ష అప్పు ఇప్పుడు రూ.2 లక్షలకు చేరింది. ధరణి పోర్టల్‌తో 20 లక్షల మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు..' అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని రకాలుగా సమస్యలను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని అనేక ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ అవినీతినే మిగిల్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా కుటుంబం కోసం బీఆర్‌ఎస్, కల్వకుంట్ల కుటుంబం పనిచేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలన్నా, ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరాలన్నా బీజేపీతోనే సాధ్యమని చెప్పారు.

ఎన్నికలొస్తేనే కేసీఆర్‌కు హామీలు గుర్తొస్తాయి

బండి సంజయ్



సాక్షి ప్రతినిధి, ఖమ్మం/తొర్రూరు: ఎన్నికల సమయంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హామీలు గుర్తుకొస్తాయని, మోసాలు చేయడంలో ఆయన పీహెచ్‌డీ పూర్తయిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన 'రైతుగోస– బీజేపీ భరోసా'సభలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని, ఉద్యమాల గడ్డ మాత్రమే కాక కేసీఆర్ దొంగ దీక్షను బయటపెట్టిన జిల్లా అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దొంగ పాస్‌పోర్టులు చేసిన దుబాయ్ శేఖర్ అని, ఆయన కొడుకు పేరు అజయ్‌రావు అయితే టికెట్ కోసం ఎన్‌టీఆర్ మెప్పు పొందడానికి తారక రామారావు అనే పేరు పెట్టాడని ఆరోపించారు. ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందంతో ముందుకొస్తున్నాయన్నారు. అప్పుల రాష్ట్రం ధనిక రాష్ట్రం కావాలన్నా, ప్రజల బాధలు పోవాలన్నా డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని చెప్పారు. కాగా ఖమ్మం వెళుతూ మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో సంజయ్ కొద్దిసేపు ఆగారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పార్టీ నాయకుడు అలిసేరి రవిబాబును పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్ కంటే కేసీఆరే డేంజర్ అని వ్యాఖ్యానించారు. హామీలను విస్మరిస్తూ ప్రజలను నట్టేట ముంచిన బీఆర్‌ఎస్‌కు ఓటేయవద్దని, సామాన్యుల కోసం కొట్లాడుతున్న బీజేపీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్ చేతల ప్రభుత్వం కాదు: ఈటల



బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటలతోనే సరిపెడుతుంది తప్ప చేతల ప్రభుత్వం కాదని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎన్నికలు వస్తుండడంతో రైతులను మోసం చేసేందుకు కేసీఆర్ కొత్త మాటలు చెబుతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక తరుగు లేకుండా ధాన్యం కొంటామని, రైతుల హక్కుగా అందాల్సిన అన్ని సబ్సిడీలు అందిస్తామని హామీ ఇచ్చారు.

మీ మధ్యే డీల్.. దోస్తీ!

సాక్షి, హైదరాబాద్: చేవెళ్ల సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వచ్చి అబద్ధాలతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకు విఫలయత్నం చేశారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య అంతర్గత స్నేహం కుదిరిందని, అందువల్లే పరస్పర విమర్శలు మానేశారని ఖర్గే చేసిన వ్యాఖ్య లను ఆదివారం ఒక ప్రకటనలో తప్పుబట్టారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు ఓటేసినట్టేనని ప్రజలకు అర్థం కావడంతో నష్ట నివారణ చర్యల్లో భాగంగా ఖర్గే పూర్తి అబద్ధాలు మాట్లాడారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్‌తో దోస్తీ లేదనే విషయాన్ని ఖర్గే నిరూపించాలనుకుంటే తన ప్రశ్నలకు సమాధానమిచ్చి బీజేపీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమాధానం ఇవ్వకపోతే రాష్ట్రంలో వారి మధ్య పొత్తుందని అంగీకరించేనట్లేనని అన్నారు.

కిషన్‌రెడ్డి సంధించిన 8 ప్రశ్నలివీ..

- పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి భూమి లేదని బుకాయిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో ఎకరం భూమి కేవలం రూ.2 లక్షల చొప్పున పది ఎకరాలు కట్టబెట్టడం వాస్తవం కాదా? దీని వెనుక ఎలాంటి డీల్ లేదని ఖర్గే చెప్పగలరా?
- కేటీఆర్ ఇటీవల బీజేపీ ఓటమికి గాను బీజేపీ వ్యతిరేక కూటమితో కలిసి పోరాడతామని, సంకీర్ణ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తామని చెప్పడం మీ రెండు పార్టీల మధ్య ఉన్న అవగాహనకు ఒక ఉదాహరణ కాదా?
- తెలంగాణలో చేతి గుర్తుమీద గెలిచిన చాలామంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేయకుండానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. వారిపై పార్టీ ఫిరాయింపుల చట్టం కింద మీరు చర్యలు తీసుకోకపోవడం మీ రెండు పార్టీల మధ్య ఉన్న సత్సంబంధాలకు నిదర్శనం కాదా?
- రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలపడంతో పాటు ఎన్నికల ప్రచారాన్ని తెలంగాణలో కేసీఆర్ ముందుండి నడపడం నిజం కాదా?
- శాసనమండలిలో కాంగ్రెస్‌ను పూర్తిగా బీఆర్‌ఎస్‌లో విలీనం చేసినపుడు స్పందించకపోవడం మీ మధ్య దోస్తీకి పరాకాష్ట కాదా?
- బీఆర్‌ఎస్, మజ్లిస్‌తో కలిసి మీ పార్టీ ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నది నిజం కాదా?
- కేంద్ర ప్రభుత్వంపై ఇటీవలి అవిశ్వాస తీర్మానానికి మీ రెండు పార్టీలూ అనుకూలంగా ఓటు వేసిన విషయం వాస్తవం కాదా?
- కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో కేసీఆర్ కేంద్ర మంత్రిగా పని చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర మంత్రులుగా అధికారాన్ని అనుభవించలేదా? అప్పటినుంచే మీ స్నేహం కొనసాగుతున్నది నిజం కాదా?

ఖర్గేపై కిషన్‌రెడ్డి ధ్వజం

- చేవెళ్ల సభలో వచ్చి అబద్ధాలు మాట్లాడారు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు ఓటేసినట్టేనని ప్రజలకు అర్థం అయ్యింది
- మీ మధ్య దోస్తీ లేకపోతే నా ప్రశ్నలకు బదులివ్వండి

బీజేపీలో పలువురి చేరిక

ఖమ్మం మయూరి సెంటర్: ఆదివారం ఖమ్మంలో జరిగిన 'రైతు గోస–బీజేపీ భరోసా'సభ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్‌షా సమక్షంలో పలు జిల్లాలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. మాజీ ఐఏఎస్ అధికారి రామచంద్రుడు, డాక్టర్ కాశీ ప్రసాద్, డాక్టర్ రఘునందన్, గడ్డం సాయికిరణ్, జెడ్పీటీసీ సంగీత, పుష్పాల స్వప్న, గుగులోతు స్వరూప, వి.అమిత్‌కుమార్, బోడ పున్నయ్యనాయక్, రాథోడ్ కృష్ణ, కాశీరాం నాయక్, శ్యాంరావు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

డీకే అరుణను సన్మానించిన అమిత్‌షా

ఖమ్మం మయూరి సెంటర్: గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణను ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆమెను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శాలువాతో సత్కరించారు. ఉన్నత న్యాయస్థానంలో అరుణ చేసిన న్యాయ పోరాటాన్ని రైతు గోస–బీజేపీ భరోసా సభలో అమిత్‌షా ప్రశంసించారు. 'బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, సోదరి అరుణ సుదీర్ఘ న్యాయపోరాటం చేసి, గెలిచి ఎమ్మెల్యే అయ్యారు'అని ఆయన ప్రస్తావించడంతో ఒక్కసారిగా బీజేపీ శ్రేణులు హర్షధ్వానాలు చేశాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా తన ప్రసంగంలో అరుణ న్యాయపోరాటంలో విజయం సాధించారని వెల్లడించారు.

అధికార పార్టీపై తీవ్ర అసంతృప్తి!

బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో అమిత్‌షా

- కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత.. మనకు పూర్తిగా అనుకూల వాతావరణం
- రాష్ట్రంలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమే.. తాజా నివేదికలు చెబుతున్నదిదే..

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వంపై, అధికార బీఆర్‌ఎస్ పార్టీపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి ఉందని బీజేపీ అగ్రనేత, కేంద్రమంత్రి అమిత్‌షా చెప్పారు. పరిస్థితి బీజేపీకి సానుకూలంగా ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయని, తెలంగాణలో ఏర్పడబోయేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు యావత్ పార్టీ యంత్రాంగం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పడేది బీజేపీ సర్కారే అనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో ముఖ్యనేతలు ఆధిపత్య పోరుకు, గ్రూపులకు ఆస్కారం ఇవ్వకుండా ఐక్యంగా ముందుకెళ్లాలని ఆదేశించారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సహాయ సహకారాలు అందించేందుకు జాతీయ నాయకత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆదివారం ఖమ్మంలో 'రైతు గోస– బీజేపీ భరోసా'బహిరంగ సభ అనంతరం రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు, కోర్ కమిటీతో సమావేశమైన అమిత్‌షా ఎన్నికలకు సంబంధించిన అంశాలపై దిశానిర్దేశం చేసినట్టు పార్టీవర్గాలు వెల్లడించాయి.

5సీ ప్రాతిపదికగా పనిచేయాలి

బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటే అని సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో పనిగట్టుకుని సాగుతున్న దుష్ప్రచారాన్ని కార్యకర్తలు ఖండిస్తూ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని షా ఆదేశించారు. రాష్ట్ర నేతల అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు. బీజేపీ అగ్రనాయకత్వం వద్ద రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి ఉన్న సమాచారం, వివిధ రూపాల్లో నిర్వహించిన సర్వేల్లో వెల్లడైన వివరాలు వెల్లడించారు. పార్టీ గెలుపు విషయంలో నాయకులు పూర్తి విశ్వాసంతో ముందుకెళ్లాలని, పార్టీ కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపాలని సూచించారు. క్లారిటీ, కాన్ఫిడెన్స్, కమిట్‌మెంట్, కోఆర్డినేషన్, క్రెడిబిలిటీ (5 సీ) ప్రాతిపదికగా పనిచేయాలని, ప్రజలకు అన్ని విషయాల్లో స్పష్టత ఇస్తూ నేతలు చిత్తశుద్ధి, సమన్వయంతో పార్టీపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంచేలా కృషి చేయాలని చెప్పారు.



అవినీతిని వెలికితీసి ప్రచారం చేయండి

రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై అమిత్‌షా చర్చించినట్టు పార్టీవర్గాల సమాచారం. ఈ రెండు పార్టీలతో పాటు మజ్లిస్ రాజకీయ ఎత్తుగడలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికతో సాగాలని సూచించారు. గత తొమ్మిదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు సహా వివిధ కార్యక్రమాలు, పథకాల అమల్లో బీఆర్‌ఎస్ సర్కార్ అవినీతికి సంబంధించిన వివరాలు, సమాచారాన్ని వెలికితీసి వాటిని ప్రజల్లో ప్రచారం చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని అసంతృప్త నేతలు, టికెట్ దక్కనివారితో పాటు రెండు పార్టీల అసంతృప్త ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్‌ను బీజేపీలో చేర్చుకునే విషయంలో వేగం పెంచాలని చెప్పారు. ఎన్నికల మేనేజ్‌మెంట్, వ్యూహ, ప్రతి వ్యూహాలు, ఎత్తుగడలకు సిద్ధం కావాలన్నారు. మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో తెలంగాణలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని సూచించారు.

ఎన్నికల సన్నద్ధతపై లోతుగా సమీక్ష

రాబోయే 3, 4 నెలల్లో జరగనున్న అసెంబ్లీ, వచ్చే ఏడాది మొదట్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర పార్టీ సన్నద్ధతపై అమిత్‌షా సమీక్ష నిర్వహించినట్టు తెలిసింది. పార్టీపరంగా పట్టున్న, కచ్చితంగా గెలిచే అవకాశాలున్న ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలెన్ని? వీటితో పాటు బీజేపీ బలాలు కేంద్రీకరించి విజయం కోసం కృషిచేస్తున్న నియోజకవర్గాలు, పార్టీ రెండోస్థానంలో నిలిచే అవకాశాలున్న సీట్లు ఏవేవి అన్న దానిపై ఆరా తీసినట్టు సమాచారం. ఈ భేటీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శులు బండి సంజయ్, తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్, ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, పార్టీ నేతలు నల్లు ఇంద్రసేనారెడ్డి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో సమీక్ష సమావేశాలు


బీజేపీ ఈ నెల 29, 30 తేదీల్లో ఉమ్మడి జిల్లాల వారీగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమీక్ష సమావేశాలు నిర్వహించనుంది. ఎమ్మెల్యేల ప్రవాస యోజన, అసెంబ్లీ స్థానాల వారీగా బూత్ కమిటీలు, సెప్టెంబర్ 7న చలో హైదరాబాద్, నా మట్టి నా దేశం, బస్సు యాత్ర, ఓటర్ వెరిఫికేషన్, సెప్టెంబర్ 17 తదితర అంశాలపై చర్చించనుంది. పార్టీ ముఖ్య నేతలు సునీల్ బన్సల్ (మెదక్, ఖమ్మం), అరవింద్ మీనన్ (ఆదిలాబాద్, నిజామాబాద్), తరుణ్ ఛుగ్ (కరీంనగర్, నల్లగొండ), ప్రకాష్ జవదేకర్ (మహబూబ్‌నగర్, వరంగల్), బండి సంజయ్ (ఆదిలాబాద్), డీకే అరుణ (నిజామాబాద్) హాజరుకానున్నారు.

కమలదళం... అమితోత్సాహం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన రాష్ట్ర బీజేపీలో నూతనోత్సాహం నింపింది. ఉమ్మడి ఖమ్మంజిల్లా పరిధిలో బీజేపీకి రాజకీయంగా అంతగా బలం లేదన్న విమర్శలను తిప్పికొట్టేందుకు అమిత్‌షా బహిరంగసభ ఉపయోగపడిందని పార్టీనాయకత్వం భావిస్తోంది. ఈ సభకు పెద్దసంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు హాజరుకావడం ..అమిత్‌షాతో పాటు ఇతరనేతల ప్రసంగాలకు వారి నుంచి మంచి స్పందన రావడం కలిసొస్తుందని అనుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేసీఆర్ సర్కార్‌పై తీవ్ర విమర్శలతోపాటు కాంగ్రెస్, ఎంఐఎంలపైనా విమర్శలను ఎక్కుపెట్టడంపై పార్టీకేడర్‌లో హర్షం వ్యక్తమవుతోంది. రెండు మూడునెలలుగా అనివార్య కారణాల వల్ల పలుమార్లు అమిత్‌షా ఖమ్మంజిల్లా పర్యటన రద్దు అయ్యింది. దీంతో కొంత నిరుత్సాహంతో ఉన్నా, ఉమ్మడి జిల్లా పార్టీనాయకులు, కార్యకర్తల్లో ఆదివారం సభ విజయవంతం కావడం మంచి ఉత్సాహం నింపిందని చెబుతున్నారు. మొత్తంగా రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన కేడర్‌లో పార్టీపట్ల విశ్వాసం, నమ్మకం పెంచేందుకు ఈ సభ ఉపయోగపడిందని భావిస్తున్నారు. ఈ సభ విజయవంతం చేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు బీజేపీనేత, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఖమ్మంజిల్లాలో బీజేపీ సత్తా అంటే ఏమిటో అమిత్ షా సభ ద్వారా తెలిసొచ్చిందన్నారు.

ఎస్సీ, ఎస్టీల వెనుకబాటుకు కాంగ్రెస్సే కారణం

మంత్రి సత్యవతి



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎస్సీ, ఎస్టీల వెనుకబాటుకు కాంగ్రెస్‌పార్టీనే కారణమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. తెలంగాణలో దళితులు, గిరిజనులు ఆ పార్టీ కుట్రలను తిప్పి కొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ఆదివారం బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఎంపీ మాలోత్ కవిత, ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌తో కలిసి మంత్రి సత్యవతి మాట్లాడారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చింది సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. నాలుగు లక్షల ఎకరాలకు పైగా పోడు భూముల పట్టాల పంపిణీ చేశామని, మా గూడెంలో మా రాజ్యం కావాలన్న గిరిజన బిడ్డలు కోరిక నెరవేర్చామని చెప్పారు. కానీ కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలు చేస్తూ రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు 75 ఏళ్లలో సేవలాల్ జయంతి వేడుకలు నిర్వహించారా? అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తే మాయల పకీర్లు అనేకమంది వస్తుంటారని, మనకున్న చైతన్యంతో ఇలాంటి మాయల పకీర్లను తరిమికొట్టాలని సూచించారు. అందితే జుట్టు.. అందకపోతే కాళ్లు పట్టుకునే రేవంత్ రెడ్డి లాంటి వాళ్లను కూడా తరిమి కొట్టాలని సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. మరోవైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలనే కాపీకొట్టి పేర్లు మార్చడం తప్ప కాంగ్రెస్ డిక్లరేషన్‌లో కొత్తగా ఏమీలేదని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఓ ప్రకటనలో విమర్శించారు.



గృహ'లక్ష్మీ కటాక్షం' లేదంట

➤ పూరి గుడిసెలో జీవితాన్ని వెళ్లదీస్తున్న ఈమె పేరు గాలి ఉపేంద్ర. మహబూబా బాద్ జిల్లా నల్లెల గ్రామం. డబుల్ బెడ్రూం రాలేదు. చివరకు సొంత జాగాలో ఇల్లు కట్టుకునేందుకు గృహలక్ష్మి పథకంలో రూ.3 లక్షలైనా ఇస్తారన్న ఆశతో దరఖాస్తు చేసింది. అన్ని అర్హతలున్న తనకు లబ్ధి చేకూరుతుందని ఎదురుచూసింది. కానీ ఈ మారు కూడా ఇళ్లు ఇవ్వటం లేదని గ్రామ నాయకులు తేల్చేశారు.

అర్హతలున్నా ఎంపిక చేయలేదు..!

➤ ఈమె పేరు రాచమల్ల మంజుల. సీఎం కేసీ ఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని అలిరాజపేట గ్రామం. ఇటీ వల భర్త చనిపోవటంతో కొడుకు శ్రీకాంత్‌తో కలిసి ఇస్త్రీ షాపునకు అవసరమయ్యే పని ముట్లు కొనేందుకు బీసీబంధు పథకంలో లక్ష రూపాయల కోసం దరఖాస్తు చేసుకుంది. ఇలా ఈ ఊరిలో మొత్తం 33 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం ఇద్దరినే ఎంపిక చేశారు. అయితే ఆ ఇద్దరు తమకంటే అన్ని విధాలుగా బాగా ఉన్నవారేనని మంజుల పేర్కొంది.



సంక్షేమ జాతర.. అర్హులకు టోకరా!

ప్రభుత్వ పథకాల్లో నిబంధనలకు పాతర.. రాజకీయ దన్ను లేదా బలమైన సిఫారసు ఉంటేనే చాన్స్!

- అయినవారికి, అనుచర గణానికే గృహలక్ష్మి, బీసీ, మైనారిటీ బంధు
- ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే జాబితాల రూపకల్పన
- కనీస పరిశీలన లేకుండా అధికార యంత్రాంగాల ఆమోద ముద్ర
- అన్ని అర్హతలున్నా సాయం అందక నిరుపేదల్లో నిరాశ

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు ప్రవేశ పెడుతోంది. అయితే అవి అర్హులకు అందడం లేదని, నిరుపేదలకు నిరాశే ఎదురవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయ దన్ను లేదా బలమైన సిఫారసు ఉంటేనే గృహలక్ష్మి, బీసీ, మైనారిటీ బంధు పథకాల జాబితాలో చోటు దక్కుతోందని ఆయా పథకాలకు అన్ని విధాలా అర్హులైన వారు వాపోతున్నారు. పోటీ తీవ్రంగా ఉండటంతో.. 'ఇప్పటికైతే పార్టీలో ముఖ్య నాయకులు, కార్యకర్తలకే పంచేద్దాం..ఈ మేరకు గ్రామాల వారీగా జాబితాలు పంపండి' అంటూ ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జాబితాలు సిద్ధం అవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గృహలక్ష్మి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 3.57 లక్షల ఇళ్లకు గాను 14.91 లక్షల దరఖాస్తులు వచ్చాయి. బీసీబంధు పథకం కింద ఒక్కో నియోజకవర్గంలో 300 మందికి, మైనారిటీ బంధు కింద 100 మందికి ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. ఈ రెండు పథకాలకూ వేలల్లో దర ఖాస్తులు వచ్చాయి. పలు జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపికను దాదాపు పూర్తి చేశారు. వాస్తవానికి అత్యంత నిరుపేదలకు, ఇచ్చే ఆర్థిక సహాయాన్ని జీవనోపాధికి ఉపయోగించుకునే సాంకేతికత, ఇతర పరిజ్ఞానం ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా.. ఎమ్మెల్యేలు చెప్పినవారికి, బంధుగణానికి ప్రాధాన్యత ఇస్తున్నారని, కొన్ని చోట్ల అర్హుల జాబితాల్లో చేర్చేందుకు 10 నుంచి 30% కమీషన్ మాట్లాడుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు ఇచ్చే జాబితాలను తమసిబ్బందితో కలిసి పరిశీలించాల్సిన జిల్లా యంత్రాంగాలు, కనీస పరిశీలన లేకుండానే ఆమోద ముద్ర వేసేసి చేతులు దులుపుకొంటూ సంక్షేమాన్ని పక్కదారి పట్టిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

పథకం ఏదైనా అదే తీరు..

డబుల్ బెడ్రూంలు దక్కని నిరుపేద తన సొంత జాగాలో ఇల్లు కట్టుకుంటే మూడు దశల్లో రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తారు. ఇందులో బీసీలకు 50 శాతం, ఎస్సీలకు 20, ఎస్టీలకు10, ఇతరులకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. ఆయా కులాల్లో దివ్యాంగులుంటే వారికి 5 శాతం కేటాయించాలి. కానీ మెజారిటీ నియోజకవర్గాల్లో ఈ నిబంధనలు పాటించలేదు. చేతి వృత్తులే జీవనాధారమైన నాయీ బ్రాహ్మణ, రజక, సగర పూసల, మేదరి, వడ్డెర, ఆరెకటిక, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, కంచరి ఇతర ఎంబీసీ కులాల్లో పేదరికం, వృత్తి నైపుణ్యం ఆధారంగా ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అయితే ఈ ప్రాధాన్యతలేవీ పాటించటం లేదని జిల్లా కలెక్టర్లకు చేరిన జాబితాలు చూస్తే అర్థం అవుతోంది. మైనారిటీ బంధులో లబ్ధిదారుల సంఖ్య తక్కువే ఉన్నప్పటికీ ఇందులో కూడా నిబంధనలు, ప్రాధాన్యతల పాటింపుపై అక్కడక్కడా ఆరోపణలు వినిపిస్తుండటం గమనార్హం.

లక్ష రూపాయల ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులు ఇలా..

ఉమ్మడి జిల్లా	బీసీ బంధు	మైనారిటీ
మెదక్	55,310	16,111
వరంగల్	59,534	14,038
మహబూబ్‌నగర్	66,863	15,377
ఆదిలాబాద్	42,906	19,450
ఖమ్మం	28,540	3,572
హైదరాబాద్	20,724	3,508
నిజామాబాద్	40,490	6,430
రంగారెడ్డి	44,166	8,200
నల్లగొండ	78,215	9,638
కరీంనగర్	58,410	20,455

గృహలక్ష్మి కోసం అత్యధిక దరఖాస్తులు వచ్చిన ఏడు జిల్లాలు

జిల్లా	కేటాయించిన ఇళ్లు	వచ్చిన దరఖాస్తులు	అర్హులుగా తేలిన వారు
ఆదిలాబాద్	7,400	66,914	41,050
భద్రాద్రి	12,300	87,530	32,788
ఖమ్మం	15,500	82,115	49,619
మహబూబ్‌నగర్	8,660	60,613	38,353
నల్లగొండ	16,800	78,891	44,003
వికారాబాద్	10,950	65,027	47,623
మంచిర్యాల	9,400	51,296	40,522

పథకాలు కలెక్టర్లకు అప్పగించాలి..



ప్రస్తుతం అమలు చేస్తున్న దళిత, మైనారిటీ, బీసీ బంధుతో పాటు నిరుపేదల ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం పథకాలు పూర్తి పక్కదారి పట్టాయి. రాష్ట్ర ప్రజలు పన్నులతో వచ్చిన ఆదాయం దుర్వినియోగం అవుతోంది. నిజమైన అర్హులకు కాకుండా గ్రామ స్థాయి పార్టీ నాయకులు, ఎమ్మెల్యేల ద్వారా జరుగుతున్న ఎంపికలతో వాస్తవ పేదలకు న్యాయం జరగడం లేదు. వెంటనే ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో కలెక్టర్లకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం అందించే ప్రతి పైసా నిరుపేదల ఆర్థిక ప్రగతికి ఉపకరించేలా చర్యలు తీసుకోవాలి.

– పద్మనాభరెడ్డి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

సీపీఐ నేతలతో ఠాక్రే భేటీ

- పొత్తుకు సానుకూల వాతావరణం ఏర్పాటు
- మరోవైపు బీఆర్ఎస్ నేతల్లో పునరాలోచన
- ఇప్పటికిప్పుడు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని సంకేతాలు
- ఈ ప్రతిపాదనను వ్యతిరేకించిన వామపక్షాలు?



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌తో బ్రేకప్ తర్వాత కమ్యూనిస్టు పార్టీలతో కాంగ్రెస్ పార్టీ రాయబారం మొదలుపెట్టింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష పార్టీలతో జత కట్టాలని భావిస్తోంది. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఓ స్థాయిలో కమ్యూనిస్టు పార్టీలకు ఓట్లు ఉండటం, ఇతర జిల్లాల్లోనూ అనేక చోట్ల ప్రభావితం చేయగలిగే పరిస్థితి నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సీపీఐ, సీపీఎంలతో పొత్తుకు సిద్ధం కావాలని యోచిస్తోంది. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావుఠాక్రే కమ్యూనిస్టులతో మధ్యవర్తిత్వం మొదలుపెట్టారు. హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీపీఐ నేతలు కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకటరెడ్డి, చాడ వెంకటరెడ్డితో సమావేశమయ్యారు. 'బీజేపీని ఓడించాలన్న కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తాము సిద్ధం. అందుకోసం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. ఎందుకంటే ఇండియా కూటమిలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కీలకంగా ఉన్నారు. అయితే మాకు గౌరవ ప్రదంగా సీట్లు కేటాయిస్తే జత కడతామని'సీపీఐ నేతలు అన్నట్లు తెలిసింది. కాగా త్వరలోనే కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య మరోసారి చర్చలు జరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

సాగదీత ధోరణి వద్దని చెప్పాం: కూనంనేని

ఈ విషయంపై కూనంనేని మాట్లాడుతూ, 'కాంగ్రెస్‌తో పొత్తుపై మాణిక్‌రావు ఠాక్రేతో చర్చలు జరిగాయి. సానుకూల వాతావరణంలో మేం మాట్లాడుకున్నాం. పొత్తుల విషయంలో సాగదీత ధోరణి వద్దని స్పష్టం చేశాం. ఒకట్రెండు సార్లు చర్చలతోనే అన్నీ జరిగిపోవాలి. అంతేగానీ బీఆర్ఎస్ వలె ఒకటిస్తాం... రెండిస్తాం అన్న ధోరణితో ఉంటే అసలు చర్చలే అవసరంలేదని మధ్యవర్తితో చెప్పాం. అన్నీ సక్రమంగా జరిగితే పొత్తుకు ముందుకు వస్తాం. గౌరవ ప్రదంగా సీట్లు కేటాయించకుండా సాగదీత ధోరణితో వ్యవహరిస్తే మా దారి మేం చూసుకుంటామ'ని చెప్పామన్నారు. మరోవైపు సీపీఎం నేతలతోనూ ఠాక్రే రాయబారం చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నందున ఎప్పుడు చర్చలు జరుగుతాయో చూడాలి. కాగా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం ఇండియా కూటమిలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కీలకంగా ఉన్న నేపథ్యంలో తెలంగాణలో కమ్యూనిస్టులతో పొత్తుతో ముందుకెళ్లాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు స్పష్టం చేసినట్టు సమాచారం.

బీఆర్ఎస్ పునరాలోచన...?

బీఆర్ఎస్ పార్టీ ఏకపక్షంగా తన అభ్యర్థులను ప్రకటించడంతో కమ్యూనిస్టులు తీవ్ర ఆగ్రహంతో ఉన్న విషయం తెలిసిందే. కమ్యూనిస్టులను ఉపయోగించుకొని వదిలేశారని, మోసం చేశారంటూ పెద్ద ఎత్తున విమర్శలు రావడం, మరోవైపు కమ్యూనిస్టులు కాంగ్రెస్ వైపు వెళ్తే నష్టం జరుగుతుందన్న అంచనాకు రావడం తదితర కారణాలతో బీఆర్ఎస్ పునరాలోచనలో పడినట్టు తెలిసింది. బీఆర్ఎస్‌కు చెందిన ఒక నేత కమ్యూనిస్టులతో మళ్లీ రాయబారం నడుపుతున్నట్టు సమాచారం. 'జరిగిందేదో జరిగింది. మనం మళ్లీ పొత్తు పెట్టుకుందాం. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు. అవసరమైతే ఇప్పటికిప్పుడు చెరో ఎమ్మెల్సీ స్థానం ఇస్తాం. అందు కోసం ప్రస్తుతమున్న ఎమ్మెల్సీలను రాజీనామా చేయిస్తాం. అసెంబ్లీ సీట్లపైనా ఒక అవగాహనకు వద్దాం'అన్నట్లు తెలిసింది. కానీ కమ్యూనిస్టు పార్టీల నేతలు ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు సమాచారం. మరి చివరి వరకు కమ్యూనిస్టులు అదే పట్టు కొనసాగిస్తారా.. ఎన్నికల నాటికి వారి పొత్తు ఎటువైపు దారితీస్తుందో చూడాలి.!

30న సీపీఎం అభ్యర్థుల తొలి జాబితా ప్రకటన!

సీపీఎం రాష్ట్ర కమిటీ కీలక నిర్ణయం.. బీఆర్ఎస్‌తో పొత్తు విఫలంపై వాడీవేడి చర్చ

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయబోయే అభ్యర్థులతో ఈ నెల 30వ తేదీన మొదటి జాబితా విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పొత్తులకు సంబంధించిన అంశంపై చర్చించేందుకు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదివారం సమావేశమైంది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీల తరపున చెరో ఐదు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాలని పార్టీ భావిస్తోంది. ఈ మేరకు 30న సీపీఐ, సీపీఎం సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించే అవకాశముంది. వామపక్షాలతో పొత్తు ఉండబోదని బీఆర్ఎస్ పార్టీ తేల్చిచెప్పడంతో ఈ రెండుపార్టీలు ఈ నిర్ణయానికి వచ్చాయి. కాగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో సీపీఐ నేతలు ఆదివారం భేటీ అయిన సంగతి తెలిసిందే. ఠాక్రే సీపీఎంతో కూడా సోమవారం సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌తో పొత్తు కుదిరితే సరే సరే, లేకుంటే ఉభయ కమ్యూనిస్టు పార్టీల తరపున రెండో జాబితా కూడా విడుదల చేసే అవకాశం ఉంది. ఎవరితో పొత్తు లేకపోతే రెండు పార్టీలు కలిసి దాదాపు 20 నుంచి 24 మధ్య అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. కాగా, సీపీఎం రాష్ట్ర కమిటీలో బీఆర్ఎస్ తీరుపై వాడీవేడి చర్చ జరిగినట్లు తెలుస్తుంది. బీఆర్ఎస్‌తో పార్టీ వ్యవహరించినతీరుపై కూడా కొందరు నాయకులు విమర్శించినట్లు సమాచారం. బీఆర్ఎస్ తీరును ముందే ఎందుకు అర్థం చేసుకోలేకపోయామని నిలదీసినట్టు తెలిసింది. రాబోయే ఎన్నికల్లో ప్రజాతంత్ర లౌకిక పార్టీలతో ముందుకు సాగాలని పార్టీ నిర్ణయించింది.



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం. చిత్రంలో చెరుపల్లి సీతారాములు, బీవీ రాఘవులు



కంటోన్మెంట్‌లో ఇతర పార్టీలు పోటీ చేయొద్దు

దివంగత సాయన్న కుమార్తెను గెలిపించాలని తలసాని పిలుపు

కంటోన్మెంట్ (హైదరాబాద్): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందితపై ఇతర పార్టీలు పోటీ పెట్టొద్దని మంత్రి తలసాని కోరారు. ఆదివారం కార్ఖానాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ, లాస్యనందిత గెలుపు లాంఛనమేనని, ఇతర పార్టీలు పోటీ చేసినా వృథా ప్రయాసే అవుతుంది కాబట్టి అన్ని పార్టీలు ఆమె గెలుపునకు సహకరించాలని కోరారు. లాస్య లక్ష ఓట్ల మెజారిటీతో గెలవడం ఖాయం అన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధికి సాయన్న విశేషమైన కృషి చేశారని అన్నారు. తనను కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు సహకారం అందించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని లాస్య ప్రకటించారు. ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశానికి కీలక నేతలు డుమ్మా కొట్టారు. మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, శ్రీగణేశ్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో పాటు ఆయా నేతల అనుచరవర్గం మంత్రి సమావేశానికి గైర్హాజయ్యారు. ముప్పిడి మధుకర్ సైతం తనకు సమాచారం లేనందునే రాలేదని పేర్కొనడం గమనార్హం.

టికెట్టు సారూ..

సీఎం ఫ్లెక్సీకి సాష్టాంగ నమస్కారం

జనగామ: రెండున్నర దశాబ్దాలుగా క్రియాశీల రాజ కీయాల్లో ఉంటూ.. స్థానికుడినైన తనకు జనగామ బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలని ఆప్కో మాజీ చైర్మన్, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మండల శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఏఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన సభలో ఆయన సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి సాష్టాంగ నమ స్కారం చేశారు. నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులతో ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. కేసీఆర్ మూడోసారి సీఎంగా ప్రమాణ స్వీకా రం చేయాలని ప్రార్థించి, టికెట్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో 115 మంది అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్, జనగామలో బీసీకి అవకాశం ఇచ్చేందుకే పెండింగ్‌లో ఉంచారని స్పష్టం చేశారు. కేటీఆర్ అమెరికా పర్యటన నుంచి వచ్చాక సీఎం, హరీశ్ రావు నేతృత్వంలో తనకే టికెట్ కేటాయిస్తూ.. శుభవార్త చెబుతారని శ్రీరాములు ఆశాభావం వ్యక్తం చేశారు.

మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థిని మార్చాలి

మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేరును ఖరారు చేయగా, ఆ అభ్యర్థిని మార్చాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం అరవిందరెడ్డి డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని తన నివాసంలో తెలంగాణ ఉద్యమకారులు, తన అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుల్ని విస్మరించడం సరికాదన్నారు. ఉద్యమకారుల్ని పక్కన పెట్టి, ఒకే సామాజికవర్గం వారికే టికెట్ ఇవ్వడం వల్ల దొరల పెత్తనం రాజ్యమేలుతోందని ఆరోపించారు. వారం రోజుల్లోగా పార్టీ అధిష్టానంతో చర్చించి, స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థిని మార్చాలని కోరతామని తెలిపారు. గతంలో పార్టీ కోసం తన ఆస్తిని త్యాగం చేసి, తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తే, తనను రెండుసార్లు పార్టీ మోసం చేసిందని పేర్కొన్నారు.

కవితనెందుకు అరెస్ట్ చేయలేదు? సంజయ్‌ను ఎందుకు తొలగించారు?

- 'ఎమ్మెల్యే ప్రవాస్‌యోజన'లో ఇతర రాష్ట్రాల బీజేపీ ప్రజాప్రతినిధులకు ప్రజలు, కేడర్ నుంచి ఎదురైన ప్రశ్నలు
- ఆదివారంతో ముగిసిన పర్యటనలు.. నెలాఖరులోగా నాయకత్వానికి ఫీడ్‌బ్యాక్ రిపోర్టులు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ పలుమార్లు విచారణ జరిపినా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేయకపోవడానికి కారణం ఏమిటీ..? బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను అకస్మాత్తుగా అసెంబ్లీ ఎన్నికల కు ముందు ఎందుకు మార్చారు..? రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి రాజకీయ పరిస్థితులపై ఆరా తీసిన సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ప్రజలు, పార్టీ కేడర్ నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన 119 మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రధానంగా ఈ రెండు ప్రశ్నలు ఎదురైనట్టు తెలిసింది. ఈ నెల 20వ తేదీ నుంచి 27 దాకా 'ఎమ్మెల్యే ప్రవాస్ యోజన'లో భాగంగా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, ఒడిశా, అస్సాం, పుదుచ్చే రిలకు చెందిన బీజేపీ ప్రజాప్రతి నిధులు చేపట్టిన క్షేత్ర స్థాయి పర్యటనలు ఆదివారంతో ముగిశాయి. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు నుంచి తమకు అందిన సమాచారాన్ని ఫీడ్‌బ్యాక్ రిపోర్ట్ రూపంలో ఈ నెల 28–31 తేదీల మధ్య బీజేపీ జాతీయ నాయకత్వానికి నివేదికలు సమర్పిస్తామని ఎమ్మెల్యే ప్రవాస్ యోజన తెలంగాణ ఇన్‌చార్జ్ భువనేశ్వర్ ఎంపీ అపరాజిత సారంగి తెలిపారు.

ఇంకా ఏం చెప్పారంటే....

- ఎమ్మెల్సీ కవిత అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, చర్యలు తప్పవంటూ జాతీయ అగ్రనాయకత్వం మొదలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యనేతల వరకు ప్రకటనలు గుప్పించి.. ఈ దిశలో ఏ చర్యలు చేపట్టకపోవడం పార్టీకి నష్టం చేసిందని కొందరు తమ అభిప్రాయం చేసినట్టు తెలిసింది.
- బండి సంజయ్‌ను అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించడం కూడా ఎన్నికలకు సన్నద్ధమవుతున్న దశలో పార్టీ గ్రాఫ్ పడిపోవడానికి కారణమైందని కొందరు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం.
- పార్టీకి పట్టున్న నియోజకవర్గాల్లో ప్రస్తుతం పోటీ చేయాలనుకుంటున్న నేతల బలం సరిపోతుందా.. స్థానికంగా నాయకుల పని తీరు, సమన్వ యం ఎలా ఉంది వంటి అంశాలను పలువురు ప్రస్తావించినట్టు తెలిసింది.
- పార్టీ సంస్థాగతంగా అక్కడక్కడ బలంగా లేకపోవడం, బూత్‌కమిటీలతో సహా ఆయా కమిటీలు పూర్తిస్థాయిలో నియమించకపోవడం, ఆయా నియోజకవర్గాల స్థాయిల్లో నాయకుల మధ్య సమన్వయ సమస్యలు, తదితర అంశాలు వీరి దృష్టికి వచ్చింది.
- తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దేశం, రాష్ట్రం సాధించిన ప్రగతి, రాష్ట్రానికి, వివిధవర్గాలకు చేకూరిన ప్రయోజనాలు, కేంద్ర పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీయడంతో పాటు రాష్ట్రంలో పార్టీ పరిస్థి తిపై ప్రజల నుంచి సమాచారం సేకరించారు.

డిసెంబర్ 4న దళితుల 'మార్చ్ టు పార్లమెంట్'

నేషనల్ దళిత్ సమ్మిట్ నిర్ణయం..




సదస్సులో మాట్లాడుతున్న సుభాషిణి అలీ

సనత్‌నగర్ (హైదరాబాద్): డిసెంబర్ 4న 'దళితుల మార్చ్ టు పార్లమెంట్' నిర్వహించాలని నేషనల్ దళిత్ సమ్మిట్ నిర్ణయం తీసుకుంది. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఆధ్వర్యంలో బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో 2 రోజులపాటు జరిగిన జాతీయ దళిత సదస్సు ముగింపు కార్యక్రమంలో ఈ తీర్మానం చేశారు. ముందుగా దళితుల డిమాండ్ల సాధన కోసం కోటి సంతకాలు సేకరించి రాష్ట్ర పతికి సమర్పిస్తామని, అనంతరం పార్లమెంట్‌కు దళిత మార్చ్ నిర్వ హించనున్నట్లు ప్రకటించారు. ముగింపు కార్య క్రమానికి హాజరైన యూజీసీ మాజీ చైర్‌పర్సన్, జేఎన్‌యూ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరాట్ మాట్లాడుతూ, దళితులకు ఉన్నత విద్యాభ్యాసం ద్వారానే వివక్ష నుంచి విముక్తి లభిస్తుందన్నారు. దళిత ఎజెండా ఏర్పాటు, కార్పొరేట్, మతతత్వ బీజేపీ ప్రభుత్వా న్ని ఓడించ డానికి కమిటీ కృషి చేయాలని పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా శిఖరాగ్ర సమావేశం ప్రజాకవి గద్దర్‌ను కూడా స్మరించుకుని ఆయనకు సంతాపాన్ని తెలిపింది. ఈ సందర్భంగా దళితుల ఎజెండా 2024 కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో యూపీ మాజీ ఎంపీ సుభాషిణి అలీతో పాటు మాధవరావు, మల్లేపల్లి లక్ష్మయ్య, జాన్ వెస్లీ, బాల మల్లేష్, రాధిక మీనన్‌లతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన దళిత ప్రముఖులు పాల్గొన్నారు.

పదవుల్లో 93 శాతం వాటా ఇవ్వాల్సిందే

ధర్మసమాజ్ పార్టీ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగబద్ధమైన పదవులు, రాజకీయ పోస్టులు, ప్రభుత్వంలో ఉన్నతాధికారుల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 93 శాతం వాటా ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారధన్ మహరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్టీ అధ్యక్ష పదవులు మొదలు అన్నింటా ఇదే తరహాలో రాజకీయ పార్టీలు తీర్మానాలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ అధ్యక్ష పదవులు బీసీలకు ఇవ్వాలని, 60శాతం ఎమ్మెల్యే టిక్కెట్లు సైతం బీసీలకు కేటాయించాలని, దళితులకు ముఖ్యమంత్రి పీఠం అప్పగించాలని, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన పదవులు, ఇతర పోస్టులు ఇవ్వాలని కోరారు. ఈమేరకు అన్ని రాజకీయ పార్టీలు తీర్మానించకపోతే.. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీలను గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు.





ఒంటరిగా వస్తాము. ఒంటరిగానే పోతాము.
మధ్యలో ఎందుకు మనం ఒంటరిగా ఉండాలి?!
– డైయొజినీజ్

సాక్షి
సోమవారం, 28 ఆగస్టు 2023

కాసింత కపటం

'నిజాన్ని పోలిన అబద్ధమాడి డబ్బు సంపాదించాలి' అంటాడు 'కన్యాశుల్కం'లో రామప్ప పంతులు. అందుకు 'నమ్మినచోట మోసం, నమ్మని చోట లౌక్యం' ప్రదర్శించాలంటాడు. కన్యాశుల్కం మలికూర్పు 1909లో జరిగింది కనుక రచనాకాలం ఇదమిత్థంగా తెలియకపోయినా ఇందులోని పాత్రలన్నీ 1880– 1910 కాలం నాటివి. అంటే నాటి మనుషుల జీవనాన్ని తెలిపేవి. వారు పాటించిన విలువలు, తొక్కగల పాతాళాలు, చూపిన చిత్తవృత్తులు, చేసిన టక్కుటమారాలు, హీనత్వాలు, అల్పత్వాలు... ఇవి తెలియాలంటే కన్యాశుల్కానికి మించిన ఆనవాలు లేదు.

వందేళ్ల కాలం తర్వాత కూడా గురజాడ, ఆయన రచించిన 'కన్యాశుల్కం' వర్తమాన విలువను కలిగి ఉండటానికి నాటకంలో గురజాడ ఎంచుకున్న సాంఘిక సమస్య గాంభీర్యం ఎంత మాత్రం కారణం కాదు. సాంఘిక సంస్కరణ కూడా కాదు. పసిపిల్లలను వృద్ధులకిచ్చి పెళ్లి చేయడం, వితంతువుల పెళ్ళిళ్లు నిరాకరించడం, వేశ్యావృత్తి ప్రబలంగా ఉండటం... వీటి నిరసనగా గురజాడ కన్యాశుల్కాన్ని రాసినా కేవలం ఈ కారణం చేతనైతే నాటకం అవసరం ఏ పదేళ్లకో తీరిపోయి కనుమరుగైపోయేది. కన్యాశుల్కం బతికి ఉన్నదీ... ఇక మీదటా బతికి ఉండేదీ... అది కేవలం మనుషుల నిజ ప్రవర్తనల విశ్వరూపం చూపడం వల్లే!

అగ్నిహోత్రావధాన్లకు మెరకపొలం ఉంది. భార్య వెంకమ్మ పసుపూ కుంకాలతో తెచ్చిన పొలమూ ఉంది. ఇరుగింటి గోడ, పొరుగింటి గోడ తనదేనని దబాయించి కలుపుకుంటున్నాడు. పెద్ద కూతురు బుచ్చమ్మను పదిహేను వందలకు అమ్మి, ఆమె విధవగా మారగా తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. బుచ్చమ్మ (చనిపోయిన) మొగుడి భూముల్లో వాటా కోసం దావా కూడా తెచ్చాడు. ఇన్ని ఉన్నా బంగారం లాంటి, పసిమొగ్గ వంటి చిన్నకూతురు సుబ్బిని పద్దెనిమిది వందలకు అమ్మడానికి సిద్ధమయ్యాడు– అరవై దాటిన, కాటికి కాళ్లుజాపుకున్న లుబ్ధావధాన్లకు! కొడుకు వెంకటేశం పెళ్లి జరగాలంటే చంటిదాన్ని అమ్మాల్సిందేనట. ఈ కాఠిన్యం, కపటత్వం ఎంత వెలపరం!

ఇక కపటుల వరుస చూడండి. డబ్బుపై యావ తప్ప వేరే ఏ లిటిగేషన్ ఎరగని ముసలి లుబ్ధావధాన్లను పెళ్లికి ఎగదోసి, అతగాడు పిల్లకు పుస్తె గట్టి ఇంటికి తెచ్చుకుంటే గనక తన ఇలాకా చేసుకుందామని ఆరాటపడుతుంటాడు ఉమనైజర్ రామప్పపంతులు. అప్పటికే అతడు లుబ్ధావధాన్ల పెద్ద కూతురు మీనాక్షిని లొంగదీసుకున్నాడు. మధురవాణిని ఉంచుకున్నాడు. చాలక అన్నెం పున్నెం ఎరగని పసిపిల్లను కబళించేందుకు లుబ్ధావధాన్ల హితం పలుకుతుంటాడు. గిరీశం ఇంతకన్నా దిగదుడుపు. స్త్రీలపై పడి బతుకుతాడు. పూటకూళ్లమ్మను ఉంచుకుని, ఆమె సరుకుల కోసం దాచుకున్న 20 రూపాయలను కాజేసి మధురవాణికిచ్చి ఆమెను ఉంచుకుంటాడు. సరైన పెద్దమనిషి దొరికితే 'మధురవాణి లాంటి ఇరవై మందిని సప్లై చేస్తానంటా'డు. బుచ్చమ్మ మీద కన్నేసి, విడో మేరేజీ పేరుతో ఆమెను నగానట్రాతో ఉడాయించుకుపోవాలని చూస్తాడు. గిరీశానికి ఇంగ్లిష్ వచ్చు. శ్రమ రాదు. చదువు ఉంది. నీతి లేదు.

మేనకోడలైన సుబ్బిని కాపాడటానికి రంగంలో దిగిన కరటక శాస్త్రికి ఎన్ని సదుద్దేశాలున్నా అతడు మధురవాణికి పాత గిరాకీ. 'ఎవరూ లభ్యం కాకపోతే నేను యాంటీ నాచే' అంటాడు. ఇక ఆవు నెయ్యైనా ఇస్తాగానీ ఖూనీ కేసులో చిక్కుకున్న లుబ్ధావధాన్ల తరఫున సాక్ష్యం చెప్పననే పొలిశెట్టి, లేని దెయ్యాలను సీసాలో బంధించే గవరయ్య, హరిద్వార్‌లో మఠం కడతానని చిల్లర చందాలతో సాయంత్రాలు సారా కొట్లో గడిపే బైరాగి, కేసుంది అనగానే ఎంతొస్తది అనే కానిస్టేబు, చదవక తండ్రిని మోసం చేసే వెంకటేశం... కపటులు.

మనుషులు బతకాలి. బతకడం ముఖ్యమే. అందుకై కాస్తో కూస్తో కపటత్వం అవసరం కావచ్చుగాని అందులోనే సోయి మరిచి కొట్టుకుపోవడమా? తెల్లారి లేస్తే కుత్సితాలు చేస్తూ, ఎదుటివారి నెత్తిన చేయి పెడ్తూ, ఇతరుల కీడు కోరుతూ, బాగా గడుస్తూ ఉన్నా అత్యాశకొద్దీ విలువలు కాలరాస్తూ, పై అంతస్తుకు చేరేందుకు అయినవారిని కాలదంతూ, కేసులూ కోర్టులని తిరుగుతూ... ఆ కాలం మనుషులను తలుచుకుని గురజాడ– సౌజన్యారావు పంతులు రూపంలో కాసింత చింతిస్తూ 'చెడ్డలో కూడా మంచి ఉండదా' అంటాడు. 'ఉన్నవారు వీరే. వీరిలో మంచి వెతికి సర్దుకుపోక తప్పదు' అనే అర్థంలో! కాని నేటి రోజులు చూస్తుంటే ఆనాటి కపటులంతా మహానుభావులు అనిపించక మానదు. నేటి మనుషులకు కిందా మీదా పడి బతకడం రావడం లేదు. కపట జీవన సౌందర్యం తెలియడం లేదు. అసలు అంత ఓర్పు లేదు. చెడి బతికినా, బతికి చెడినా... బతకడం ముఖ్యం అనుకోవడం లేదు. చంపు లేదా చావు... అని క్షణాల్లో క్రూరత్వానికి తెగబడుతున్నారు.

గురజాడ నేడు 'కన్యాశుల్కం' రాస్తే బుచ్చమ్మ, వెంకమ్మ కలిసి అగ్నిహోత్రావధాన్లకు విషం పెడతారు. లుబ్ధావధాన్ల పీక నొక్కి మీనాక్షి ఆస్తిపత్రాలతో పారిపోతుంది. చీటికి మాటికి తార్చి బతుకుతున్నాడని గిరీశం నిద్రలో ఉండగా మధురవాణి ఖూనీ చేస్తుంది. రామప్ప పంతులు 'పోక్సో' కింద అరెస్ట్ అవుతాడు. వెంకటేశం డ్రగ్స్ కేసులో పట్టుబడతాడు. దారుణం అనిపించవచ్చుగాని పేర్లను మారిస్తే ఇవాళ్టి వార్తలు ఇవే! ఆగస్టు – 'కన్యాశుల్కం' మొదటిసారి ప్రదర్శించిన మాసం. సినిమాగా రిలీజైన మాసం. మనుషులు పరిహాసం ఆడదగ్గ అల్పత్వాలతోనే జీవించాలని, ఈసడించుకునే స్థాయి కపటత్వంతోనే బతకాలని, భీతి కలిగించే రాక్షస మనస్తత్వాలకు ఎన్నటికీ చేరకూడదని కోరుకునేందుకు ఈ మాసం కంటే మించిన శుభతిథి ఏముంది – నెలాఖరైనా?

ప్రైమరీలను వేడెక్కిస్తున్న భారతీయులు

విశ్లేషణ



లవ్ పురి

నార్త్ కరొలైనా మాజీ గవర్నరు నిక్కీ హేలీ, 38 ఏళ్ల పారిశ్రామిక వేత్త వివేక్ రామస్వామి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రైమరీ ఎన్నికలకు పోటీ పడుతున్నారు. అధిక సంఖ్యాకవాద రాజకీయాలకు, వివక్షాపూరిత విధానాలకు బాధితులైన మైనారిటీ సమూహాలను డెమొక్రాటిక్ పార్టీ తన ప్రగతిశీల సిద్ధాంతాలతో దరికి చేర్చుకుంటుందన్న వాస్తవానికి విరుద్ధంగా ఉంది – భారతీయ అమెరికన్‌లు ఇలా రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడటం! రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఈ భారతీయ అమెరికన్‌లు పోటీకి నిలిచే అవకాశం లేకపోవచ్చు. అయినప్పటికీ వీరి ఆలోచనలు అమెరికా రాజకీయ నేపథ్య దృశ్యానికి భిన్నంగా ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి.

అమెరికా అధ్యక్ష ఎన్నికలకిది ముందరి ఏడాది కావడంతో అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే 'ప్రైమరీ'లు (ప్రాథమిక ఎన్నికలు) రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. యూఎస్‌లో 40 లక్షల మంది భారతీయ అమెరికన్‌లు ఉన్నారు. యూఎస్ మొత్తం జనాభాలో ఇది దాదాపుగా 1.3 శాతం. యూఎస్ కాంగ్రెస్‌లో గత దశాబ్ద కాలంలో ఐదుగురు భారత సంతతి అమెరికన్‌లు ప్రతినిధులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో నార్త్ కరొలైనా మాజీ గవర్నరు, ఐక్యరాజ్యసమితిలో యూఎస్ శాశ్వత ప్రతినిధి అయిన నిక్కీ రణ్‌ధవా హేలీ... రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం ప్రైమరీ ఎన్నికలకు పోటీ పడుతున్నారు. ఆమె పాలనా సామర్థ్యానికి ఇప్పటికే అనేక నిరూపణలు ఉన్నాయి.

బయోటెక్స్ స్టార్టప్‌ను స్థాపించి, విజయవంతంగా నడిపిస్తున్న 38 ఏళ్ల భారతీయ సంతతి పారిశ్రామిక వేత్త వివేక్ రామస్వామి కూడా ప్రస్తుతం వెలుగులో ఉన్నారు. అతడు డబ్బు వరదలో కొట్టుకుని పోతున్నవాడు. అమెరికా గుండెకాయగా పేర్గాంచిన మిడ్‌వెస్ట్ ప్రాంతంలో పెరిగి పెద్దవాడైనవాడు. ఐవీ లీగ్ ప్రావీణ్యాలతో పరిపుష్టమైనవాడు. ప్రఖ్యాత మీడియా సంస్థలు ఆయన గురించి రాశాయి. ఆయన కథనాల్లో అతిశయోక్తి కనిపించవచ్చు. కానీ ఓటర్లు ఏం కోరుకుంటున్నారన్న విషయమై ఆయనకు చక్కటి అంచనా ఉంది.

అత్యధిక సంఖ్యలో డెమొక్రాట్‌ల వైపున ఉన్న యూఎస్‌లోని ప్రవాస భారతీయులకూ, ఇతర అల్పసంఖ్యాక వర్గాలకూ రామస్వామి ఆలోచనలు గిట్టనివే కావచ్చు. పని ప్రదేశాలలో వైవిధ్యానికి వ్యతిరేకంగా ఆయన మాట్లాడతారు. అదే సమయంలో వైవిధ్యభరితమైన ఆలోచనలను ఇష్టపడతానని చెబుతుంటారు. వైవిధ్య వ్యతిరేకతకు 'తెలివి'ని జోడించడం ఇది. రామస్వామి ఒక రాజ్యాంగ సవరణను కూడా ప్రతిపాదిస్తున్నారు. ఆ ప్రకారం 18–24 ఏళ్ల మధ్య వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే యూఎస్ ప్రభుత్వ స్వరూప స్వభావాలలోని ప్రాథమిక అంశాలపై వారెంత అవగాహనను కలిగి ఉన్నారో నిర్ణయించే 'సివిక్స్ టెస్ట్'ను ఉత్తీర్ణులై ఉండాలి. మళ్లీ ఇదొక పైకి మంచిగా కనిపించే కపటపూరితమైన ఆలోచన. ఈ వయఃపరిమితిలో ఉన్న జనాభాలో ఎక్కువమంది డెమొక్రాట్‌లకు మద్దతు ఇస్తుంటారు. రిపబ్లికన్‌లకు మద్దతు ఇచ్చేవారిలో మధ్య వయస్కులు అత్యధికం. 'సివిక్స్ టెస్ట్' నిర్వహణ ద్వారా యువజనుల ఓటర్లలో తగ్గించగలిగినంత మందిని తగ్గిస్తే రిపబ్లికన్‌లకు ప్రయోజనం చేకూర్చవచ్చన్నది రామస్వామిలోని మరో ఆలోచనా వైవిధ్యం.

అయితే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఈ భారతీయ అమెరికన్‌లు పోటీగా నిలిచే అవకాశం లేకపోవచ్చు. అయినప్పటికీ వీరి ఆలోచనలు అమెరికా రాజకీయ నేపథ్య దృశ్యానికి భిన్నంగా ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి. సాధారణంగా డెమొక్రాట్‌లకు ఓటు వేస్తుండే భారతీయ అమెరికన్‌లు ఎందుకని రిపబ్లికన్ పార్టీ ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు?



వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ

అధిక సంఖ్యాకవాద రాజకీయాలకు, పర్యవసాన వివక్షాపూరిత విధానాలకు బాధితులైన మైనారిటీ సమూహాలను డెమొక్రాటిక్ పార్టీ తన ప్రగతిశీల సిద్ధాంతాలతో దరికి చేర్చుకుంటుందన్న వాస్తవానికి విరుద్ధంగా ఉంది – భారతీయ అమెరికన్‌లు ఇలా రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడటం! ఈ సందర్భంలో ఎవరైనా యూఎస్‌కు భారతీయుల వలస వెనుక ఉన్న ప్రత్యేక అంశాల మీద, వారు ఏ సామాజిక స్థాయుల నుంచి వలస వచ్చారనే దాని మీద దృష్టిపెట్టడం అవసరం.

భారతీయుల వలసల్లోని మొదటి దశ ప్రధానంగా 20వ శతాబ్దపు ప్రారంభ సంవత్సరాలలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆధునిక టెక్ హబ్ ద్వారా మొదలైంది. ఆసియా సంతతి వారిపై ఉన్న చట్టపరమైన పరిమితుల కారణంగా నాటి వలసదారులు సంఖ్యాపరంగా స్వల్పంగా ఉన్నారు. రైలు–రోడ్లు పనులు, కలప డిపోలు, వ్యవసాయ పొలాల్లో ఉపాధిని వెతుక్కున్నారు. ఆఖరికి కాంగ్రెస్ సభ్యుడు దలీప్ సింగ్ సౌంద్ కూడా 1924లో బర్కిలీలోని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందినప్పటికీ, యూఎస్ ప్రభుత్వం పౌరసత్వాన్ని నిరాకరించిన కారణంగా 1949 వరకు రైతుగా పని చేయవలసి వచ్చింది. అమృత్‌సర్‌లో జన్మించిన దలీప్ 1956లో డెమొక్రాటిక్ పార్టీ టికెట్‌పై క్యాలిఫోర్నియా నుంచి యూఎస్ కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. అలా ఎన్నికైన మొదటి ఆసియా – అమెరికన్, మొదటి భారతీయ–అమెరికన్, మొదటి సిక్కు మతస్థుడు దలీప్.

1965 అక్టోబర్ 3న అప్పటి అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ ఇమిగ్రేషన్ బిల్లుపై సంతకం చేయడంతో ఆసియా దేశాల నుండి వచ్చే వలసలపై ఉన్న నిబంధనలు తొలగిపోయాయి. ఆ తర్వాత వలస వచ్చి తమ విజయాలతో గుర్తింపు పొందిన అనేక ఆసియా సమూహాల పిల్లల్లో భారతీయ అమెరికన్‌ల సమూహంలోని పిల్లలు అధికంగా ఉన్నారు. ఇది భారతీయులలోని ఉన్నత విద్యావంతులు యూఎస్‌లో చదువుకోడానికి, ఉద్యోగాలు చేయడానికి తోడ్పడింది. వారిలో చాలామంది స్కాలర్‌షిప్‌లపై అక్కడికి వెళ్లారు. వారిని జర్నలిస్ట్ అనితా రాఘవన్ తన పుస్తకం 'ది బిలియనీర్స్ అప్రెంటిస్: ది రైజ్ ఆఫ్ ది ఇండియన్ – అమెరికన్ ఎలీట్ అండ్ ది ఫాల్ ఆఫ్ గాలియన్ హెజ్ ఫండ్'లో 'రెండుసార్లు ఆశీర్వదించబడిన తరం'గా చేసిన అభివర్ణన ఎంతో ప్రసిద్ధి చెందినది. యూఎస్ వలస చట్టాల సడలింపు వల్లా, స్వాతంత్ర్యానంతరం విద్యారంగంపై భారత్ అపారంగా పెట్టుబడులు పెట్టడం వల్లా రెండు రకాలుగా లబ్ధి పొందిన తరం అది.

1995 తర్వాతి కాలంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన కార్మికులకు ఏర్పడిన డిమాండు, ఆ తర్వాత వై2కె మైగ్రేషన్ ప్రాజెక్టుతో... వలసలు అకస్మాత్తుగా విస్ఫోట స్థాయిలో పెరిగాయి. దాంతో పాటుగా భారత దేశంలో అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లపై యూఎస్‌లో ఆసక్తి ఏర్పడింది. ఇది చాలామంది ఆర్థిక నిపుణులకు ద్వారాలను తెరిచింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత అంశాలలో బలమైన నేపథ్యం, ఆంగ్ల భాషపై క్రియాత్మక అనర్గళత ఉండి హెచ్–1బి నాన్ ఇమిగ్రెంట్ వీసా ప్రోగ్రామ్ కింద దరఖాస్తు చేసుకుని అమెరికా వెళ్లినవారిలో దాదాపు 75 శాతం మంది భారతీయులే. వారిలో అనేకమంది దశాబ్దాల వ్యవధిలో అమెరికన్ పౌరులుగా మారారు. 2000 తర్వాత, లేదా గత 10 సంవత్సరాలలో వలసవెళ్లినవారు యూఎస్‌లో శాశ్వత నివాసులుగా ఉంటూ, ప్రస్తుతం పౌరసత్వం పొందే దారిలో ఉన్నారు.

వలసల విశిష్టతల దృష్ట్యా భారతీయ అమెరికన్‌లు రెండు పార్టీలలోనూ ప్రాతినిధ్యం వహించే ధోరణి ఎంత ఎక్కువ మంది పౌరసత్వం పొందితే అంతగా పటిష్ఠం అవుతుంది. ఇతర మైనారిటీ సమూహాల పోరాటం చాలామంది యువ భారతీయ అమెరికన్‌ల జీవితాలలో ప్రతిబింబించదు. ఎందుకంటే వీరంతా ఉన్నత విద్యావంతులైన మొదటి తరం భారతీయ అమెరికన్ తల్లిదండ్రులకు జన్మించినవారు. నాణ్యమైన విద్య, సమయపాలన, అందుబాటులో ఉన్న పర్యావరణ వ్యవస్థల మద్దతుతో ఈ యువ బృందం ఆర్థికంగా లాభదాయకమైన అనేక వృత్తిపరమైన రంగాలలో విజయం సాధించింది.

జెనరేషన్ జడ్, లేదా మిలీనియల్ జనరేషన్ నుంచి కొందరు తక్కువ ఆదాయ పన్ను, ప్రైవేట్ హెల్త్ కేర్ వంటి విధానాలకు మద్దతు ఇస్తున్నారు. ఇతర మైనారిటీ సమూహాలకు భిన్నంగా సంక్షేమ పథకాల పట్ల వీరికి వ్యతిరేకత కూడా ఉండవచ్చు. భారతీయ అమెరికన్‌ల రాజకీయ పొత్తులు యూఎస్‌లోని ఇతర మైనారిటీ సమూహాల రాజకీయాలపై మన అవగాహన నుండి ఉత్పన్నం అయినవైతే కాదు.

వ్యాసకర్త జర్నలిస్టు, రచయిత
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సరైన పోలిక



వ్యక్తిగత జీవితంలోని తమ త్యాగాలను ప్రధాని మోదీ ప్రశంసించారని చెబుతూ... "ఒక తల్లిగా, ఇస్రో సైంటిస్టుగా ప్రజ్ఞాన్ రోవర్ నాకు నా బిడ్డలానే అనిపిస్తోంది..." అని రీమా ఘోష్ మీడియాతో అనడం నాకు చాలా గొప్పగా అనిపించింది. రీమాకు శుభాభినందనలు.

– రోజీ, న్యాయవాది

అసలు పాయింట్



మోదీజీ చంద్రయాన్–3కి శివశక్తి పాయింట్ అని, చంద్రయాన్–2కి తిరంగా పాయింట్ అని పేరు పెట్టారు. చంద్రయాన్–1కి మాత్రం కాంగ్రెస్ వాళ్లు జవహర్ పాయింట్ అని పేరు పెట్టారు. యూపీఏ కనుక అధికారంలో ఉండి ఉంటే చంద్రయాన్–2,చంద్రయాన్–3లకు ఇందిర, రాజీవ్ పాయింట్‌లు అని నామకరణం జరిగి ఉండేది.

– షెహజాద్ పూనావాలా, బీజేపీ ప్రతినిధి


వేద శాస్త్రాలు



వేదాలు శాస్త్రీయం కాదనే చెత్తను మీ తలలోంచి తొలగించండి. పురావస్తు శాస్త్రం ప్రకారం ఋగ్వేదం అత్యంత పురాతన విజ్ఞాన గ్రంథమని ముందుగా తెలుసుకోవాలి. సైన్స్‌కన్నా ముందే వేద మంత్రాలు నిరూపించిన శాస్త్ర విషయాలు ఎన్నో ఉన్నాయి.

– అన్సుల్ పాండే, కాలమిస్ట్

అదే నిజమైతే..!



నేహా పబ్లిక్ స్కూల్‌కు చెందిన తృప్తా త్యాగి తన క్లాస్ రూమ్‌లోని ఒక ముస్లిం విద్యార్థిని కొట్టమని మిగతా హిందూ విద్యార్థులను కోరడం నిజమే అయితే యోగి నోరు విప్పుతారా? మోదీ దీనిని బహిరంగంగా ఖండిస్తారా? ఆ టీచర్‌పై విచారణ జరుగుతుందా? లేక, ద్వేష ప్రేరేపిత సంస్కృతిని ఇలా వృద్ధి చెందనిస్తూనే ఉంటారా?

– కపిల్ సిబల్, రాజ్యసభ ఎంపీ

ఎక్కువ శాతం



మణిపూర్ సంక్షోభానికి కారణం కేంద్ర ప్రభుత్వం అని 30 శాతం మంది అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే దోషి అని 25 శాతం మంది నిందిస్తున్నారు. స్థానిక కారణాలని 20 శాతం అంటున్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఉండాలని 44 శాతం మంది కోరుకుంటున్నారు.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

భాషా, సామాజిక సంస్కర్త

వ్యావహారిక భాషోద్యమానికి సారథ్యం వహించిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు సామాజికోద్యమ సారథి కూడా! సామాన్య జనులకు అర్థమయ్యేలా గ్రంథ రచనలు వాడుకభాషలో సాగాలని పోరాటం సాగించడం ద్వారా సామాజిక సంస్కరణోద్యమానికి నాంది పలికారు. 'గ్రాంథికభాష గ్రంథాలలో కనబడేదే కాని వినబడేది కాదని' బల్లగుద్ది మరీ వాదించేవారు. ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా, ముందుగా భాషాభివృద్ధి జరగాలి. అయితే గ్రాంథికంలో భాషాభివృద్ధి జరిగితే పండితులే లబ్ధి పొందుతారు తప్ప, పామరులకు ఎంతమాత్రం ఉపయోగం ఉండదు. అందుకే పామరులకు కూడా అర్థమయ్యే వాడుక భాషలోనే వ్యవహారాలన్నీ జరగాలని ఎలుగెత్తి చాటిన మహనీయుడు గిడుగు.



గిడుగు రామమూర్తి పంతులు

సవరలు, దళితులను అంటరానివారిగా భావించే ఆ కాలంలో సవర విద్యార్థులకు తన ఇంట్లోనే బస ఏర్పాటు చేయించి భాషా బోధన గావించడం ఆయనలోని సంఘ సంస్కరణ కోణాన్నీ చూపుతుంది. సవర గూడేల్లో తిరుగుతూ వారి భాష నేర్చుకొని, ఆ భాషోద్ధరణకు నడుం బిగించారు. సంఘ సంస్కరణాభిలాషతోనే సవరభాషను ఆయన నేర్చుకున్నారనడంలో అతిశయోక్తి లేదు. సవర భాషలో పుస్తకాలు రాయడంతోపాటు, ఆ భాషలోనే వాళ్లకు చదువు చెప్పే ఏర్పాటు చేశారు. ఈ కృషిలో భాగంగా 1931లో ఇంగ్లీష్‌లో సవర భాష వ్యాకరణాన్నీ, 1936లో సవరభాష నిఘంటువునూ రూపొందించారు. వ్యావహారిక భాషలోనే సామాన్యులకు సైతం మేలు జరుగుతుందనే ఆయన నమ్మకం వమ్ముకాలేదు. ఫలితంగా నేడు అన్నిరంగాల్లో వాడుక భాష వినియోగంలో ఉంది. సామాజికాభివృద్ధి మూలస్తంభాల్లో ఒకటైన పత్రికలు కూడా వాడుక భాషలోనే సమాచారాన్ని అందిస్తున్నాయి.

1930లో ఒడిశా ఏర్పడనున్నప్పుడు, పర్లాకిమిడి రాజా తన పర్లాకిమిడి తాలూకా అంతటినీ ఒడిశా రాష్ట్రంలో చేర్పించడానికి ప్రయత్నించినప్పుడు, తెలుగువారికి నాయకునిగా రామమూర్తి నిలిచి ప్రతిఘటించారు. ఆ తాలూకాలో చాలా భాగాన్నీ, పర్లాకిమిడి పట్టణాన్ని ప్రభుత్వం అక్రమంగా ఒడిశాలో చేర్చడం వల్ల, తెలుగువారికి అన్యాయం జరిగిందని తెలియజేస్తూ ఆయన 1936లో ఒడిశా రాష్ట్ర అవతరణ జరిగే రోజున ఉదయమే పర్లాకిమిడిలో ఉండడానికి ఇష్టపడక, రాజమహేంద్రవరం వచ్చారు. అక్కడే తన శేష జీవితాన్ని గడిపారు. ఇది ఆయనలోని పట్టుదలకూ, రాజీపడని వ్యక్తిత్వానికీ గొప్ప నిదర్శనం.

గిడుగు 1863 ఆగస్టు 29వ తేదీ శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేట గ్రామంలో జన్మించారు. విజయనగరంలోని మేనమామగారి ఇంట్లో ఉంటూ మహారాజావారి ఇంగ్లీషు పాఠశాలలో ఉన్నత విద్యను పూర్తిచేశారు. తేటతెలుగులో రచనలు చేసిన గురజాడ అప్పారావు ఆయనకు సహాధ్యాయి కావడం విశేషం. భాష, సామాజిక ఉద్యమానికి ఎంతో సేవ చేసిన గిడుగు రామమూర్తి 1940 జనవరి 22న కన్నుమూశారు. ఆయన స్ఫూర్తి తెలుగు భాష ఉన్నంతవరకూ వెలుగుతూనే ఉంటుంది.

– పగిడి రంగారావు
(రేపు గిడుగు జయంతి; తెలుగు భాషా దినోత్సవం)

వీరి వేతనాల వెతలు తీరేదెప్పుడు?

అభిప్రాయం



సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు

ఏ దేశ ప్రగతికైనా విద్యే ముఖ్యసాధనం. విద్య అనగా బోధన, నిర్దిష్ట నైపుణ్యాల అభ్యసనల సమీకరణం. విశాలమైన భావంలో పరిజ్ఞానాన్నీ, ధనాత్మక తీర్పునూ, జ్ఞానాన్నీ ఇవ్వడం విద్య ప్రాథమిక ఉద్దేశ్యం. మరి ఈ విద్యను అందించేది ఉపాధ్యాయులు మాత్రమే కాదు. వారిని నడిపించేందుకు ఉన్న యంత్రాంగం కూడా ఇందుకు ఎంతగానో కష్టపడుతుంది. ఇందుకోసం ప్రభుత్వాలు ఒక ప్రత్యేక శాఖనే ఏర్పాటు చేసుకున్నాయి. ఆ శాఖ ద్వారా అనేక విద్యా కార్యక్రమాలనూ, పథకాలనూ ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయి. అందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసే 'సమగ్ర శిక్ష' పథకం ఒకటి.

కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఈ పథకానికి ఖర్చు చేస్తున్నాయి. ఈ పథకంలో భాగంగా కేంద్రం 'పోషణ అభియాన్', 'బాలికా సంరక్షణ' వంటి వాటిని లక్ష్యాలుగా చేసుకుని అమలు చేస్తుండగా రాష్ట్రాలు వాటి అవసరాల మేరకు అభివృద్ధిని సాధించేందుకు కొన్ని ఉప పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాయి. వీటన్నిటినీ లబ్ధిదారులకు చేరవేసేందుకు ఉద్యోగస్వామ్యం అవసరమవుతుంది. క్షేత్రస్థాయిలో వీరే కీలకంగా వ్యవహరించి లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తారు. పై అధికారుల సూచనల మేరకు అన్ని వ్యవహారాలనూ నడిపిస్తారు. ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన ఉన్న అధికారులు పై స్థాయిలో ఉంటే కిందిస్థాయి ఉద్యోగులందరూ రాష్ట్రాలు నియమించుకున్న కాంట్రాక్టు ఉద్యోగులే. నియామక విషయంలో రాష్ట్రాలకే సర్వాధికారాలు ఉంటాయి.

పాఠశాల విద్యలో సత్వర పర్యవేక్షణ, అధికార వికేంద్రీకరణ కోసం పాఠశాల సముదాయ (కాంప్లెక్స్) విధానాన్ని తీసుకువచ్చి పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొన్ని పాఠశాలలను కలిపి ఒక సముదాయంగా పరిగణించి ప్రతి మండలంలో 6 నుండి 8 సముదాయాలను ఏర్పాటు చేసింది. కాంప్లెక్స్ స్థాయి నుండి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎవరి విధులను వారు నిర్వహించేలా ఏర్పాట్లు జరిగాయి. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ల నుండి ఉన్నత స్థాయిలో రాష్ట్ర కార్యాలయంలో పని చేసే ఉద్యోగుల వరకు ఎందరినో కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు.

అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్ర విద్యా శాఖలో భాగంగా ఉన్న సమగ్ర శిక్ష పథకంలో గత 15 సంవత్సరాలుగా 27,168 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో 25,728 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు కాగా 1890 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరి నియామకం అంతా రాతపరీక్ష, మెరిట్ కమ్ రోస్టర్ విధానం ద్వారానే రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్, జిల్లా విద్యాధికారులు సభ్యులుగా ఉన్న కమిటీ ద్వారా జరిగింది. వీరంతా పీజీలు, డిగ్రీలు, బి.ఇడి, టెట్ వంటి ఉన్నత అర్హతలు కలవారే. నియామకం నాటి నుండి నేటి వరకూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. అనేక రాష్ట్రాలలో ఈ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించగా... పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మాత్రం వీరికి అతి తక్కువ వేతనాలే ప్రభుత్వం చెల్లిస్తోంది.



పంజాబ్ రాష్ట్రం జగ్జిత్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం తీర్పు ప్రకారం బేసిక్‌పే స్కేల్ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ కనీస వేతనాలు చెల్లించడం లేదు. తెలంగాణలో 2014కు పూర్వం ఉన్న ప్రభుత్వం ప్రతి సంవత్సరం వీరికి వేతనాలు పెంచగా 2014 నుండి వేతనాలు పెరగలేదు. కాగా 2018 తరువాత ఇచ్చిన పీఆర్సీలో వీరికి కూడా ఫిట్‌మెంటు ఇచ్చారు. కాని అది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదనీ, వేతనాన్ని పెంపుదల చేయాలని ఉద్యోగుల వాదన.

ఉద్యోగ బాధ్యతల రీత్యా క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ప్రతి రోజు వివిధ పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లవలసి వస్తుంది. ఈ క్రమంలో అనేక మంది రోడ్డు ప్రమాదాల వలన మరణించారు. ప్రభుత్వం కనీసం వీరిపై సానుభూతి కూడా చూపకపోవడం వలన వీరి కుటుంబాలు వీధిన పడ్డాయి.

ఎంతోమంది వైద్యఖర్చుల కోసం అప్పుల పాలయ్యారు. అందుకే వీరంతా కనీస ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను కోరుకుంటున్నారు. 'సెర్ప్', 'మెప్మా' వంటి పథ కాలు కూడా కేంద్ర, రాష్ట్ర వాటాలతో నిర్వహించే పథకాలే. ఈ పథకాలలో పనిచేసే వారిని తెలంగాణ ప్రభుత్వం రెగ్యులర్ చేసి ప్రభుత్వ ఉద్యో గులుగా గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పిస్తుండగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను మాత్రం విస్మరించింది. అందుకే వీరు పోరు బాట పట్టారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయాలనీ, నగదు రహిత వైద్యసదుపాయాలకు అవకాశం కల్పించాలనీ, ఉద్యోగ బాధ్యతలలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలనీ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వా లనీ వీరు డిమాండు చేస్తున్నారు. పోరాడి సాధించు కున్న స్వరాష్ట్రంలో ఇన్నేళ్లయినా ఈ కష్టాలేమిటని ప్రశ్నిస్తున్నారు. వీరి వేతన వెతలు తీరేనా?

వ్యాసకర్త రచయిత, విశ్లేషకులు
మొబైల్: 94913 57842

నేను కాలాన్ని!

ఇటీవల విడుదలై విశ్వవ్యాప్తంగా అఖండ విజయాన్ని సాధించిన హాలీవుడ్ చలనచిత్రం 'ఒపెన్ హైమర్'లో కథానాయకుడు మన భగవద్గీతలో ఉన్న 'కాలోస్మి లోక క్షయ కృత్...' శ్లోకాన్ని ఉట్టంకించడం, భారతీయులెందరికో ఆశ్చర్యాన్నీ, ఆసక్తినీ కలిగించింది.

'సర్వమూ నేనే! ఈ విశ్వమంతా నేనే సృష్టించి ఇందులో అణువణువునా నేనే వ్యాపించి ఉంటాను' అని గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చాలాసార్లు, చాలా విధాలుగా చెబుతాడు. 'నీ విశ్వ రూపం నేను చూడవచ్చా?' అని అర్జునుడు ప్రార్థిస్తాడు. మామూలు కళ్ళతో చూసేందుకు సాధ్యం కాదు కనుక శ్రీకృష్ణుడు అర్జును డికి దివ్యచక్షువులు ప్రసాదించి, తన విశ్వ రూపాన్ని ప్రదర్శిస్తాడు. ఆ విరాట్ రూపం అర్జునుడికి భయం కలిగిస్తుంది. ముఖ్యంగా, ప్రాణులెన్నో మంటల్లో దూకి నాశనమయ్యే మిడతలలాగా, ఆ విరాట్ రూపాని కున్న వేలాది నోళ్లలో అతి వేగంగా ప్రవేశించడం చూసి, భయపడిన అర్జునుడు, 'స్వామీ! ఇంతటి ఉగ్ర రూపంతో కనిపిస్తున్న తమరెవరు?' అని అడుగుతాడు.

జ్యోతిర్మయం

'కాలోస్మి– నేను కాలాన్ని' అంటాడు శ్రీకృష్ణుడు. భూత వర్తమాన భవిష్యత్తులుగా వ్యాపించి ఉన్న కాలంలో... మామూలు చర్మ చక్షువుతో వర్తమాన మొక్కటే కనిపిస్తుంది. దివ్య చక్షువులిచ్చే జ్ఞాన దృష్టి వల్ల అర్జునుడికి త్రికాలాలూ అనుభవమయ్యాయి. 'కాలోస్మి; లోక క్షయకృత్ ప్రవృద్ధః – నేను కాలాన్ని; ప్రస్తుతం లోక క్షయం కోసం ప్రవృద్ధి చెంది ఉన్నాను. లోకాన్ సమాహర్తుం ఇహ ప్రవృత్తః – జనులను సంహరించే ప్రవృత్తిలో ఇప్పుడిక్కడ ఉన్నాను. ఋతేపి త్వాం, న భవిష్యంతి సర్వే / యే అవస్థితాః ప్రత్యనీకేషు యోధాః – నువ్వీ యుద్ధంలో లేకపోయినా కూడా, నీ శత్రుపక్షంలో ఉన్న ఈ భీష్మాది యోధులెవరైతే ఉన్నారో, అందరూ కాల గర్భంలో కలిసిపోవలసిందే! మిగిలి ఉండేవాళ్లెవరూ లేరు. వీళ్ళందరూ కాలరూపుడినైన నా చేత సంహరించబడ్డ వాళ్ళే అని గ్రహించి, నువ్వు నిమిత్త మాత్రుడివై, నీ కర్తవ్యమైన యుద్ధం చేసి, నీ చేతి మీదుగా వీళ్ళను సంహరించి, రాజ్యం గెలుచుకొని, కీర్తి పొందు. నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్!' అని గీతాచార్యుడి బోధ.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.3.27 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.22 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.10.21 నుండి 11.51 వరకు, తిరిగి తె.5.05 నుండి 6.32 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.15 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.47 వరకు, **అమృతఘడియలు:** రా.7.21 నుండి 8.52 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.16.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

ఐటీలో మేటి హైదరాబాద్

సమాచార శాఖ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో ఐటీ రంగంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ నిలుస్తోందని ప్రభుత్వం గణాంకాలతో వెల్లడించింది. హైదరాబాద్‌లో దాదాపు 1,500 ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు ఉన్నాయని, తద్వారా తెలంగాణ నుంచి ఐటీ ఎగుమతుల విలువ 2022–23 నాటికి రూ. 2.41 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. తెలంగాణ ఏర్పడే నాటికి ఈ ఐటీ ఎగుమతుల విలువ రూ. 57,258 కోట్లుగా సమాచార శాఖ పేర్కొంది. తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి ఐటీ రంగంలో 5.60 లక్షల ఉద్యోగులు మాత్రమే ఉండగా, 2022–23 నాటికి ఆ సంఖ్య 9.05 లక్షలకు చేరింది. ప్రభుత్వ చర్యల కారణంగా అమెజాన్ డేటా సర్వీసు సెంటర్ రూ.20,761 కోట్లతో ఫాబ్ సిటీ, ఫార్మా సిటీ, చందన్‌వెల్లిలలో 3 డేటా సెంటర్లను నెలకొల్పుతుండగా, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూ.500 కోట్లతో స్మార్ట్ డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. అలాగే సేల్స్ ఫోర్స్ రూ.1,119 కోట్లతో విస్తరణ ప్రాజెక్టును చేపట్టగా, గోల్డ్ మాన్ శాక్స్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు ద్వారా 2,500 మందికి ఉద్యోగాలు లభించాయని ఆ శాఖ వెల్లడించింది.

అమరవీరుల ఆకాంక్షలకు విరుద్ధంగా బీఆర్‌ఎస్ పాలన


కోదండరాం

ముషీరాబాద్ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన అమరవీరుల ఆకాంక్షలకు విరుద్ధంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని తెలంగాణ జనసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళులర్పించారు. ప్రొఫెసర్ కోదండరాం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులు ఊరూరా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 10 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని, ఉద్యమకారులను తెలంగాణ సాంతంత్ర్య సమర యోధులుగా గుర్తించి ఉద్యోగాలలో 20శాతం కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఓటరు జాబితా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితాపై వచ్చిన ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరపాలని జీహెచ్‌ఎంసీ పరిధిలోని జిల్లా ఎన్నికల అధికారుల (డీఈఓ)ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ఆదేశించారు. ఫిర్యాదు ల్లోని ప్రతిఅంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని, చర్యలపై నివేదిక సమర్పించాలని కోరారు. బహదూర్‌పురా, గోషామహల్, నాంపల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల ఓటర్ల జాబితాలపై వచ్చిన ఫిర్యాదులపై ఆదివారం ఆయన సంబంధిత డీఈవో, ఓటరు నమోదు అధికారుల (ఈఆర్వో)లతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం, సీఈఓ కార్యాలయాల నుంచి పంపే ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకుని నివేదికను సమర్పించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు.


ఓటరు నమోదుకు ఒకే రోజు 1,32,036 దరఖాస్తులు

ఓటర్ల నమోదుకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి భారీ స్పందన వచ్చిందని, 1,32,036 మంది దరఖాస్తు చేసుకున్నారని వికాస్‌రాజ్ తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు చేర్చడం/తొలగించడం కోసం ఫారం–7 దరఖాస్తులు 15,044 వచ్చాయని తెలిపారు. ఓటును ఇతర ప్రాంతానికి మార్చుకోవడానికి 42,640 ఫారం –8 దరఖాస్తులు వచ్చాయన్నారు.

ప్రత్యేక పార్టీతోనే బీసీలకు సామాజిక న్యాయం


సురేశ్

వరంగల్: వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక పార్టీతోనే సామాజిక న్యాయంతో పాటు రాజ్యాధికారం దక్కుతుందని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ స్పష్టం చేశారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఓరుగల్లు బీసీ రాజ్యాధికార గర్జన సదస్సు ఆహ్వాన కమిటీ చైర్మన్ ధర్మపురి రామారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీలను గౌరవించని అగ్రవర్ణ పార్టీలకు ఓట్లెందుకు వేయాలని ప్రశ్నించారు. తెలంగాణలో 45 లక్షల జనాభా కలిగిన ముదిరాజ్‌లకు కనీసం ఒక సీటు కూడా బీఆర్‌ఎస్ పార్టీ కేటాయించకపోవడం చారిత్రక తప్పిదమన్నారు.



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కోమటిచెరువు వద్ద ఆదివారం రాత్రి మెగా డ్రోన్ షో అట్టహాసంగా జరిగింది. మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొన్నారు

నీళ్లు ఊరికే రావు!

▶ మొదటి పేజీ తరువాయి

విడుదల చేస్తుండగా, గతేడాది రావాల్సిన నివేదిక తాజాగా బయటకొచ్చింది. ఉచితంగా/తక్కువ ధరలకు నీరు సరఫరా చేస్తే దుర్వినియోగం అవుతుందని, ఆదాయం రాక ప్రభుత్వంపై పెనుభారం పడుతుందని ఆ నివేదికలో స్పష్టం చేసింది.

రాష్ట్రాలకు సరైన పాలసీ ఉండాలి

పన్నులు, ఇతర మార్గాల్లో ప్రజల నుంచి వసూలు చేస్తున్న డబ్బు ద్వారా ప్రభుత్వాలు మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు భారీగా ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు. ఈ ప్రాజెక్టుల పెట్టుబడులను తిరిగి రాబట్టుకోవడానికి రాష్ట్రాలు సరైన పాలసీలు కలిగి ఉండాలి. తిరిగి వచ్చిన రాబడులతో కొత్త ప్రాజెక్టులు చేపట్టి సమాజంలోని ఇతర వర్గాలకు లబ్ధి చేకూర్చాలి.

సాగునీటి చార్జీలు... రెండు రకాల వ్యయాలు

పంట రకాలు, విస్తీర్ణం, తడుల సంఖ్య, మొత్తం నీటి పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకొని సాగునీటి ధరలు ఖరారు చేయాలి. నీటి టారీఫ్ ఖరారు విధానాన్ని అన్ని రాష్ట్రాలు హేతుబద్ధీకరించాలి. పంట దిగుబడి విలువ ఆధారంగా సాగునీటి చార్జీలు వసూలు చేయాలని ఇరిగేషన్ కమిషన్(1972) కోరింది. ప్రాజెక్టుల పెట్టుబడి వ్యయంలో కొంత భాగంతోపాటు పూర్తిగా నిర్వహణ వ్యయం రాబట్టుకోవాలని వైద్యనాథన్ కమిటీ కోరింది.

సాగునీటి చార్జీల వసూళ్లతో ప్రాజెక్టుల మొత్తం నిర్వహణ వ్యయాన్ని రాబట్టుకోవాల్సిందే. దీనికి అదనంగా.. ఆహార పంటలైతే హెక్టారులో వచ్చిన దిగుబడుల విలువలో కనీసం ఒక శాతం, వాణిజ్య పంటలైతే ఇంకా ఎక్కువ శాతాన్ని వసూలు చేయాలి. ఈ మేరకు సాగునీటి వినియోగానికి సంబంధించి రెండు రకాల చార్జీలు విధించాలి. నిర్వహణ చార్జీలతో ప్రాజెక్టుల నిర్వహణకు, దిగుబడుల విలువ ఆధారిత చార్జీలను ప్రాజెక్టుల ఆధునికీకరణకు వినియోగించాలి. నీటి లభ్యత లెక్కల ఆధారంగా 75శాతం, ఆపై లభ్యత ఉన్న ప్రాజెక్టుల కింద పూర్తిస్థాయిలో సాగునీటి చార్జీలు వసూలు చేయాలి. 75 శాతానికి తక్కువ లభ్యత ఉన్న ప్రాజెక్టుల కింద 50 శాతం మేరకు చార్జీలు తగ్గించాలి.

ఎత్తిపోతల పథకాల నీటిచార్జీలు ఎక్కువే..

ఎత్తిపోతల పథకాలతో సరఫరా చేసే నీటికి చార్జీలు ఆయా ప్రాజెక్టుల పెట్టుబడి, నిర్వహణ వ్యయాల ఆధారంగా ఖరారు చేయాలి. ఎత్తిపోతల పథకాల ద్వారా సరఫరా చేసే నీటికి కచ్చితమైన లెక్కలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఎంత నీరు సరఫరా చేస్తే ఆ మేరకు చార్జీలు వాల్యూమెట్రిక్ (నీటి పరిమాణం) ఆధారంగా వసూలు చేయాలి. ఎత్తిపోతల పథకాల నిర్వహణ వ్యయం ఎక్కువే కాబట్టి గ్రావిటీ ప్రాజెక్టుల నీటిచార్జీల కంటే వీటి ద్వారా సరఫరా చేసే నీటి చార్జీలు అధికంగా ఉంటాయి.

నీటి ధరల ఖరారుకు రెగ్యులేటరీ కమిషన్

తాగు, పారిశుధ్యం, సాగు, పారిశ్రామిక, ఇతర అవసరాలకు సరఫరా చేసే నీటికి సరైన ధరలు ఖరారు చేసేందుకు ప్రతి రాష్ట్రంలో చట్టబద్ధంగా స్వయంప్రతిపత్తి గల వాటర్ రెగ్యులేటరీ ఆథారిటీని ఏర్పాటు చేయాలి. నీటి పరిమాణం ఆధారంగా చార్జీలు వసూలు చేయడానికి 100 శాతం ఇళ్లలోని నల్లాలకు మీటర్లు, కాల్వలకు నీటిని కొలిచే యంత్రాలు బిగించాలి. పేదలకు రాయితీపై నీరు సరఫరా చేయవచ్చు. పూర్తి నిర్వహణ వ్యయంతోపాటు పెట్టుబడిలో కొంత భాగం వసూలు చేసేలా నీటిచార్జీలు ఉండాలి. వీటితో పాటుగా పెట్టుబడి రుణాల తిరిగి చెల్లింపులు, ఇతర అవసరాలకు నిధులు నిల్వ ఉండేలా చార్జీలు ఖరారు చేయాలి. సాగునీటి ప్రాజెక్టుల నీటిని వినియోగిస్తే హెక్టారుకు రూ.600, వినియోగించని పక్షంలో హెక్టారుకు రూ.300 చొప్పున నిర్వహణ చార్జీలు వసూలు చేయాలని జల వనరుల 11వ పంచవర్ష ప్రణాళిక సిఫారసు చేసింది. పేద, బలహీనవర్గాలకు రాయితీ కొనసాగాలి.

రాజకీయంగా ఎదిగేందుకు అంతా కలసిరావాలి


మున్నూరు కాపు సమావేశంలో అభివాదం చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, నాయకులు

- మున్నూరు కాపు సమావేశంలో మంత్రి గంగుల కమలాకర్

ఖైరతాబాద్ (హైదరాబాద్): రాజకీయంగా మున్నూరుకాపులు మరింత ఎత్తుకు ఎదిగేందుకు అందరూ సహకరించాలని మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. జలవిహార్ వేదికగా ఆదివారం సెప్టెంబర్‌లో నిర్వహించే మున్నూరుకాపు సన్నాహక సమావేశం విజయవంతం కావాలని అపెక్స్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మంత్రి గంగుల కమలాకర్ హాజరై మాట్లాడారు. తక్షణమే మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీలో 23 మంది బీసీలకు సీట్లిస్తే 10 సీట్లు మున్నూరు కాపులకు కేటాయించారని, ఆ 10 సీట్లను మనమే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ...రాజకీయ పార్టీలు కాపులను పక్కన పెట్టడం కాదు పక్కనే పెట్టుకోవాలనే ఆలోచనతో వచ్చిందే ఈ సన్నాహక సమావేశమని చెప్పారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీలు జనాభా దామాషా ప్రకారం 22 సీట్లు కేటాయించాలని, మూడు పార్టీలు కేటాయించిన సీట్లలో పోటీలో ఉన్న మున్నూరు కాపులను గెలిపించుకోవాలని, మున్నూరు కాపులు లేని చోట బీసీల నాయకులను గెలిపించుకోవాలని ఈ సందర్భంగా తీర్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘాల గౌరవ అధ్యక్షుడు, అపెక్స్ కమిటీ చైర్మన్ పుటం పురుషోత్తమరావు పటేల్, అధ్యక్షుడు కొండా దేవయ్య, మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాశ్, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, సురేందర్, నన్నపనేని నరేందర్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో పోస్టుకు 61 మంది..

▶ మొదటి పేజీ తరువాయి

దృష్టిలో ఉంచుకుని, ప్రశ్నావళి రూపకల్పనలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిలబస్ ఏ విధంగా ఉండాలి? ఏ స్థాయిలో పరీక్ష విధానం ఉండాలనే దానిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఈ వ్యవహారం ఇలా ఉంటే... ఇప్పటికే పుట్టగొడుగుల్లా కోచింగ్ కేంద్రాలు వెలుస్తున్నాయి. డీఎస్సీకి ప్రిపేరయ్యే అభ్యర్థులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు తక్కువ సమయంలో డీఎస్సీ పరీక్షకు శిక్షణ ఇవ్వగల అధ్యాపకులను అన్వేషిస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో డీఎస్సీ పరీక్ష కోసమే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు, వాటికి అనుబంధంగా హాస్టళ్లు వెలుస్తున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమం ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నాయి. స్వల్పకాలిక శిక్షణ కోసం రూ.25వేల నుంచి 1.50 లక్షల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నాయి. కేవలం డీఎస్సీ కోసమే నిర్వహించే హాస్టళ్లు కూడా నెలకు రూ.15వేల నుంచి రూ.30 వేల వరకూ తీసుకుంటున్నాయి. టీచర్ పోస్టుల భర్తీ ప్రకటన తర్వాత హైదరాబాద్‌లోనే కొత్తగా 178 కోచింగ్ కేంద్రాలు వెలిశాయని టీచర్ పరీక్షల తర్ఫీదు ఇచ్చే అధ్యాపకుడు కృపాకర్ తెలిపారు. నెల రోజుల బోధనకు రూ.2 లక్షల వరకూ టీచర్లకు ఇచ్చేందుకు కోచింగ్ కేంద్రాలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.

పెద్ద ఎత్తున స్టడీ మెటీరియల్స్

నియామక పరీక్ష విధానం రూపురేఖలు తెలియకపోయినా స్టడీ మెటీరియల్ మాత్రం సిద్ధమవుతున్నాయి. గతంలో జరిగిన పరీక్షలను కొలమానంగా తీసుకుని స్టడీ మెటీరియల్ రూపొందిస్తున్నారు. ప్రచురణా సంస్థలు ఏకంగా అధ్యాపకులను నియమించుకుని మెటీరియల్స్ రూపొందిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో నిర్వహించిన వివిధ పరీక్షలు, బోధన విధానాలు, సైకాలజీతో పాటు సబ్జెక్టులకు సంబంధించిన మెటీరియల్స్ రూపొందిస్తున్నారు. విద్యార్థుల డిమాండ్ ఎక్కువగా ఉండటంతో మెటీరియల్ ధరలు కూడా ఈసారి ఎక్కువగానే ఉండే వీలుందని నిపుణులు చెబుతున్నారు. 2017లో ఇదే తరహాలో స్టడీ మెటీరియల్స్ వచ్చినా, చాలా వరకూ నాణ్యత లోపం కన్పించిందని సైన్స్ అధ్యాపకుడు నవీన్ చంద్ర తెలిపారు. సీబీఎస్‌ఈ పుస్తకాలను 1–10 వరకూ క్షుణ్ణంగా చదివితే మంచి మార్కులు సాధించే వీలుందని, అనవసరంగా స్టడీ మెటీరియల్స్‌పై నమ్మకం పెట్టుకోవద్దని సూచించారు.

ప్రైవేటు స్కూళ్లల్లో టీచర్ల కొరత

ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సాధించాలని యువత లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో ఇప్పటికే ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు ప్రత్యేక శిక్షణపై దృష్టి పెట్టారు. దీంతో స్కూళ్లకు దీర్ఘకాలిక సెలవులు పెడుతున్నారు. ఇది తమకు మంచి అవకాశమని, సెలవు ఇవ్వకపోతే రాజీనామాకు సిద్ధమని యాజమాన్యాలకు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ప్రైవేటు టీచర్లకు వేతనాలు కూడా అరకొరగా ఉంటున్నాయి. ఈ కారణంగా ఉన్నపళంగా ప్రైవేటు టీచర్లు వెళ్ళిపోతున్నారు. దీంతో ప్రైవేటు స్కూళ్ళల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతోంది. ఇక హైదరాబాద్ సహా ఇతర ముఖ్యమైన పట్టణ ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ స్కూళ్ళలో పనిచేస్తున్న టీచర్లకు యాజమాన్యాలు కొన్ని క్లాసులు తగ్గించి, పరీక్షకు సన్నద్ధమయ్యే అవకాశం కల్పిస్తున్నాయి.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంతోనే రైతుల ఆర్థిక ప్రగతి: మంత్రి కేటీఆర్

- అమెరికాలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై అధ్యయనం



సాక్షి, హైదరాబాద్: అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామా రావు ఆదివారం షికాగోలో ఫుడ్ ప్రాసె సింగ్ రంగంపై అధ్య యనం చేశారు. ఇందులో భాగంగా పలు కంపెనీల ప్రతినిధులతో పెట్టుబడులకు సంబంధించి వరుస సమావేశాలు నిర్వహించారు. ''షికాగో ఫుడ్ స్టాప్'ను సందర్శించి అక్కడ వరల్డ్ బిజినెస్ షికాగో సంస్థ ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లా డారు. షికాగో ఫుడ్ స్టాప్‌లో ఏర్పాటు చేసిన అనేక షాపులను పరిశీలించారు. స్థానిక వ్యాపారవేత్తలతో సంభాషించారు. షికాగో అనుసరిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫుడ్ ప్రొక్యూర్మెంట్ పద్ధతులపైన చర్చించారు. షికాగో ఫుడ్ స్టాప్ ఇన్నోవేషన్ ఈకో సిస్టం వ్యవస్థను తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు.

షికాగో ఫుడ్ స్టాప్ మాదిరి తెలంగాణలో కూడా..

షికాగో ఫుడ్ స్టాప్ మాదిరిం ఫుడ్ ప్రాసెసింగ్ పురోగతికి తెలంగాణ ఫుడ్ స్టాప్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఇన్నోవేషన్ ప్రాధాన్యత ఎంతగానో ఉందని, ఇది కేవలం ఫుడ్ ఇండస్ట్రీకి మాత్రమే కాకుండా వ్యవసాయ రంగంపైన ఆధార పడిన రైతులు, వ్యవసాయ సంబంధిత పరిశ్రమల్లోని భాగస్వాముల అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుందని వివరించారు. ఫుడ్ ఇన్నోవేషన్ హబ్‌గా మారేందుకు కావలసిన అన్ని రకాల అవకాశాలు తెలంగాణలో ఉన్నాయన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ బలోపేతానికి..

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఆ మేరకే తెలంగాణ రాష్ట్రానికి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో భారీ ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. కోకా కోల, పెప్సీకో, ఐటీసీ వంటి దిగ్గజ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో పెట్టిన పెట్టుబడుల గురించి ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధి కోసం పదివేల ఎకరాలకు పైగా కేటాయించి ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని కేటీఆర్ వివరించారు.

నిజామాబాద్ ఐటీ హబ్‌లో క్రిటికల్ రివర్ సంస్థ

నిజామాబాద్ ఐటీ హబ్ లో అమెరికాకు చెందిన క్రిటికల్ రివర్ సంస్థను ఏర్పాటు చేసేందుకు ఆ కంపెనీ ప్రతినిధులు అంగీకరించిన్నట్లు బీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్రం నుంచి ఇద్దరు

- ఆ ఇరువురూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారే


అర్చన


సంతోష్‌కుమార్

తాంసి/దండేపల్లి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో ప్రదానం చేసే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఈసారి రాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 50 మందిని ఎంపిక చేయగా తెలంగాణ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపిక కాగా, ఆ ఇద్దరూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారే. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం బెదోడ్కర్ సంతోష్‌కుమార్, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నుగూరి అర్చన.. సెప్టెంబర్ 5వ తేదీన ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోనున్నారు.

పాఠశాల పేరు మీద యూట్యూబ్ చానెల్‌లో పాఠాలు


20 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సంతోష్‌కుమార్ కరోనా ఉధృతి సమయంలో పాఠశాల విద్యార్థులు చదువుకు దూరం కాకుండా గూగుల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పాఠాలను బోధించారు. పాఠశాల పేరు మీద ప్రత్యేక యూట్యూబ్ చానెల్‌లో సైతం నిత్యం రోజు వారీ పాఠాలను అప్‌లోడ్ చేయడం వంటివి చేపట్టారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే దిశగా 100 వరకు ఉన్న విద్యార్థులను ప్రస్తుతం 220 వరకు చేర్చారు.

సొంత డబ్బులతో స్కూల్‌ను తీర్చిదిద్ది..

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను నుగూరి అర్చన తీర్చిదిద్దారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతోపాటు ఆమె సొంత ఖర్చులతో నాణ్యమైన విద్యాబోధన చేస్తూ, రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల అంటేనే అందరు మెచ్చుకునేలా తీర్చిదిద్దారు. అర్చన సేవలకు ఇప్పటికే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు పొందగా, ఈసారి ఏకంగా జాతీయ పురస్కారం దక్కింది.

కుల వృత్తులకు ఊపిరి పోసింది సీఎం కేసీఆరే

- గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలోని కుల వృత్తులకు ఊపిరి పోశారని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఆదివారం జరిగిన 25వ జాతీయ కళాల్ సమాజ్ మహాసభలో పల్లె లక్ష్మణ్ రావు గౌడ్, భోపాల్ మేయర్ మాలతీ రాయ్, కల్చురి జాతీయ అధ్యక్షుడు సహస్రబాహు, వారణాసి ఎమ్మెల్యే ప్రదీప్ జీ జైస్వాల్, ఎల్‌ఎన్‌సీటీ గ్రూప్ సంస్థల చైర్మన్ జయనారాయణ్ పూనమ్ చోక్స్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు గౌడ్ మాట్లాడుతూ, గౌడ సామాజికవర్గం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. గీత కార్మికులకు బీమా, మద్యం దుకాణాల్లో 15% రిజర్వేషన్, హరితహారంలో భాగంగా 4 కోట్ల ఈత, తాటి చెట్లు నాటడ, మూతపడిన 103 కల్లు సొసైటీలను మళ్లీ తెరవడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు.

యాదాద్రిలో నేటితో ముగియనున్న పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో పంచరాత్ర ఆగమశాస్త్రరీతిలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండోరోజైన ఆదివారం ఉదయం ప్రథమ ప్రకార మండపంలోని యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర, మూర్తిమంత్ర హోమాలు జరిగాయి. ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. ఆగమశాస్త్రరీతిలో యాగశాలలో హవన పూజలు చేసి నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. పవిత్రమాలలను, శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను తిరువీధిలో సేవోత్సవం జరిపించారు. అనంతరం వాటిని శ్రీస్వామి వారి చెంత పెట్టారు.

సాయంత్రం వేళ...: పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో సాయంత్రం నిత్య అర్చనలు, ఆరాధనలు, హోమ పూజలు కొనసాగాయి. శ్రీవైష్ణవ దేవాలయాల్లో పంచరాత్రాగమశాస్త్ర పద్ధతిలో మూడురోజుల పాటు కొనసాగే పవిత్రోత్సవాలను సోమవారం ప్రధాన ఆలయంలోని స్వయంభూమూర్తులకు పవిత్రమాల ధారణలతో ముగియనున్నాయి.


యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ చిల్లకూరు సుమలత, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు

మంత్రుల నివాస సముదాయంలో మృత్యుంజయ హోమం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రుల నివాస సముదాయంలో ఆదివారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మృత్యుంజయ హోమం నిర్వహించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని, రాష్ట్రానికి మూడోసారి కూడా ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ సత్యవతి రాథోడ్ తన కుటుంబ సభ్యులతో కలసి ఈ హోమాన్ని చేశారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధికోసం అనేక పరిపాలనా సంస్కరణలు తీసుకురావడంతో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి అన్నారు. ఉదయం 4:30 గంటలకు ప్రారంభమైన మృత్యుంజయ హోమ కార్యక్రమంలో మంత్రులు శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్ కుమార్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సురభి వాణీదేవి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ కుమారి అంగోత్ బిందు, జీసీసీ చైర్మన్ వాల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో బీసీలకు పెద్దపీట

- కోకాపేటలో పెరిక ఆత్మగౌరవ భవనానికి శంకుస్థాపన
- బహిరంగ సభలో పాల్గొన్న మంత్రులు గంగుల, తలసాని


పెరిక ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్

మణికొండ/మేడిపల్లి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయినా రాజకీయ పార్టీలకు బీసీలు ఓటు బ్యాంకుగానే పనికి వచ్చారని, అయితే మొదటిసారి వారికి ఆత్మగౌరవం, రాజ్యాధికార ఫలాలను అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు అన్నారు. ఆదివారం హైదరాబాద్ శివారు కోకాపేటలో పెరికలకు కేటాయించిన రెండు ఎకరాల భూమిలో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కులాలు ఆత్మగౌరవంతో బతకాలని, వారి పిల్లలు ఉన్నత చదువులు చదువుకుని రాణించాలనే ఉద్దేశంతో ఎకరం వంద కోట్ల విలువైన భూమిని ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాగా, బీసీల సంఖ్యను బట్టి ఎమ్మెల్యే టికెట్‌లు రావని, మనం సమాజంలో ఎదిగితేనే అవి వరిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య, రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షుడు మద్దాలింగయ్య, ఆత్మగౌరవ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గటిక విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాత్తాద శ్రీవైష్ణవ ఆత్మగౌరవ భవన్‌కు శంకుస్థాపన


పీర్జాదిగూడలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘ ఆత్మగౌరవ భవన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు మల్లారెడ్డి, గంగుల కమలాకర్

బీసీలు, ఎంబీసీలు, సంచార కులాలకు కోట్లాది రూపాయల విలువ చేసే ఖరీదైన స్థలాలను కేటాయించడమేకాక, ఆయా వర్గాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణకోసం నిధులను ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మంత్రులు గంగుల కమలాకర్, చామకూర మల్లారెడ్డిలు అన్నారు. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని వారు చెప్పారు. ఆదివారం మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆత్మగౌరవ భవన్‌కు మంత్రులు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పేదల దేవుడని అభివర్ణించారు. గతంలో ఏపాలకులు చేయని విధంగా కేసీఆర్ పేదల కోసం చేస్తున్న కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అన్నారు.

FOOD CORPORATION OF INDIA
GeM పోర్టల్ ద్వారా ఈ-టెండర్ల కోసం ఆహ్వానం
HATC
GeM
(www.fci.gov.in)

ANDHRA PRADESH CENTRAL POWER DISTRIBUTION CORPORATION LIMITED
Dr.Y.S.R VIDYUT SOUDHA, CORPORATE OFFICE, ITI COLLEGE ROAD, VIJAYAWADA-520 008
Tender Notice No :CGM/PROJ/VJA/RDSS-AMISP-II/SIP - 12/2023-24
Bids through apeprocurement.gov.in are invited from eligible bidders for "Appointment of Advanced Metering Infrastructure (AMI) Service Provider (AMISP) for Smart Prepaid Metering by replacing the existing meters to Domestic-(Confining to Amrut Cities) and Commercial services under Phase-II in the erstwhile Revenue Districts of Krishna, Guntur & Prakasam Districts in the Jurisdiction of APCPDCL in TOTEX mode on DBFOOT basis" under Revamped Distribution Sector Scheme (RDSS). The Tender information will be made available in AP E-procurement Portal from 28.08.2023, 18:00 Hrs, Last date for Bid submission online is 11.09.2023, 16:00 Hrs.
Sd/- Chief General Manager/ Projects
APCPDCL::VIJAYAWADA
E-mail: cgmproj.cpdcl@apcpdcl.in

పనామా ట్రాఫిక్‌జామ్‌!

అంతర్జాతీయ వర్తకానికి అతి కీలకమైన పనామా కాలువ నానాటికీ చిక్కిపోతోంది. దాంతో భారీ సరుకు రవాణా నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొద్ది రోజులుగా ఎప్పుడు చూసినా వందలాది నౌకలు బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. దాంతో పనామాకు ప్రత్యామ్నాయంగా మరో కాలువ ఉండాలన్న వాదన మళ్లీ తెరమీదకొచ్చింది.


పనామా కాలువ ప్రవేశ మలుపు వద్ద తమ వంతు కోసం వేచి చూస్తున్న వందలాది ఓడలు

పనామా కాలువకు నీటి కరువు

- నిలిచిపోయిన భారీ నౌకలు
- అంతర్జాతీయ వర్తకానికి ఈ కాలువ దారే అతి కీలకం
- ఏటా 270 బిలియన్‌ డాలర్ల విలువైన సరుకుల రవాణా
- ప్రత్యామ్నాయంగా తెరపైకి నికరాగ్వా కాలువ నిర్మాణం

పసిఫిక్, అట్లాంటిక్‌ మహా సముద్రాలను కలిపే కీలకమైన పనామా కాలువలో నీటి పరిమాణం కొన్నాళ్లుగా బాగా తగ్గుతోంది. దాంతో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోయి భారీ నౌకల ప్రయాణానికి ప్రతిబంధకంగా మారింది. ఓ మోస్తరు నౌకలు ఆచితూచి, అతి నెమ్మదిగా కదలాల్సి వస్తోంది. దీంతో విపరీత జాప్యం జరుగుతోంది. ఫలితంగా భారీ నౌకలు కాలువను దాటి అటు అట్లాంటిక్, ఇటు పసిఫిక్‌ వైపు వెళ్లడానికి రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ప్రస్తుతం కనీసం 250కిపైగా భారీ నౌకలు తమవంతు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

కారణమేమిటి?

పనామా కాలువకు ప్రధానంగా నీటిని సరఫరా చేసే రెండు రిజర్వాయర్లు కొద్ది కాలంగా నీటి ఎద్దడితో అల్లాడుతున్నాయి. వాటి పరీవాహక ప్రాంతాల్లో నెలకొన్న తీవ్ర వర్షాభావమే అందుకు అసలు కారణం.

మళ్లీ తెరపైకి 'ఆ కాలువ'

పనామా కాలువ పరిమితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ కాలువ ఉండాలన్న ప్రతిపాదన మళ్లీ తెరమీదికి వస్తోంది. ఇది కొత్తదేమీ కాదు. 1900 తొలినాళ్లలో అమెరికా ముందు రెండు ప్రతిపాదనలు ఉండేవి. ఒకటి పనామా కాగా మరోటి నికరాగ్వా గుండా కాలువ నిర్మాణం. పనామాకే అమెరికా సెనేట్‌ ఓటు వేయడంతో నికరాగ్వా గుండా నిర్మాణం అనేది ప్రతిపాదనలకే పరిమితమైంది. ఆ మార్గంలో చురుకైన అగ్ని పర్వతాలు ఉండటం సైతం ఆ ప్రాజెక్టు ఆదిలోనే ఆగడానికి ప్రధాన కారణం. అదీ కాక నికరాగ్వా మార్గంతో పోలిస్తే తక్కువ దూరం ఉండటమూ పనామాకు కలిసొచ్చిన అంశాల్లో ఒకటి. దీంతో ఆనాడు కనుమరుగైన ఆ ప్రతిపాదన తాజాగా ఇప్పుడు కొత్త రెక్కలు కట్టుకుని ముందుకు వాలింది.

- ఎలాగైనా దాని నిర్మాణం పూర్తి చేస్తానని చైనాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఒకరు ముందుకొచ్చారు.
- 2013 ఏడాదిలో హెచ్‌కేఎన్‌డీ అనే చైనా కంపెనీ నికరాగ్వా కాలువ నిర్మాణానికి సిద్ధపడింది కూడా. నికరాగ్వా దేశ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. 50 ఏళ్ల పాటు దాని నిర్వహణ అధికారాలు సంపాదించింది. కానీ ఇదీ కాగితాలకే పరిమితం అయింది.

అంత ఈజీ కాదు...

నికరాగ్వా గుండా కాలువ నిర్మాణానికి ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. ఎందుకంటే...

- పశ్చిమాన పసిఫిక్, తూర్పున అట్లాంటిక్‌ను కలుపుతూ రెండు కాలువలు తవ్వాలి. ఈ కాలువల మధ్యలోనే నికరాగ్వా సరస్సు ఉంటుంది.
- అట్లాంటిక్‌ వైపు 25 కిలోమీటర్లు, పసిఫిక్‌ వైపు 100 కిలోమీటర్ల పొడవునా ఈ కాలువలను తవ్వాల్సి ఉంటుంది.
- దీని నిర్మాణానికి కనీసం 40 బిలియన్‌ డాలర్లు ఖర్చు అవుతుందని అంచనా.
- ఇంత భారీ వ్యయంతో కాలువ నిర్మాణం చేపట్టాలంటే దాని ద్వారా అంతకు మించి ఆదాయం ఉంటుందన్న భరోసా కావాలి.
- ఇంత భారీ కాలువ నిర్మాణమంటే పర్యావరణ పరంగా ఎంతో పెద్ద సవాలే.
- నిర్మాణం కారణంగా సతతహరిత అరణ్యాలు తుడిచి పెట్టుకుపోతాయని పర్యావరణవేత్తలు ఆందోళనలు చేశారు.


ఫైల్‌ ఫొటో

ఇదీ పనామా కథ

- మధ్య అమెరికాలో ఉన్న బుల్లి దేశం పనామా.
- అక్కడ నిర్మించిన కృత్రిమ కాలువే పనామా కాలువ.
- ఇది ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలను కలుపుతుంది.
- దీని పొడవు 80 కిలోమీటర్లు.
- పనామా కాలువ మధ్యలో గతూన్‌ అనే కృత్రిమ సరస్సు ఉంటుంది. అలజేలా అనే మరో కృత్రిమ సరస్సు ఈ కాలువకు రిజర్వాయర్‌గా ఉంది.
- ఇటు పసిఫిక్‌ మహా సముద్రం, అటు అట్లాంటిక్‌ మహా సముద్రం వైపు కరేబియన్‌ సముద్రాన్ని విడదీసే ఇస్తుమస్‌ ఆఫ్‌ పనామాను ఆనుకుని పనామా కాలువ ఉంటుంది.
- పనామా కాలువ గుండా ఏటా 270 బిలియన్‌ డాలర్ల విలువైన సరుకు రవాణా జరుగుతోంది.
- పనామా గుండా 170 దేశాలకు సరుకులు వెళ్తాయి.

ఏం జరగనుంది?

- సరుకు నౌకలు దీర్ఘ కాలం పాటు ఇలా వేచి ఉండటం కారణంగా రవాణా వ్యయం విపరీతంగా పెరుగుతుంది.
- దాంతో ద్రవీకృత సహజ వాయువు తదితర ఇంధనాల ధరలకు అమాంతం రెక్కలొస్తాయి.
- ఇది అంతిమంగా చాలా దేశాల్లో, అంటే అంతర్జాతీయంగా ధరల పెరుగుదలకు దారి తీస్తుంది.
- చివరకు ద్రవ్యోల్బణం పెరిగి పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు అల్లాడే పరిస్థితి రావచ్చు.

'పనామాలో ఇప్పుడున్నది కనీవినీ ఎరగని అసాధారణ పరిస్థితి. చాలా ఆందోళనకరం కూడా'
– మిషెల్‌ వైస్‌ బోక్‌మ్యాన్, లాయిడ్స్‌ లిస్ట్‌ ఇంటెలిజెన్స్‌లో సీనియర్‌ విశ్లేషకుడు

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌

భారత్‌తో బంధాలు బలపడితే చైనాపై ఆధారపడనక్కర్లేదు

- ప్రధాని మోదీ మంచి నేత
- భారతీయ మీడియాతో వివేక్‌ రామస్వామి

లోవా: భారత్‌తో అమెరికా బంధాలు మరింత బలపడితే చైనాపై ఆధారపడే అవసరం ఉండదని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్‌ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న భారత సంతతికి చెందిన వివేక్‌ రామస్వామి అభిప్రాయపడ్డారు. అండమాన్‌ సముద్రంలో మిలటరీ బంధాల్ని భారత్‌తో పటిష్టం చేసుకుంటే చైనా నుంచి దూరం కావచ్చునని వ్యాఖ్యానించారు. 38 ఏళ్ల వయసున్న వివేక్‌ రామస్వామి రిపబ్లికన్‌ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో నిలిచిన వారిలో పిన్న వయస్కుడు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ తర్వాత ఈ బరిలో ముందున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో అత్యంత కీలకమైన లోవా రాష్ట్రంలో పర్యటిస్తున్న వివేక్‌ రామస్వామి పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. 'చైనాపై అమెరికా ఆర్థికంగా ఆధారపడి ఉంది. భారత్‌తో సంబంధాలు బలపడితే చైనాతో బంధాల నుంచి బయటపడవచ్చు' అని రామస్వామి వివరించారు. 'అండమాన్‌ సముద్రంలో మిలటరీ బంధాలు సహా భారత్‌తో అమెరికాకు వ్యూహాత్మక సంబంధాలు బలోపేతం కావాలి. పశ్చిమాసియా దేశాల నుంచి చైనాకు చమురు సరఫరా అవుతున్న మలక్కా జలసంధిని భారత్‌ అడ్డుకోగలదన్న విషయం మనకు తెలిసుండాలి. ఇరు దేశాల బంధాల బలోపేతానికి ఇవే కీలకం. అదే జరిగితే అమెరికాకు మంచే జరుగుతుంది. ఆ దిశగా నేను ముందుకు వెళతాను' అని రామస్వామి చెప్పారు. మొదటిసారిగా భారతీయ మీడియాకి ఇంటర్వ్యూ ఇచ్చిన వివేక్‌ భారత ప్రధాని మోదీ మంచి నాయకుడని ప్రశంసించారు. మోదీతో కలిసి ఇరు దేశాల సంబంధాల బలోపేతానికి కృషి చేసే రోజు కోసం తాను ఎదురు చూస్తున్నట్టుగా చెప్పారు.

ఆ యాడ్‌తో బాద్‌షాకి చిక్కులు



ముంబై: బాలీవుడ్‌ బాద్‌షా షారూక్‌ ఖాన్‌ చిక్కుల్లో పడ్డారు. ఒక ఆన్‌లైన్‌ గేమింగ్‌ యాప్‌కు బ్రాండ్‌ అంబాసిడర్‌గా వ్యవహరించినందుకు ఆయన ఇల్లు ముట్టడికి కొందరు విఫలయత్నం చేశారు. ఆన్‌లైన్‌ జూదాన్ని ప్రోత్సహించేలా షారూక్‌ వ్యవహరించడం వారికి మింగుడు పడడం లేదు. అన్‌టచ్‌ ఇండియా ఫౌండేషన్‌కు చెందిన కొందరు బాంద్రాలోని షారూక్‌ ఇంటి బయట నిరసనలకు దిగడానికి చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. షారూక్‌ ఇంటికి గట్టి భద్రత ఏర్పాటు చేసి కొందరు యువకుల్ని అదుపులోనికి తీసుకున్నారు. ఏ23 అనే ఆన్‌లైన్‌ రమ్మీ పోర్టల్‌కి బ్రాండ్‌ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న షారూక్‌ ఇటీవల దానికి సంబంధించిన ఒక వాణిజ్యప్రకటన(యాడ్‌)లో నటించారు. ఆ యాడ్‌లో 'పదండి కలిసి ఆడదాం' అని షారూక్‌ వ్యాఖ్యానిస్తారు. ఈ అడ్వర్టయిజ్‌మెంట్‌పై అన్‌టచ్‌ యూత్‌ ఫౌండేషన్‌ తీవ్ర స్థాయిలో మండిపడింది. జంగ్లీ రమ్మీ, జూపీ వంటి ఆన్‌లైన్‌ గేమింగ్‌ యాప్స్‌ యువతని పక్కదారి పట్టిస్తున్నాయని అన్‌టచ్‌ ఇండియా ఫౌండేషన్‌ విమర్శించింది.

వైన్‌ నిల్వలు వదిలించుకొనేందుకు రూ. 1,700 కోట్లు

పారిస్‌: ప్రభుత్వ ఖజానాలో కాసులు గలగలలాడడానికి ఎవరైనా మద్యం అమ్మకాలు పెంచుతారు. కానీ ఫ్రాన్స్‌ మద్యానికి డిమాండ్‌ లేకపోవడంతో ఆ నిల్వలను వదిలించుకోవడానికి దాదాపు రూ.1,700 కోట్లు (20 కోట్ల యూరోలు) ఖర్చు చేయాలని నిర్ణయించింది. కోవిడ్‌ సంక్షోభం, ఆ వెంటనే రష్యా– ఉక్రెయిన్‌ యుద్ధంతో యూరప్‌ దేశాలన్నీ ద్రవ్యోల్బణంతో కొట్టుమిట్టాడుతున్నాయి. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు వైన్‌ వంటి వాటికి ఖర్చు చెయ్యడం బాగా తగ్గించేశారు. తక్కువ ధరకు లభించే బీర్‌కు అలవాటు పడిపోయారు. దీనికి వాతావరణ పరిస్థితులు తోడయ్యాయి. గ్లోబల్‌ వార్మింగ్‌ ప్రభావంతో ఫ్రాన్స్‌ సహా యూరప్‌ దేశాల్లో ఇటీవల కాలంలో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కబోత భరించలేని ప్రజలు వైన్‌ బదులుగా బీర్‌ ఎక్కువగా తాగుతున్నారు. చాలా మంది ఆల్కహాల్‌ ఉత్పత్తులకు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా జనరేషన్‌ జెడ్‌(1996 నుంచి 2010 మధ్య పుట్టినవారు) మద్యం తాగడానికి ఇష్టపడడం లేదు. ఫలితంగా వైన్‌కి డిమాండ్‌ పడిపోయింది. మరోవైపు వైన్‌ ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన బోర్డాక్స్‌ ప్రాంతంలో వైన్‌ నిల్వలు భారీగా పేరుకుపోయాయి. దీంతో ప్రభుత్వమే ఆ వైన్‌ను కొనుగోలు చేసేందుకు 20 కోట్ల యూరోలు కేటాయించింది. అదనంగా ఉన్న వైన్‌ను కొనుగోలు చేసి దానిలోని ఆల్కాహాల్‌ను శానిటైజర్లు, శుభ్రతా ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు వంటి వాటి తయారీలో వినియోగించనుంది. ఇలా చేయడం ద్వారా మళ్లీ వైన్‌కు డిమాండ్‌ పెరుగుతుందనే ఆలోచనతోనే ప్రభుత్వం ముందుకెళ్తోంది. వైన్‌ వినియోగం యూరప్‌ దేశాలైన ఇటలీలో ఏడు శాతం, స్పెయిన్‌లో 10 శాతం, ఫ్రాన్స్‌లో 15 శాతం, జర్మనీలో 22 శాతం, పోర్చుగల్‌లో 34 శాతం మేర తగ్గిపోయింది.

క్లుప్తంగా...

ఢిల్లీ మెట్రోల్లో ఖలిస్తానీ రాతల కలకలం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఐదు మెట్రో స్టేషన్ల గోడలపై గుర్తు తెలియని వ్యక్తులు ఖలిస్తానీ అనుకూల రాతలు రాశారు. సెప్టెంబర్‌ 9, 10వ తేదీల్లో ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సమ్మేళనం జరగనున్న వేళ ఈ పరిణామం కలకలం రేపింది. శివాజీ పార్క్, పశ్చిమ్‌ విహార్, ఉద్యోగ్‌ నగర్, మహారాజా సూరజ్‌మల్‌ స్టేడియం, మాదిపూర్‌ మెట్రో స్టేషన్ల గోడలపై 'ఢిల్లీ బనేగా ఖలిస్తాన్, ఖలిస్తాన్‌ జిందాబాద్‌' అంటూ రాసినట్లు పోలీసులు తెలిపారు. నంగ్లోయిలోని ఓ ప్రభుత్వ పాఠశాల గోడపైనా ఇవి కనిపించాయన్నారు. దుండగులను గుర్తించేందుకు సీసీటీవీ కెమెరా ఫుటేజీని సేకరించామన్నారు. నిషేధిత సిఖ్స్‌ ఫర్‌ జస్టిస్‌(ఎస్‌ఎఫ్‌జే) విడుదల చేసినట్లుగా భావిస్తున్న భావిస్తున్న వీడియోలో మెట్రో స్టేషన్ల గోడలపై రాతలు కనిపించాయి. ఆ వీడియోలో ఎస్‌ఎఫ్‌జే ప్రతినిధి గుర్‌పత్వంత్‌ సింగ్‌ పన్నున్‌..జీ20 దేశాల నేతలూ, మీరు ఢిల్లీలో సెప్టెంబర్‌ 10న సమావేశమయ్యే రోజునే కెనడాలో మేం ఖలిస్తాన్‌పై రెఫరెండం చేపడతాం 'అని అన్నట్లుగా ఉంది. జనవరి 19న ఢిల్లీలోని మెట్రో స్టేషన్ల గోడలపైన ఇలాంటి రాతలే దర్శనమిచ్చాయి.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు నల్లజాతీయులు మృతి

జాక్సన్‌విల్లె: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం జాక్సన్‌విల్లెలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న కాల్పుల ఘటన కలకలం రేపింది. ఎడ్వర్డ్‌ వాటర్స్‌ యూనివర్సిటీకి సమీపంలోని డాలర్‌ జనరల్‌ స్టోర్‌ వద్ద ఓ యువకుడు(20) జరిపిన కాల్పుల్లో ముగ్గురు నల్ల జాతీయులు ప్రాణాలు కోల్పోయారు. ఇది జాతి విద్వేష ఘటన అని పోలీసులు తెలిపారు. అనంతరం దుండగుడు తనను తాను కాల్చుకుని చనిపోయాడు. నిందితుడు నల్ల జాతీయులను ద్వేషించే వాడని, ఇతర గ్రూపులతో అతడికి సంబంధాలున్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు స్పష్టం చేశారు. అతడు హ్యాండ్‌గన్‌తో పాటు, సెమీ ఆటోమేటిక్‌ రైఫిల్‌తో కాల్పులకు తెగబడ్డాడన్నారు. ఒక తుపాకీపై స్వస్తిక్‌ గుర్తు ఉందని వివరించారు. పొరుగునే ఉన్న క్లై కౌంటీ నుంచి నల్లజాతీయులు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతానికి వచ్చాడు. కాల్పులకు కొద్దిసేపటి ముందు తన తండ్రికి మెసేజీ పంపించాడని, దాని ప్రకారం నిందితుడి కంప్యూటర్‌ ఓపెన్‌ చేసి చూడగా విద్వేషపూరిత రాతలు కనిపించాయని పోలీసులు వివరించారు.

బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. 8 మంది దుర్మరణం



బరాసత్‌: పశ్చిమబెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఆదివారం ఉదయం బాణాసంచా కర్మాగారంలో పేలుడు సంభవించి 8 మంది చనిపోయారు. పలువురు గాయాలపాలయ్యారు. దుత్తపుకుర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని నీల్‌గుంజ్‌లోని కర్మాగారంలో ఘటన జరిగిన సమయంలో పలువురు సిబ్బంది పనుల్లో నిమగ్నమై ఉన్నారు. పేలుడు తీవ్రతకు చుట్టుపక్కలున్న 50 నివాసాలు దెబ్బతిన్నాయని పోలీసు అధికారులు వివరించారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కర్మాగారం యజమాని కొడుకు కూడా పేలుడులో చనిపోయాడన్నారు. మంటలను ఆర్పేందుకు ఫైర్‌ సిబ్బంది కృషి చేస్తున్నారని చెప్పారు. అక్రమంగా నడుపుతున్న ఈ కర్మాగారంలో బాణాసంచా పేరుతో బాంబులు తయారు చేస్తున్నారా అన్న అనుమానాలకు దర్యాప్తులోనే సమాధానం దొరుకుతుందని చెప్పారు. పేలుడు అనంతరం స్థానికులు కర్మాగారం యజమాని ఇంటిని ధ్వంసం చేశారు. గత మేలో పూర్వ మేదినీపూర్‌ జిల్లాలోని ఈగ్రాలో బాణాసంచా కర్మాగారంలో జరిగిన పేలుడులో 12 మంది చనిపోయారు.

ఆస్ట్రేలియాలో కూలిన అమెరికా నేవీ విమానం

ముగ్గురు నౌకాదళ సభ్యులు మృతి

కేన్‌బెర్రా: ఆస్ట్రేలియాలో జరుగుతున్న సైనిక విన్యాసాల్లో అమెరికాకు చెందిన నౌకా దళ విమానం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు నేవీ సభ్యులు మరణించారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలతో కలిసి ఆస్ట్రేలియాలోని మెల్విలె ద్వీపంలో విన్యాసాల్లో శిక్షణ ఇస్తుండగా ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో విమానంలో 23 మంది ఉండగా ముగ్గురు మరణించారు. 20 మంది గాయపడ్డారు. వారిలో అయిదుగురి పరిస్థితి విషమంగా ఉంది.


ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై మహిళలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం బెంగళూరులో నిర్వహించిన 'శారీ రన్‌' లో పరుగెత్తుతున్న మహిళలు.

నైతిక 'కృత్రిమ మేధ' అత్యావశ్యం

- లేదంటే సమాజంపై ఏఐ ప్రతికూల ప్రభావాలు తప్పవు
- బీ20 సదస్సులో ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: అధునాతన సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌–ఏఐ)ను నైతికంగా వినియోగించాలని, లేదంటే విపరిణామాలు తప్పవని ప్రధాని మోదీ హెచ్చరించారు. నూతన సాంకేతికతలో నైతికత లోపిస్తే సమాజంపై ఏఐ ప్రతికూల ప్రభావాలు ఎక్కువ అవుతాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం ఢిల్లీలో కొనసాగుతున్న బీ–20(బిజినెస్‌ ఫోరమ్‌–20) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. 'ఏఐ వినియోగానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయి ఏకరూప మార్గనిర్దేశకాలు అవసరం. నిబంధనల చట్రం లేకుంటే క్రిప్టో కరెన్సీ వంటి అంశాల్లో సమస్యలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదముంది. పర్యావరణానికి హాని తలపెట్టని రీతిలో జీవన, వ్యాపార విధానాలకు పారిశ్రామిక వర్గాలు ప్రాధాన్యతనివ్వాలి. ఇందుకు వ్యాపారవర్గాలు, ఆయా దేశాల ప్రభుత్వాలు కలసి కట్టుగా ముందుకు సాగాలి' ఆయన మోదీ కోరారు. 'పర్యావరణ మార్పు, ఇంధన రంగంలో సంక్షోభం, ఆహార గొలుసులో లోపించిన సమతుల్యత, నీటి భద్రత వంటివి అంతర్జాతీయంగా వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్యలకు దేశాలన్నీ ఉమ్మడిగా పరిష్కరించుకోవాలి' అని ఆయన అభిలషించారు. వ్యాపారవర్గాలు తమ వ్యాపార సంబంధ అంశాలను చర్చించేందుకు జీ20కి అనుబంధంగా ఏర్పాటుచేసుకున్న వేదికే బిజినెస్‌ 20(బీ20) ఫోరమ్‌. విధాన నిర్ణేతలు, వ్యాపారదిగ్గజాలు, నిపుణులుసహా జీ20 దేశాల ప్రభుత్వాలు ఉమ్మడిగా బీ20 ఇండియా తీర్మానంపై చర్చలు జరుపుతాయి. ఈ తీర్మానంలో 54 సిఫార్సులు, 172 విధానపర చర్యలు ఉన్నాయి. వీటిని సెప్టెంబర్‌ 9–10 తేదీల్లో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సులో సమర్పిస్తారు.

వారే ఆర్థికాభివృద్ధి చోదక శక్తులు

'ప్రస్తుతం భారత్‌లో చాలా మంది పేదరికం నుంచి బయటపడి కొత్తగా 'మధ్యతరగతి' వర్గంలో చేరుతున్నారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 'పేదరికాన్ని నిర్మూలిస్తూ కేంద్రం అవలంబిస్తున్న విప్లవాత్మక విధానాల కారణంగా మరో 5–7 ఏళ్లలో కోట్ల భారీ సంఖ్యలో మధ్యతరగతి జనాభా అవతరించనుంది. వీరే భారత ఆర్థికాభివృద్ధి చోదక శక్తులు. వీరే దేశంలో అతిపెద్ద వినియోగదారులు. కొంగొత్త ఆకాంక్షలతో శ్రమిస్తూ దేశార్థికాన్ని ముందుకు నడిపిస్తారు. ప్రభుత్వం 'పేదలను పై స్థాయికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తోంది. దీంతో ఆ తర్వాత లబ్ధిపొందేది మధ్యతరగతి, సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల వర్గాలే. మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే వ్యాపారాలు వర్ధిల్లుతాయి. వ్యాపారాలు, వినియోగదారుల మధ్య సమతూకం సాధిస్తే లాభదాయ మార్కెట్‌ సుస్థిరంగా కొనసాగుతుంది. ప్రపంచ దేశాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. వినియోగ దేశాలు బాగుండాలంటే వస్తూత్పత్తి దేశాలను పట్టించుకోవాలి. లేదంటే వస్తూత్పత్తి దేశాలు కష్టాల కడలిలో పడతాయి. అందుకే ఏటా అంతర్జాతీయ వినియోగ సంరక్షణ దినం జరుపుకుందాం' అని వ్యాపార వర్గాలకు మోదీ పిలుపునిచ్చారు.

కోటాలో భవంతులకు వలలు

విద్యార్థుల ఆత్మహత్యల నిరోధానికి చర్యలు



కోటా: పోటీ ప్రవేశ పరీక్షలకు ప్రసిద్ధి చెందిన రాజస్తాన్‌లోని కోటా పట్టణం ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యలతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఈ ఏడాది ఏకంగా 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడడంతో జిల్లా యంత్రాంగం ఆత్మహత్యల నిరోధానికి ఎన్నో చర్యలు చేపట్టింది. ఇప్పటికే అన్ని హాస్టల్స్‌లో విద్యార్థులకు కౌన్సెలింగ్‌తోపాటు యోగా తరగతులు ప్రారంభించింది. ఫ్యాన్‌కు ఉరేసుకుని చాలా మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్న ఉదంతాల నేపథ్యంలో ఫ్యాన్‌లను స్ప్రింగ్‌లకు బిగించారు. ఇప్పుడు తాజాగా అన్ని హాస్టల్‌ భవనాలకు వలలు బిగించాలని జిల్లా యంత్రాంగం హాస్టల్‌ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యార్థులు భవనాలపైకి ఎక్కి దూకకుండా 'సూసైడ్‌ ప్రూఫ్‌' వలలు బిగించే కార్యక్రమాన్ని అన్ని హాస్టళ్లు యుద్ధప్రాతిపదికన అమరుస్తున్నాయి. 'భవనాల వెలుపల, బాల్కనీల్లోనూ పెద్ద పెద్ద వలలు బిగించాం. ఇవి 150 కేజీల బరువులను సైతం మోయగలవు. ఎవరైనా విద్యార్థి భవనంపై నుంచి దూకినా ఈ వలలో పడతారు. గాయాలు కావు' అని అమ్మాయిల హాస్టల్‌ నిర్వహిస్తున్న వినోద్‌ గౌతమ్‌ వివరించారు. 'ఫ్యాన్‌లకు స్ప్రింగ్‌లు, భవనాలకు వలల కారణంగా విద్యార్థుల ఆత్మహత్యలను దాదాపు అడ్డుకోవచ్చు. విద్యార్థులను హాస్టల్స్‌లో విడిచి వెళుతున్న తల్లిదండ్రులు ఆందోళనతో ఉంటారు. ఇలాంటి నివారణ చర్యల కారణంగా తల్లిదండ్రుల్లో ధైర్యం కాస్తంత ఎక్కువ అవుతుంది' అని గౌతమ్‌ అభిప్రాయపడ్డారు. 'ఇలాంటి చర్యలు తాత్కాలికంగా ఆత్మహత్యలను నిరోధించగలవేమో. కానీ విద్యార్థులపై చదువుల ఒత్తిడిని తగ్గించాలి. అదే అసలైన పరిష్కారం' అని కొందరు మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మహిళా సాధికారతకు చంద్రయాన్‌–3 చిహ్నం

మహిళా శక్తి తోడుంటే అసాధ్యాలను సుసాధ్యం చేయొచ్చు
మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఎటువంటి పరిస్థితుల్లోనైనా విజయం సాధించే నవ భారత స్ఫూర్తికి చంద్రయాన్‌–3 మిషన్‌ ఒక ప్రతీక అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా సాధికారతకు ఈ కార్యక్రమం సజీవ ఉదాహరణ అని కొనియాడారు. ప్రతీ నెల చివరి ఆదివారం ఆకాశవాణిలో నిర్వహించే మన్‌ కీ బాత్‌ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడారు. అనంతమైన అంతరిక్షాన్ని భారతీయ మహిళలు సవాల్‌ చేస్తున్నారని అన్నారు. 'ఇండియా డాటర్స్‌ ఇంత ప్రతిష్టాత్మకంగా ఉంటే భారత్‌ అభివృద్ధిని ఎవరు అడ్డుకోగలరు' అని మోదీ వ్యాఖ్యానించారు. 'మహిళల నేతృత్వంలో జరిగే అభివృద్ధి మన దేశ స్వాభావిక లక్షణంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో అసాధ్యమైనది ఏదైనా ఉంటే మహిళా శక్తితో సుసాధ్యంగా చేయొచ్చు. చంద్రయాన్‌–3 మిషన్‌ దీనికి నిలువెత్తు ఉదాహరణ' అని చెప్పారు. చంద్రయాన్‌ మిషన్‌లో ఎందరో మహిళా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ప్రత్యక్షంగా భాగస్వాములైన విషయాన్ని ప్రధాని గుర్తుచేశారు.

అందరినీ కలుపుకొనిపోయేలా జీ20 సదస్సు

'సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగే జీ20 సదస్సు అందరినీ కలుపుకొని పోయేలా ఉంటుంది. ఈ సదస్సుకు భారత్‌ నేతృత్వం వహించడమంటే ప్రజల ఆధ్వర్యంలో జరుగుతున్నట్టే. భారత్‌ సత్తా సెప్టెంబర్‌లో అందరికీ తెలుస్తుంది. ప్రపంచ క్రీడల్లో భారత్‌ రాణించాలి. అందుకు ప్రోత్సాహం కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. దేశీయ క్రీడలైన హాకీ, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో వంటి క్రీడల్లో మనం వెనకబడకూడదు. సెప్టెంబర్‌ నుంచి దేశంలో ప్రతీ ఇంటి నుంచి, ప్రతీ గ్రామం నుంచి మట్టిని సేకరించే కార్యక్రమం జరుగుతుంది. ఆ మట్టిని అమృత కలశాల్లో భద్రపరిచి అమృత్‌ కలశ యాత్ర నిర్వహిస్తాం. ఆ మట్టితో ఢిల్లీలో అమృత వాటిక నిర్మాణం జరుగుతుంది' అని మోదీ అన్నారు.

తెలుగు కూడా ప్రాచీన భాషే

'మన సంస్కృతి సంప్రదాయాలతో మమేకం కావాలంటే మాతృభాష శక్తిమంతమైన మాధ్యమం. తెలుగు భాష సాహిత్యంలో వారసత్వ సంపదలో ఎన్నో వెలకట్టలేని రత్నాలు దాగున్నాయి' అంటూ తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని మోదీ కొనియాడారు. 'సంస్కృతం మాదిరిగా తెలుగు ప్రాచీన భాషే. ప్రతీ ఏడాది ఆగస్టు 29న తెలుగు భాష దినోత్సవం జరుపుకుంటున్నాం' అని గుర్తుచేసిన ప్రధాని మోదీ తెలుగువారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

చంద్రుడిపై ఉష్ణోగ్రతల్లో వేగంగా మార్పులు

విక్రమ్‌ పంపిన వివరాలతో వెల్లడవుతోందన్న ఇస్రో

సూళ్లూరుపేట: చంద్రయాన్‌–3 ప్రయోగం ద్వారా చంద్రుడికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర అంశాలు వెల్లడవుతున్నాయి. చంద్రయాన్‌–3 మిషన్‌లో అంతర్భాగమైన విక్రమ్‌ ల్యాండర్‌లో అమర్చిన చంద్రాస్‌ సర్ఫేస్‌ థర్మో ఫిజికల్‌ ఎక్స్‌పెరిమెంట్‌ అనే పేలోడ్‌ చంద్రుడి ఉపరితలంపై ఉష్ణ లక్షణాలను ఇస్రోకు పంపిస్తోంది. 'చంద్రుడి ఉపరితలంపై 20 లేదా 30 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు కాస్త అటూఇటూగా ఉష్ణోగ్రతలు ఉండొచ్చని అంచనా వేశాం. కానీ, ఆశ్చర్యకరంగా 70 డిగ్రీల సెంటీగ్రేడ్‌ ఉష్ణోగ్రతలు అక్కడున్నాయి. మేం ఊహించిన దానికంటే కూడా చాలా ఎక్కువ'అని ఇస్రో శాస్త్రవేత్త బీహెచ్‌ఎం దారుకేశ ఆదివారం పీటీఐకి చెప్పారు. 'అదేవిధంగా, ఈ పేలోడ్‌లో అమర్చిన కంట్రోల్డ్‌ పెన్‌ట్రేషన్‌ మెకానిజం ద్వారా ఉపరితలానికి 10 సెంటీమీటర్ల లోతు వరకు ఉష్ణోగ్రతలను సెన్సార్లతో కొలవచ్చు. ఉపరితలంపై 70 డిగ్రీల సెంటీగ్రేడ్‌ ఉష్ణోగ్రత ఉండగా కేవలం రెండు, మూడు సెంటీమీటర్ల లోతు కెళ్లే సరికి రెండు మూడు డిగ్రీల సెంటీగ్రేడ్‌ మేర ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఇంకాస్త లోతుకెళితే –10 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలున్నాయి. ఉపరితలంతో పోలిస్తే రమారమి 50 డిగ్రీలు తేడాతో ఉండటం చాలా ఆసక్తికరమైన అంశం'అని ఆయన తెలిపారు. 'కేవలం 8 సెంటీమీటర్ల లోతుకు వెళ్లగానే అది 10 డిగ్రీలకు పడిపోయింది. మరింత లోతుకు వెళితే మంచు ఆనవాళ్లు ఉన్నట్టుగా తెలుస్తోంది. తాజా పరిశోధనలను బట్టి చంద్రుడిపై ఉష్ణోగ్రతలు చాలా వేగంగా మారుతున్నట్లు స్పష్టమవుతోందని ఇస్రో పేర్కొంది. దక్షిణ ధ్రువానికి సంబంధించిన ఇలాంటి వివరాలను తెలుసుకోవడం ఇదే మొదటిసారని తెలిపింది. ఈ పేలోడ్‌ను విక్రమ్‌ సారాభాయ్‌ స్పేస్‌ సెంటర్‌లో స్పేస్‌ ఫిజిక్స్‌ లాబొరేటరీ, అహ్మదాబాద్‌లోని స్పేస్‌ అప్లికేషన్‌ సెంటర్‌ శాస్త్రవేత్తల బృందం అభివృద్ధి చేసింది.

రోవర్‌పై జాతీయ జెండా, ఇస్రో సింబల్‌

ల్యాండర్‌ నుంచి విడిపోయి రోవర్‌ చంద్రుడిపై నెమ్మదిగా అడుగులు వేస్తూ చంద్రుడిపై పరిశోధనలు ఇప్పటికే ప్రారంభించేసింది. చంద్రుడిపై రోవర్‌ దిగిన వెంటనే భారత ప్రభుత్వం మూడు సింహాలు గుర్తు, ఇస్రో సింబల్‌ను చంద్రుడిపై ముద్రించింది. జాతీయ జెండా, ఇస్రో సింబల్‌ రోవర్‌ మీదున్న ఛాయాచిత్రాన్ని ఇస్రో విడుదల చేసింది. ప్రస్తుతం ల్యాండర్‌లో అమర్చిన పేలోడ్స్, రోవర్‌లో అమర్చిన పేలోడ్స్‌ తమ పనిని చేసుకుంటూ ఇస్ట్రాక్‌ కేంద్రానికి సమాచారాన్ని అందిస్తున్నాయి.


మహిళలు మాత్రమే పనిచేసే చాక్లెట్‌ కర్మాగారంలో చాక్లెట్‌లను తయారుచేస్తున్న కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ. ఇటీవల తమిళనాడులోని ఊటీలో రాహుల్‌ పర్యటించినపుడు అక్కడి మోడీస్‌ చాక్లెట్స్‌ ఫ్యాక్టరీని సందర్శించినపుడు తీసిందీ ఫొటో. సంబంధిత వీడియోను రాహుల్‌ విడుదలచేశారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 28 । ఆగస్టు । 2023




మారథాన్‌లో పాల్గొన్న డాక్టర్ హరిహరన్ (74)

మారథాన్.. అదిరెన్

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ సహకారంతో చేపట్టిన **ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ ఉత్సాహంగా** సాగింది. నెక్లెస్‌రో**డ్డులోని పీపుల్స్ ప్లాజాలో** ప్రారం**భమైన** ఫుల్, హాఫ్ మారథాన్, **హైటెక్స్‌**లో ప్రారంభమైన **10కె** రన్‌లు గచ్చిబౌలి **జీఎంసీ** బాలయోగి స్టేడి**యంలో** ముగిశాయి. **పీపుల్స్‌ప్లాజా** వద్ద సీపీ సీవీ **ఆనంద్,** జీహెచ్ఎంసి కమిషనర్ **రోనాల్డ్ రాస్, ఐడీఎఫ్‌సీ** ఫస్ట్ బ్యాంక్ **ఎండీ వైద్యనాథ్‌లు** జెండా ఊపి ప్రారంభిం**చారు. ఈ రన్ నగరానికే** తలమానికంగా **నిలుస్తుందని సీపీ** ఆనంద్ అన్నారు. **పీపుల్స్ ప్లాజా నుంచి** 1400 మంది, హాఫ్ **మారథాన్‌లో 4 వేల** మంది, 10కె రన్‌లో **8700 మంది పాల్గొన్నారు.** ఫుల్ మారథాన్ **పురుషుల విభాగంలో** గోపి తోనకల్, తీర్థ కుమార్, స్టీఫెన్ కోస్గీ , మహిళ విభాగంలో తాంసింగ్, యామిని థాలెర్, డోర్కాస్ టారస్‌లో వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. హాఫ్ మారథాన్‌లో పురుషుల విభాగంలో రమేష్ బొడ్డిపల్లి, సుజిత్ కె, మనోజ్, మహిళ విభాగం లో ప్రీను యాదవ్, నవ్య వడ్డె, ఫహీమ్ ఫిర్దోస్‌లు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. 10కె రన్‌లో పురుషుల విభాగంలో వినీత్, రమేష్ చంద్ర రమావత్, అబ్దుల్ సలామ్, మహిళల విభాగంలో భాగ్యలక్ష్మి దొంతు, గుంజ కుమారీ, తీయన భాస్కరన్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఫుల్ మారథాన్ విజేతలకు వరుసగా రూ 2.5 లక్షలు, రూ.2లక్షలు, రూ.1.5 లక్షల నగదు, హాఫ్ మారథాన్, 10 కె విజేతలకు నగదును ఎన్ఎండీసీ డైరెక్టర్ (టెక్నికల్) వినయ్‌కుమార్ అందజేశారు. 74 ఏళ్ల డాక్టర్ హరిహరన్ మారథాన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇప్పటి వరకు ఆయన 250 మారథాన్‌లలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

– ఖైరతాబాద్/గచ్చిబౌలి



మారథాన్‌ను ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్ తదితరులు



మారథాన్ విజేతలతో ఎన్ఎండీసీ డైరెక్టర్ (టెక్నికల్) వినయ్ కుమార్

‘ప్రాణం’ పరుగెత్తుకొచ్చింది

గతంలో సాయం చేసిన పోలీసును గుర్తించిన మహిళ

- పరుగు పరుగున **వచ్చి ఏసీపీ** రవీందర్‌ను పల**కరించిన వైనం**
- మంత్రి తలసాని **బందోబస్తులో** ఉన్న ఏసీపీ ఆశ్చర్యం
- ‘సార్ వల్లే నేను **బతికి ఉన్నా..’** అంటూ మహిళ **భావోద్వేగం**



ఏసీపీ రవీందర్‌కు దండం పెడుతూ కృతజ్ఞతలు చెబుతున్న కవిత



రాంగోపాల్‌పేట్: ఆర్పీరోడ్‌లోని దర్గా ప్రాంతం..ఆదివారం ఉదయం..కొద్దిసేపట్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అక్కడ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం వస్తున్నారు. బందోబస్తులో భాగంగా మహంకాళి ఏసీపీ రవీందర్‌తో పాటు మిగతా పోలీసులు, నాయకులు అక్కడ ఉన్నారు. ఇంతలో ఓ మహిళ దూరం నుంచి పరుగెత్తుకుంటూ..ఆయాసపడుతూ వారి దగ్గరకు వచ్చింది. పోలీసులతో పాటు అందరూ ఏమైందా, అని కంగారు పడ్డారు. కానీ వచ్చీ రావడంతోనే ఆ మహిళ ఏసీపీ రవీందర్ వద్దకు వెళ్లి ‘మీకు దండం సారూ..మీ వల్లే నేను ఇప్పుడు బతికున్నా.. మీరు చేసిన సహాయం మరచిపోలేను..అప్పుడు ఆపరేషన్ చేయించడం వల్లే ప్రాణాలతో ఉన్నా అంటూ ఆయాసపడుతూ చెప్పింది. వెంటనే అక్కడున్న వాళ్లు ఆమెను కొద్దిసేపు కూర్చోబెట్టి మంచి నీళ్లు తాగించి.. ఏమైందంటూ ఆరాతీయగా...తొమ్మిదేళ్ల క్రితం అనారోగ్యంతో ఉన్న ఆమెకు ప్రస్తుత మహంకాళి ఏసీపీ రవీందర్ సొంత డబ్బుతో ఆస్పత్రిలో చేర్పించి ఆపరేషన్ చేయించిన సంగతి చెప్పింది. 2014 సంవత్సరంలో టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్‌లో రవీందర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోడ్డు పక్కన కార్వాన్‌కు చెందిన కవిత అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆస్పత్రిలో చేర్పించి సొంత ఖర్చులతో ఆపరేషన్ చేయించగా పూర్తి ఆరోగ్యంతో బయటపడింది. ఆ తర్వాత మళ్లీ ఆయన ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంతో కలవలేకపోయింది. ఆదివారం ఆమె కార్వాన్ నుంచి ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళుతుంది. బస్సులో నుంచి బందోబస్తు విధుల్లో ఉన్న ఏసీపీ రవీందర్‌ను చూసి..గుర్తించి బస్సు ఆపాలని డ్రైవర్‌ను కోరింది. కానీ డ్రైవర్ ఆపకుండా ప్యాట్నీ సిగ్నల్ **వరకు వెళ్లాడు.** సిగ్నల్ దగ్గర బస్సు **ఆగడంతో ఆమె బస్సు** దిగి పరుగెత్తుకుంటూ **దర్గా వరకు వచ్చింది.** వచ్చీ రావడంతో **ఆయనకు దండాలు** పెడుతూ కన్నీరు పెట్టిం**ది. మీ వల్లే ఈ రోజు** ప్రాణాలతో ఉన్నా **సారు, మీ రుణం ఈ** జన్మలో తీర్చుకోలేను. మీరు కలుస్తారో లేదో అనుకుంటూ పరుగెత్తుకొచ్చాను అంటూ చెప్పుకొచ్చింది. మీరు ఇంకా పెద్ద పోస్టులోకి రావాలి, ఎమ్మెల్యే అంత ఎదగాలి సారూ అంటూ కృతజ్ఞతాభావాన్ని చాటింది. ‘నా అన్న కోసం వెండి రాఖీ కొని తీసుకుని వచ్చి కడతా’ అంటూ చెప్పింది. అంతే కాకుండా తన ఫోన్‌లో భద్రపరుచుకున్న ఏసీపీ ఫొటోను చూపించి ఆశ్చర్య పరిచింది. ఈ సంఘటన చూసిన పోలీసులు, మీడియా ప్రతినిధులు, నాయకులు అందరూ ఆ మహిళ కృతజ్ఞతాభావాన్ని, ఏసీపీ మానవతా దృక్పథాన్ని అభినందించారు.

న్యూస్‌రీల్

చెస్ ఆడుతూ సీనియర్ క్రీడాకారుడి మృతి



వెంగళరావునగర్: చెస్ ఆడుతూ సీనియర్ క్రీడాకారుడు మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్ర, శని, ఆదివారాల్లో స్లాన్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలకు దాదాపు 15 రాష్ట్రాలకు చెందిన 700 మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. కాగా శనివారం మధ్యాహ్నం అంబర్‌పేట, 6వ నెంబర్ సర్కిల్ సాయిమిత్ర ఎస్టేట్స్‌లో నివాసం ఉంటున్న సీనియర్ చెస్ క్రీడాకారులు వి.ఎస్.టి.సాయి (72) కూడా క్రీడను కొనసాగిస్తున్నారు. ఐదవ రౌండ్‌లో ఉండగా ఒక్కసారిగా గుండెలో నొప్పి వచ్చి పడిపోయాడు. హుటాహుటిన స్లాన్ సంస్థ సిబ్బంది, ఆడిటోరియం సెక్యూరిటీ అంబులెన్స్‌ను పిలిపించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే సాయి మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. ఈయనకు భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. ఎల్ఐసీలో అధికారిగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. చెస్ అంటే ప్రాణంగా భావించేవారు. ఎక్కడ టోర్నీలు జరిగినా తప్పకుండా హాజరయ్యేవారని చెస్ క్రీడాకారులు తెలియజేశారు. నగరానికి చెందిన పలువురు సీనియర్ చెస్ ప్లేయర్లు ఆయన మృతి పట్ల సంతాపాన్ని తెలియజేశారు.

పాతబస్తీ మెట్రో మార్గంపై

డ్రోన్ సర్వే

మసీదులు, ఆలయాలు తదితర ఆధ్యాత్మిక స్థలాల పరిరక్షణకు చర్యలు

- 103 చోట్ల ఎలాంటి విఘాతం కలగకుండా మెట్రో నిర్మాణం
- త్వరలో భూసార పరీక్షలు ప్రారంభం
- హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో పనులను హైదరాబాద్ మెట్రో రైల్ వేగవంతం చేసింది. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల మార్గంలోని ఆధ్యాత్మిక స్థలాల పరిరక్షణ కోసం ఆదివారం డ్రోన్ సర్వే చేపట్టింది. మెట్రో అలైన్‌మెంట్‌లో భాగంగా పలు చోట్ల రోడ్డు విస్తరణ చేపట్టవలసి ఉంటుంది. ఈ క్రమంలో మసీదులు, ఆలయాలు, తదితర కట్టడాలకు ఎలాంటి విఘాతం కలగకుండా పిల్లర్స్ నిర్మించేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ అధికారులు సాధారణ సర్వేతో పాటు, ఈ డ్రోన్ సర్వేను ప్రారంభించారు. డ్రోన్ నుంచి సేకరించిన హై రెజల్యూషన్ చిత్రాలు, రియల్ టైమ్ డేటా, 3డీ మోడలింగ్, జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ ద్వారా ఆయా కట్టడాల కొలతలను కచ్చితంగా అంచనా వేయనున్నారు. దారుల్‌షిఫా జంక్షన్ నుంచి షాలిబండ జంక్షన్ వరకు ఉన్న 103 కట్టడాల పరిరక్షణ కోసం ఈ డ్రోన్ సర్వే దోహదం చేయనుందని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు నిర్మించనున్న 5.5 కిలోమీటర్ల మెట్రో అలైన్‌మెంట్ ఇంజనీరింగ్ రిఫైన్‌మెంట్ పనులు కొనసాగుతున్నాయని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఈ మార్గంలో మొత్తం 21 మసీదులు, 12 దేవాలయాలు, 12 అషూర్ఖానాలు, 33 దర్గాలు, 7 శ్మశానవాటికలు మరో 6 చిల్లాలతో సహా మొత్తం 103 మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలు ఉన్నాయి. కర్వేచర్ సర్దుబాటు, వయాడక్ట్ డిజైన్,ఎత్తులు, మెట్రో పిల్లర్ లొకేషన్‌లలో తగిన మార్పులు,తదితర ఇంజనీరింగ్ పరిష్కారాల కోసం డ్రోన్ సర్వే ద్వారా సేకరించిన డేటా ఉపయోగపడనుంది. మతపరమైన/సున్నితమైన నిర్మాణాలను కాపాడేందుకు రోడ్డు విస్తరణను కూడా 80 అడుగులకే పరిమితం చేయనున్నారు.నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో మొదటి ఫేజ్ ప్రాజెక్ట్ నుంచి పాఠాలు నేర్చుకోవడం ద్వారా స్టేషన్ స్థానాల్లో మాత్రం రహదారిని 120 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారు.

త్వరలో భూసామర్థ్య పరీక్షలు....

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్ల పాతబస్తీ మెట్రో మార్గంలో త్వరలో భూసామర్థ్య పరీక్షలు ప్రారంభించనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఫలక్‌నుమా నుంచి ఈ పరీక్షలను ప్రారంభించనున్నారు. నిజానికి జేబీఎస్ నుంచి పాతబస్తీలోని ఫలక్‌నుమా వరకు 2012లోనే మెట్రో రైల్ ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. కానీ పాతబస్తీలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ ప్రాజెక్టును ఎంజీబీఎస్ వరకు పరిమితం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కొద్ది రోజుల క్రితం పాతబస్తీ మెట్రోకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో హైదరాబాద్ మెట్రో రైల్ ఈ మార్గంలో పనులను ప్రారంభించింది. ఫలక్‌నుమా వరకు మెట్రో రైలు అందుబాటులోకి వస్తే నగరవాసులు జేబీఎస్ నుంచి నేరుగా ఫలక్‌నుమా వరకు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే నాలుగు వందల ఏళ్ల నాటి చారిత్రాత్మక చార్మినార్ కట్టడాన్ని మెట్రో రైల్‌లో వెళ్లి సందర్శించుకోవచ్చు. సాలార్‌జంగ్ మ్యూజియం, ఫలక్‌నుమా ప్యాలెస్ వంటి చారిత్రక కట్టడాలను సందర్శించవచ్చు. నిత్యం వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయే పాతబస్తీలో మెట్రో అందుబాటులోకి రావడం వల్ల ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుంది. మరోవైపు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చారిత్రక ప్రదేశాలను సందర్శించవచ్చు.

ఐదు స్టేషన్‌లు...

ప్రస్తుతం జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మెట్రో రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. అక్కడి నుంచి దారుషిఫా జంక్షన్, పురానీ హవేలీ, ఇత్తెబార్ చౌక్, అలీజాకోట్ల, మీర్ మోమిన్ దర్గా, హరిబౌలి, శాలిబండ, షంషీర్‌గంజ్, అలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా వరకు ఈ 5.5 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ఉంటుంది. ఈ మెట్రో రైల్ మార్గంలో 5 స్టేషన్లు రానున్నాయి.ఎంజీబీఎస్ తర్వాత సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా స్టేషన్‌లు ఉంటాయి. సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ స్టేషన్‌లకు మధ్య 500 మీటర్ల దూరమే ఉన్నప్పటికీ, ఈ రెండు స్టేషన్‌లకు నగరంలో ఉన్న చారిత్రక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని వాటికి ఆ పేర్లు పెట్టినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

‘సాయం’ అందేనా..!

- మొక్కుబడిగా మొదటి విడత..
- రెండో విడతపై గంపెడాశలు
- లక్షల్లో దరఖాస్తులు... విచారణ అంతంతే
- ‘ఎంపిక’ అంతా ఎమ్మెల్యేల చేతుల్లోనే
- దరఖాస్తుదారులపై ఎన్నికల గాలం వేసే యత్నాలు..
- గ్రేటర్‌లో దళిత, బీసీ, మైనార్టీ బంధు, గృహలక్ష్మి, డబుల్ రూమ్ ఇళ్ల పంపిణీ తీరిదీ..



సాక్షి, సిటీబ్యూరో: వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు అందిస్తున్న వంద శాతం సబ్సిడీతో కూడిన ‘ఆర్థిక చేయూత’ నిరుపేదలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇప్పటికే మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాగా, రెండో విడతపై గంపెడాశలతో నిరుపేదలు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఒక వైపు కలెక్టరేట్, మరోవైపు స్థానిక ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీసులకు క్యూ కడుతున్నారు. గత పక్షం రోజులుగా నిరుపేదలకు కంటి నిండ కునుకు కరువైంది. ఎక్కడ నలుగురు గుమిగూడినా ఆర్థిక సాయం చర్చనే కొనసాగుతోంది. వాస్తవంగా గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాల్లో దళిత, బీసీ, మైనారిటీ బంధు పథకాల కింద వేలల్లో దరఖాస్తులు రాగా, మొదటి విడతలో వందల్లో మాత్రమే ఆర్థిక చేయూత అందించారు. అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిస్థితి కూడా ఇదే విధంగా తయారైంది. ఆరోగ్య లక్ష్మి కింద కూడా భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇంకా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

స్థానిక ఎమ్మెల్యేలే కీలకం

ప్రభుత్వ పథకాల ఆర్థిక చేయూతకు లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యేలే కీలకంగా మారారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నా..ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేనిదే లబ్ధిదారుడిగా ఎంపికయ్యే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికే దళిత బంధు కింద మొదటి విడతగా లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ పూర్తి కాగా, రెండో విడత కోసం జాబితా సిద్ధమవుతోంది. బీసీ, మైనార్టీ బంధు మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక ప్రజాప్రతినిధుల సిఫార్సు మేరకు జరిగిందనేది బహిరంగ రహస్యమే. అదే విధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయింది. ఇక మిగతా విడతల లబ్ధిదారుల ఎంపికల్లో కూడా ఎమ్మెల్యేల సిఫార్సులే కీలకం. దానితో వారి అనుచరగణం దరఖాస్తుదారులకు గాలం వేస్తూ.. కమీషన్ మాట్లాడుకునే పనిలో పడినట్లు తెలుస్తోంది.

ఇప్పటి వరకు ఇలా..

- గ్రేటర్ మొత్తం మీద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం మొదటి విడత కింద సుమారు 12 వేల మంది లబ్ధిదారులు ఎంపికచేశారు. వాస్తవంగా సుమారు 7.19 లక్షలపైగా దరఖాస్తులు రాగా, అందులో కొన్ని దరఖాస్తులపైనే విచారణ జరిపి అర్హుల్లో మొదటి విడత ప్రక్రియ పూర్తి చేశారు. మిగితా వారికి కూడా దశల వారిగా ఎంపిక చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.
- దళిత బంధు కింద నియోజకవర్గానికి మొదటి విడతగా 100 మంది చొప్పున ఆర్థిక సాయం అందించగా, తాజాగా రెండో విడతలో 1100 మంది చొప్పున లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు సాగుతోంది.
- బీసీ బంధు కింద హైదరాబాద్‌లో 20,724, రంగారెడ్డిలో 31 వేలు, మేడ్చల్-మల్కాజిగిరిలో 22,087 చొప్పున దరఖాస్తులు రాగా, మొదటి విడత కింద నియోజవర్గానికి 300 మంది చొప్పున ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా మైనారిటీ బంధుం కింద 3.508 మంది లక్ష చొప్పున చెక్కులు అందించారు.
- గృహలక్ష్మి కింద హైదరాబాద్‌లో 4,452, రంగారెడ్డి 29,600, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 14,025 మంది దరఖాస్తు చేసుకోగా..ఇంకా దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ ప్రారంభం కాలేదు.

చేస్తున్న పనులు చెప్పాల్సిందే..

- సోషల్ మీడియాలో బల్దియా పనుల వివరాలు
- ఫొటోలతో పోస్ట్ చేస్తున్న అధికారులు
- చేసేది తక్కువ.. ప్రచారమెక్కువంటున్న ప్రజలు



సాక్షి, సిటీబ్యూరో: ట్రెండ్ మారింది. చేతిలో సెల్‌ఫోన్.. సోషల్ మీడియా వీక్షణం ఎక్కువైపోయింది. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో తమ పర్యటనలు, చేస్తున్న పనుల వంటివి ఫొటోలతో సహా పోస్ట్ చేస్తున్నారు. మరోవైపు, తాము చేస్తున్న పనుల గురించి సంబంధిత ఉన్నతాధికారులు, మేయర్‌ల నుంచి మునిసిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మంత్రి కేటీఆర్ దాకా ట్యాగ్ చేస్తున్నారు. తద్వారా తాము క్షేత్రస్థాయిలో చేస్తున్న పనుల గురించి వారికి తెలుస్తుందని భావిస్తున్నారు. ముఖ్యంగా పారిశుధ్య కార్మికులకు తగిన సూచనలిస్తుండటం..రోడ్ల పనులు.. క్షేత్రస్థాయిలో తనిఖీల వంటివి ఎక్కువగా పోస్ట్ చేస్తున్నారు. ఇందులోనూ కొందరు జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ముందంజలో ఉన్నారు.

సాధారణ ఫిర్యాదుల సంగతేంటి?

ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ, సాధారణ ప్రజల ఫిర్యాదులు వినడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ట్విట్టర్ వంటి వాటి ద్వారా అందే ఫిర్యాదులకు మాత్రం స్పందిస్తూ, వాటినే గొప్పగా చూపించుకుంటున్నారని సామాన్య ప్రజలు విమర్శిస్తున్నారు. వాటికి ప్రతిస్పందించకుంటే ఎన్ని రోజులుగా పెండింగ్‌లో ఉందో పైస్థాయిలోని వారికి తెలుస్తుందనే ఆ పనులు చేస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు కొందరు నేరుగా మేయర్‌కే ఫిర్యాదు చేస్తున్నారు. అలాగైనా తమ సమస్యలు పరిష్కారం కాగలవని భావిస్తున్నారు. ముఖ్యంగా వీధిదీపాలు, చెత్త సమస్యల వంటివి వీటిల్లో ఎక్కువగా ఉంటున్నాయి. ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తే తప్ప పట్టించుకోరా? అని సోషల్ మీడియా అకౌంట్లు లేనివారు ప్రశ్నిస్తున్నారు.

సూచనలు సైతం..

బహిరంగ ఖాళీ ప్రదేశాల్లో చెత్త, ఇతరత్రా వ్యర్థాలు వేయవద్దంటూ ప్రజలకు చేసే సూచనలు, విజ్ఞప్తులు సైతం కొందరు అధికారులు ట్విట్టర్ ద్వారానే చేస్తున్నారు. వాటి గురించి సోషల్ మీడియాతో పాటు సామాన్యులకు కూడా తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించవచ్చు కదా అని ఆయా ప్రాంతాల్లోని స్థానికులు అంటున్నారు.

కార్పొరేటర్లు కూడా..

కొందరు కార్పొరేటర్లు సైతం ఆయా సమస్యల్ని సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఇంకొందరు చర్చావేదికల వంటివి సైతం నిర్వహిస్తూ సదరు వీడియోలను వాట్సప్ ద్వారా షేర్ చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు గుప్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తాము చేస్తున్న పనులను తెలియజేస్తుండటంతోపాటు ప్రతిపక్షాలను విమర్శించేందుకు సైతం సోషల్ మీడియాను వినియోగిస్తున్నారు. కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు చేయడం కంటే పోస్టులు పెట్టడంపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారనే ఆరోపణలుసైతం ఉన్నాయి.

‘నానీల తీరాన’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్.గోపి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి ఎస్.లహరి రచించిన ‘నానీల తీరాన..’ పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. గోపీ మొదట పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ..కవిత్వం చరిత్రలో నానీలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. రచయిత కవితలను ఎంతో అద్భుతంగా రాశారని, రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కవయిత్రి ఎస్.లహరి మాట్లాడుతూ నానీల తీరాన పుస్తకాన్ని తమ తల్లిదండ్రులైన వెంకటేశం, మమతలకు అంకితమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, నేటి నిజం సంపాదకులు బైసా దేవదాస్, కవి వెన్నెల సత్యం, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రి ఏర్పాట్లపై నేడు సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: వచ్చే నెల 19 వ తేదీ నుండి 28వ తేదీ వరకు నిర్వహించే గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సోమవారం ఉదయం 11 గంటలకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఉన్నతస్థాయి సమావేశం జరుగనుంది. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు నగరానికి చెందిన మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొంటారు. సమావేశానికి బాలాపూర్, ఖైరతాబాద్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, సికింద్రాబాద్ గణేష్ ఉత్సవ సమితితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గణేష్ మండపాల నిర్వహకులను కూడా ఆహ్వానిస్తూ అధికారులు లేఖలు పంపించారు. విగ్రహాల ప్రతిష్ఠ నుండి నిమజ్జనం వరకు ఎక్కడా ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా శాంతిభద్రతల నిర్వహణ, శోభాయాత్ర, వివిధ ఏర్పాట్లపై సమావేశంలో చర్చిస్తారు.



ఓనం సందడి

బోయిన్‌పల్లిలోని ఎంఎంఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఓనం వేడుకలు సందడిగా సాగాయి. సంప్రదాయ నృత్యాలు.. రంగురంగుల రంగవల్లులు ఆకట్టుకున్నాయి. నగరంలో నివసిస్తున్న కేరళీయులు పలువురు పాల్గొన్నారు.




సందడిగా ఓనం వేడుకలు

కంటోన్మెంట్: నాయర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లిలోని ఎంఎంఆర్‌లో నిర్వహించిన ఓనం వేడుకలు సందడిగా సాగాయి. సంప్రదాయ నృత్యాలు, ముగ్గులు, బలి చక్రవర్తి, వామనుడు తదితర వేషధారణలతో ప్రదర్శనలు అలరించాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కేరళీయులు సంఘటితంగా ఏటా ఓనం వేడుకలు జరుపుకోవడం అభినందనీయమని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేరళకు చెందిన శ్రీజిత్ ఫణికర్ అన్నారు. వేడుకల్లో సొసైటీ అధ్యక్షుడు అప్పుకుట్టన్ నాయర్, సురేశ్ కుమార్, అనిల్ కుమార్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఓనం ఉత్సవాలు అభినందనీయం


కేరళమంత్రి రాధాకృష్ణన్‌ను సత్కరిస్తున్న బండారి లక్ష్మారెడ్డి..

కుషాయిగూడ: కేరళ సంప్రదాయ ఉత్సవం ఓనం పండుగను తెలంగాణలో ఘనంగా నిర్వహించడం గర్వంగా ఉందని కేరళ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి రాధాకృష్ణన్ అన్నారు. చర్లపల్లి సిరి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఓనం ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ఓనం పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కేరళ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సమష్టిగా ఓనం వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి కేరళీయులకు ఓనం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేరళ మంత్రిని ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, వంశరాజ్ మల్లేష్, చక్రపాణిగౌడ్, బొడిగె రాజు, మహేష్‌తో పాటుగా నిర్వాహకులు పాల్గొన్నారు.

మిస్టర్ స్పోర్టెక్స్ క్లాసిక్ ఇండియా విజేతగా రాహుల్..

టైటిల్ విజేతకు రూ. లక్ష నగదు బహుమతి



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా భాగ్యనగర్ బాడీబిల్డింగ్ అసోసియేషన్, హైటెక్స్ సంయుక్త ఆధ్వర్యంలో మిస్టర్ స్పోర్టెక్స్ క్లాసిక్ ఇండియా 2023 పోటీలను నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో మిస్టర్ స్పోర్టెక్స్ క్లాసిక్ ఇండియా టైటిల్‌ను తెలంగాణకు చెందిన రాహుల్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా బీబీఏ ప్రెసిడెంట్ కె సంపత్ రెడ్డి మాట్లాడుతూ.. పురుషుల ఫిజిక్, బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ విభాగాల్లో పోటీలు జరిగాయని తెలిపారు. టైటిల్ విజేతకు రూ. లక్ష నగదు బహుమతి, మొత్తం టోర్నీ పేరిట రూ.6 లక్షల నగదు అవార్డులు అందుకుంటారన్నారు. 55 కిలోలు, 55–60 కిలోలు, 60–65 కిలోలు, 65–70 కిలోలు 70–75 కిలోలు, 75–80 కిలోలు, 80–85 తదితర విభాగాల్లో బాడీబిల్డింగ్ పోటీలు, 85 కిలోల పైన పురుషుల ఫిజిక్ పోటీలు 170 సెంటీమీటర్ల లోపు, 170 సెంటీమీటర్ల పైన తదితర విభాగాల్లో నిర్వహించామన్నారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్ కూడా కలదు
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

యువకుడిని బెదిరించి.. సెల్‌ఫోన్ లాక్కెళ్లి...

బంజారాహిల్స్: బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చిన ఓ యువకుడిని దారికాచి బెదిరించి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... వికారాబాద్ జిల్లా, తాండూరు సమీపంలోని ఇందూర్ గ్రామానికి చెందిన నరేష్ ఉద్యోగాన్వేషణలో భాగంగా ఈ నెల 25న నగరానికి వచ్చాడు. బంజారాహిల్స్ రోడ్ నెం. 1లో ఓ ఇంటర్వ్యూకు హాజరై సమీపంలోని వెంగల్‌రావు పార్కు ఫుట్‌పాత్‌పై నిల్చున్నాడు. అదే సమయంలో బైక్‌పై అక్కడికి వచ్చిన ముగ్గురు యువకులు నరేష్ జేబులను గాలించి, డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పగా అతడిపై దాడి చేసి జేబులో ఉన్న లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు శనివారం రాత్రి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

కేటుగాళ్లతో ఖాకీల సెటిల్‌మెంట్లు

> సాక్షి, సిటీబ్యూరో: 'కొన్ని నెలల క్రితం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఓ ఐటీ ఉద్యోగిని సైబర్ నేరస్తుల వలలో చిక్కి... రూ.లక్షల్లో మోసపోయింది. దీంతో ఆమె సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసింది. తాజాగా సదరు బాధితురాలు ఠాణాకు వచ్చి తాను మోసపోయిన సొమ్ము తిరిగి ఖాతాలో జమైందని, కేసు ఉపసంహరించుకుంటానని పోలీసులకు తెలిపింది. దీంతో పోలీసులే దగ్గరుండి మరీ లోక్ అదాలత్‌లో రాజీ కుదిర్చారు.'



- అరెస్టు చేయకుండా బాధితుల సొమ్ము రీఫండ్
- ఆపైన లోక్ అదాలత్‌లో కేసులు రాజీ
- ప్రతిఫలంగా నిందితుల నుంచి డబ్బు వసూలు
- రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తు తీరిదీ
- ఉన్నతాధికారుల దృష్టికొచ్చినా పట్టించుకోని వైనం

.. అదేంటి? కొట్టేసిన సొమ్మును సైబర్ నేరస్తులు తిరిగి రీ ఫండ్ చేయడమేంటని ఆశ్చర్యపోతున్నారా? అక్కడే ఉంది అసలు మ్యాజిక్కు!! 'రీ ఫండ్' తెర వెనక అసలేం జరిగిందంటే..

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు... సాంకేతిక ఆధారాలతో సైబర్ నేరస్తుల ఏ బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ అయ్యిందో గుర్తించారు. నిందితుడు ఢిల్లీలో ఉన్నట్లు నిర్ధారించుకుని, అక్కడికి వెళ్లి 2–3 రోజులు గాలించి నేరస్తుడిని పట్టుకున్నారు. బాధితురాలి నుంచి కొట్టేసిన సొమ్మును రీ ఫండ్ చేస్తే వదిలేస్తామని నిందితుడితో సెటిల్‌మెంట్ చేశారు. దీంతో కేటుగాడు బాధితురాలి ఖాతాకు నగదును బదిలీ చేశాడు. అరెస్టు, కేసులు లేకుండా చేసినందుకు నిందితుడి నుంచి సదరు పోలీసులు డబ్బు వసూలు చేశారు. హైదరాబాద్ తిరిగి వచ్చిన తర్వాత బాధితురాలికి న్యాయం జరిగిందనే కోణంలో లోక్ అదాలత్‌లో రాజీ కుదిర్చి, కేసును విత్‌డ్రా చేయించారు.

'లెక్క' చెప్తేనే దర్యాప్తు..

సాధారణంగా కేసు నమోదు, రిమాండ్ రిపోర్టు, చార్జ్‌షీట్ దాఖలు వంటి అధికారం సివిల్ పోలీసులకు ఉంటుంది. కానీ, రాచకొండ సైబర్ క్రైమ్‌లో మాత్రం ఇతర విభాగానికి చెందిన పోలీసులదే హవా. ఏ కేసు నమోదు చేయాలి, దర్యాప్తు చేయాలనే నిర్ణయం కూడా వీళ్లదే అంటే అతిశయోక్తి కాదు. ఇతర రాష్ట్రాల్లో దాక్కున్న సైబర్ నేరస్తులను పట్టుకొచ్చేందుకూ సివిల్ పోలీసులు కాకుండా వీరే వెళ్లడం, సెటిల్‌మెంట్లు చేయడం పరిపాటిగా మారింది. మోసపోయామని ఠాణా మెట్లు ఎక్కే బాధితులతోనూ 'లెక్క' మాట్లాడుకున్న తర్వాతే కేసు దర్యాప్తు ముందుకు సాగుతుందని, లేకపోతే నిందితులు దొరకడం లేదని 2–3 నెలల తర్వాత కేసులను క్లోజ్ చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏఆర్ టీంను రిటర్న్ చేయాలని నిర్ణయించాం

– అనురాధ, డీసీపీ, రాచకొండ సైబర్ క్రైమ్



ప్రస్తుతం రాచకొండ సైబర్ క్రైమ్‌లో నాతో సహా ఇద్దరు ఏసీపీలు కూడా కొత్తగా వచ్చారు. వారు సైబర్ క్రైమ్‌ల దర్యాప్తు, ఇతరత్రా అంశాలపై సాంకేతికంగా పట్టు సాధించాల్సి ఉంది. ఆ తర్వాత ప్రస్తుతం ఉన్న ఏఆర్ టీంను వెనక్కి పంపించాలని నిర్ణయించాం. కొన్ని సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితురాలికి తెలియకుండా వారి కుటుంబ సభ్యులే సైబర్ మోసం చేసినట్లు దర్యాప్తులో గుర్తించాం. ఇలాంటి కేసులలో బాధితుల విజ్ఞప్తి మేరకు విత్‌డ్రా చేస్తున్నాం.

ఏళ్లుగా ఒక్కచోటే తిష్ట..

సాధారణంగా పోలీసు విభాగంలో దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేసే వారికి స్థానచలనం ఉంటుంది. అయితే సైబర్ క్రైమ్‌లో మాత్రం ఐదేళ్లకు మించి కానిస్టేబుళ్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవటం గమనార్హం. ఐదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లను ఇటీవల వేరే స్టేషన్‌కు బదిలీ చేశారు అయితే కనీసం రిలీవ్ ఆర్డర్ కూడా చేతికి అందకముందే 'పెద్దల' అండదండలతో మళ్లీ అక్కడే పోస్టింగ్ తెచ్చుకోవటం వీరికే చెల్లింది.

ముగిసిన 'కామధేను ఎస్టేట్స్ భారత్ షా బ్యాడ్మింటన్ లీగ్'..

బిగినర్స్, ఇంటర్మీడియట్, ప్రోస్ విభాగాల్లోని విజేతలకు ట్రోఫీల అందజేత



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచంలోనే అతి పెద్ద రిఫరల్ నెట్‌వర్కింగ్ సంస్థ బీఎన్ఐ కామధేను రియల్ ఎస్టేట్స్ భారత్ షా బ్యాడ్మింటన్ లీగ్' రెండో ఎడిషన్ మాదాపూర్‌లోని గేమ్ పాయింట్‌లో ఆదివారం ముగిసింది. డబుల్స్ ఆడే ఈ టోర్నమెంట్ త్రీ పవర్ ప్యాక్ కేటగిరీలుగా విభజించారు. బిగినర్స్, సీజన్డ్ ప్లేయర్స్ కోసం 'ఇంటర్మీడియట్', 'ప్రోస్' ఉన్నాయి. రెండు రోజులుగా మూడు విభాగాల్లో 80 పైగా జట్లు ట్రోఫీల కోసం పోటీపడ్డాయి. బిగినర్స్ విభాగంలో శ్రీనివాస్ బొశెట్టి, పింటు కలా, ఇంటర్మీడియట్ విభాగంలో అశోక్ చౌదరి, జీ మల్లా రెడ్డి విజేతలుగా నిలిచారు. ప్రోస్ విభాగంలో హర్ష సుంకర, నాగార్జున ఛాంపియన్‌లుగా నిలిచారు.

మీరే చూసుకోండి..

- చక్రి విద్యానికేతన్ పోలింగ్ స్టేషన్‌కు తాళం
- బీఎల్‌ఓల నిర్లక్ష్యంతో నీరుగారుతున్న లక్ష్యం
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ


వరండాలో వదిలి వెళ్లిన ఓటరులిస్టు..


ఓటరు నమోదు కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

కుషాయిగూడ: ఓటర్ వెరిఫికేషన్ కోసం ఎలక్షన్ కమిషన్ అధికారులు రెండు రోజుల ప్రత్యేక క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం చర్లపల్లి డివిజన్ శ్రీ చక్రివిద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ వద్ద మధ్యాహ్నం తరువాత బీఎల్‌ఓలు ఎవరూ అందుబాటులో లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓటరు లిస్టును వరండాలోని ఓ బెంచ్‌పై వది లి కేంద్రానికి తాళం వేసుకుని వెళ్లినట్లు తెలిపారు. సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలని ఎలక్షన్ కమిషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా బీఎల్‌ఓలు అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసి ఓటరు కేంద్రానికి తాళం వేయడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టించుకోక పోవడంతో ఓటరు లిస్టు సవరణ కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం నీరుగారి పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

COMMERCIAL

Financial Dist 25,000 Sft Leased Space For Sale 6% Return A Grade Building Fully Furnished Must See! Loan Available Value for Money. Call : 9966557533. [H-788576]

LAND FOR SALE

Rs. 6 వేలు గజం 400 గజాల ప్లాటు అమ్మబడును @ మన్‌సాన్‌పల్లి క్రాస్ రోడ్‌కు & ఇండ్లకు దగ్గర ఔటర్ రింగ్‌రోడ్ నుండి 10ని॥లు DTCP ఫైనల్ అప్రూవల్. ఫోన్ : 9966521191. [H-788351]

VILLAS FOR SALE

New-age design premium Villas for Sale in Raviryala for just Rs. 1.80 Crores. Contact : +91 7353585358 Sark Projects [HA-94703]

Services

శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788622]

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788740]

తెలంగాణ గోల్డ్ బయ్యర్స్: తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని విడిపించాలనుకుంటున్నారా? మీ బంగారాన్ని అమ్మాలనుకుంటున్నారా? తక్షణమే నగదు. సంప్ర: ఫోన్ : 9000030022 [H-788405]

బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థ లలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్. సంప్ర॥ ✆ 99481 66555 [B-1193230]

BUSINESS OFFER

అర్జెంట్ రన్నింగ్‌లో ఉన్న బిజినెస్ కోసం జెన్యూన్ ఇన్వెస్ట్‌మెంట్ పార్ట్‌నర్ కావలెను. సంప్ర: 9603232008 [H-189474]

Sipra కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

Small Investment Big Profit ! in Real Estate Venture. Assured Returns in Short Term. Interested Call : 8309610166. [HA-11745]

FOR SALE

రన్నింగ్‌లో ఉన్న టెంట్ హౌస్ అమ్మకమునకు కలదు సంప్రదించండి. ఫోన్ : 9014094488. [HA-10948]

PERSONAL CARE

LOST

I, Syed Fazil S/o. Syed Baqar R/o. 19-3-704, Gazibanda, Bhakshigunj, Hyd-500053, Lost of Original Link Documents with bearing DOC No. 632 Serial No. 630@1977. Registered at S.R.O. Doodbowli if found anyone Call: 9848458941. [H-788355]

OLD AGE HOME

వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-189473]

ఆదరణ ఓల్డేజ్ హోమ్ వృద్ధులకు బెడ్ పేషెంట్స్‌కు ఆయాలు నర్సులతో 24 గం॥లు సర్వీస్ చేయబడును సింగిల్ రూమ్స్ సదుపాయం కలదు. దయానందనగర్ మల్కాజ్‌గిరి. Ph: 9347210490 [HA-189521]

TOURS & TRAVELS

గోవా, కర్ణాటక గోకర్ణ, శృంగేరి, ధర్మస్థల, ఉడిపి, మూకాంబిక+20 క్షేత్రాలు 10 రోజులు Sep. 5న, దసరాకు Oct. 12న రామేశ్వరం, అరుణాచలం+30 క్షేత్రాలు 10 రోజులు, లక్ష్మీటూర్స్ - 9866246466 [HA-13656]

Wanted

టిఫిన్ సెంటర్ లో స్టాల్ బాయ్స్, మెయింటెన్స్ ఇంచార్జ్, స్టాల్ సూ॥వైజర్స్, క్యాషియర్ కావలెను. జీతం+భోజన వసతి కలదు. ఫోన్:9652134626, 9666934949. [H-781273]

జాబ్ గ్యారంటీ 18–50సం॥ల మహిళలు, పురుషులు అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+ భోజనం, జీతం: 25000/–వేల వరకు. ఫోన్ : 8886733005 / 008 [HA-10956]

శ్రీ సాయి హోం కేర్ 24/7 మా వద్ద వుండి మంచంమీద ఉన్న వృద్ధులకు సేవ చేయటానికి, పిల్లలను చూడటానికి పని వారు కావలెను. ఫోన్ : 9533909627, 9494071023 [H-189406]

హయత్‌నగర్ & చంపాపేట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉంటూ పనిచేయుటకు (ఫ్యామిలి) టీచర్స్, ట్యూటర్స్ కావలెను. జీతం+వసతి+ భోజనం. ఫోన్ 8790998430, 9000775299. [H-796937]

ప్రముఖ ప్రైవేట్ లిమిటెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీ హైదరాబాద్, LB నగర్ ఆఫీస్ నందు ఉద్యోగం చేయుటకు అనుభవం గల బ్రాంచ్ మేనేజర్, టీమ్ లీడ్ మేనేజర్స్, రిలేషన్‌షిప్ మేనేజర్స్ కావలెను. అర్హత : Any Degree, Age: 25-50 సం॥ వరకు సంప్ర. 90007 57776, 91005 27776. [M-10245]

Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

గొంతు కోసి బాలుడి దారుణ హత్య


రాజాపాశ్వాన్(ఫైల్)


రాజాపాశ్వాన్ మృతదేహం

రాజేంద్రనగర్: ఓ బాలుడిని గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. బండరాయిపై గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా గొంతు కోసి హత్య చేసి ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ గంగాధర్, క్లూస్, డాగ్ స్క్వాడ్ బృందం ఆధారాలు సేకరించారు. ఇన్‌స్పెక్టర్ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన సంజయ్ పాశ్వాన్ భార్య, కుమారుడు రాజా పాశ్వాన్(17)తో కలిసి బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. కాటేదాన్ లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉంటూ స్థానిక పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతడి కుమారుడు రాజాపాశ్వాన్ ఇదే ప్రాంతంలోని స్క్రాబ్ దుకాణంలో పని చేసేవాడు. శనివారం ఉదయం పనికి వెళ్లిన రాజా పాశ్వాన్ సాయంత్రం ఇంటికి వచ్చాడు. శనివారం కావడంతో షాప్‌కు వెళ్లి బత్తా తెచ్చుకుంటానని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. దుకాణ యజమాని వద్దకు వెళ్లి ఆరా తీయగా డబ్బులు తీసుకుని వెళ్లిపోయినట్లు చెప్పాడు. ఆదివారం ఉదయం హౌసింగ్ బోర్డు కాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో బండరాయిపై యువకుడు పడి ఉన్నట్లు గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సంజయ్‌పాశ్వాన్ మృతుడు తన కుమారుడిగా గుర్తించాడు. పంచనామా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. డాగ్ స్క్వాడ్‌తోపాటు క్లూస్ టీమ్ సంఘటనా స్థలం వద్ద ఆధారాలుసేకరించాయి. రాజా పాశ్వాన్ రెండు రోజుల క్రితం స్థానిక యువకులతో గొడవ పడినట్లు తెలిసింది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ మధు తెలిపారు. సీసీ ఫుటేజీలను సేకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉరివేసుకుని గృహిణి ఆత్మహత్య

జియాగూడ: భర్తతో గొడవపడిన ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. ఎస్ఐ వేణుగోపాల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్‌కు చెందిన సనా ఫాతిమా(27) జియాగూడ సోనా హోటల్ ప్రాంతంలో ఆర్ఎంపీ డాక్టర్‌గా పని చేస్తున్న ఆమె తల్లి జయ వద్దనే నర్సుగా పని చేస్తోంది. ఆమె భర్త జాహెద్ స్కూటీ తీసుకెళ్లేందుకు శనివారం ఆసుపత్రికి వచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం జాహెద్ పహాడీషరీఫ్‌కు వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన ఫాతిమా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి ఇంటికి వచ్చిన ఆమె భర్త జాహెద్ తలుపు కొట్టినా తెరవకపోవడంతో తలుపులు బలవంతంగా తెరిచి చూడగా సనా ఫాతిమా ఉరివేసుకుని కనిపించింది. కిందికి దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

స్థానికత అంశంపై ఏర్పడ్డ తెలంగాణలో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం


మనోవేదన సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

- ప్రొఫెసర్ కోదండరాం
- ఇందిరాపార్కు వద్ద జీఓ317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ మనోవేదన సభ

ముషీరాబాద్: హక్కులు అడ్డుక్కుంటే రావని, పోరాటాలతోనే సాధించుకోవాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం జీఓ నెంబర్ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో నాన్ స్పౌజ్ బాధితులను సొంత జిల్లాలకు కేటాయించాలని, సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఉపాధ్యాయ, ఉద్యోగుల మనోవేదన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.... జీఓ నెంబర్ 317 బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్పౌజ్, నాన్ స్పౌజ్ తేడా లేకుండా ఉద్యోగులు సంఘటితంగా హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం 5వేల పాఠశాలలను మూసివేసి నిరుపేద విద్యార్థులకు విద్యకు దూరం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్రా ఉపాధ్యాయులు వెళ్లిపోయిన నేపథ్యంలో ఎవరి సొంత జిల్లాల్లో వారికి ఉద్యోగం చేసే అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులపాత్ర కీలకమైందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు తలుచుకుంటే పాలకుల తలరాతలు మారుస్తారన్నారు. అయితే ఇటీవలి కాలంలో కొందరు ఉపాధ్యాయులు కూడా ఓటును అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, దత్తాత్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... 20 నెలలకు పైగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు 10 వేల మందికి పైగా స్థానికతను కోల్పోయి కుటుంబాలకు దూరంగా ఉంటూ మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు. ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటివరకు 30 మంది ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రతిరోజు 200 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ ఆర్థికంగా, ఆరోగ్య పరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు పృథ్వీ, టీపీఎస్ఏ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు దూడ రాజనర్సిబాబు తదితరులు పాల్గొన్నారు.

జంతువులకూ హక్కులున్నాయి

- జంతువుల సంరక్షణ కూడా మన బాధ్యతే..
- వరల్డ్ డే ఫర్ ది ఆఫ్ స్పేసిసమ్ నేపథ్యంలో వినూత్న కార్యక్రమాలు..
- హైదరాబాద్ యానిమల్ సేవ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ


ఐమాక్స్‌లో యానిమల్ సేవ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో/ఖైరతాబాద్ : ప్రపంచ అంతరిస్తున్న జాతుల దినోత్సవం సందర్భంగా ప్రసాద్ ఐమాక్స్‌లో హైదరాబాద్ యానిమల్ సేవ్ సంస్థ ఆధ్వర్యంలో స్ట్రీట్ ప్లే స్కిట్‌తో సందర్శకులను ఆలోచింపజేశారు. జంతు ప్రేమికులైన యువతీ, యువకులు ప్లకార్డులు, వీడియోలు, స్కిట్‌లు ప్రదర్శించారు. జంతువులకు, పక్షులకు కూడా హక్కులుంటాయని వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందంటూ అవగాహన కల్పిస్తున్నామని నిర్వాహకుడు ఎస్‌.కె.ఆదిత్య తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్–యాక్టర్ అభిగ్న వూతులూరు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంతు సంరక్షణపై అవగాహన పెరగాల్సిన అవసరముందని, కుక్కలు, పిల్లుల వంటి పెంపుడు జంతువుల పట్ల సామాజిక అనుబంధం పెరగాలని ఆమె సూచించారు. ఇందులో భాగంగా జంతు ప్రేమికులు కళ్లకు గంతలు కట్టుకుని జంతువులపై జరుగుతున్న నేరాలు, క్షోభలపై వీడియోలను ప్రదర్శించారు. జంతువులను ప్రేమతో దగ్గరకు తీసుకోవాలని, కుక్కలు, పిల్లులు లాంటి పెంపుడు జంతువుల మాదిరిగానే అన్ని జంతువులను ప్రేమించాలని ప్ల కార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రతినిధులు తన్వీర్ ఖానమ్ తదితరులు పాల్గొన్నారు.

జంతువులను క్షోభ పెట్టొద్దు...

హైదరాబాద్ యానిమల్ సేవ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గచ్చిబౌలి పీజేఆర్ ప్రిస్టన్ వేదికగా జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తూ., జీవ జాతుల పైన మానవ ప్రభావాన్ని తెలియజేసే అంశాలతో ఎస్ఎమ్‌డీసీ మారథాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా జంతువులపై మానవుల ఆధిక్యత, వివక్ష, వాటి హక్కులను కాలరాయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జీవ పక్షపాతం ఫలితంగా వివిధ పరిశ్రమలలో జంతువులను క్షోభకు గురి చేస్తూ, వాటి మూలాలపై జరుగుతున్న దాడిని ప్ల కార్డులతో ప్రదర్శించారు. ఈ మారథాన్‌లో నగరానికి చెందిన పలువురు జంతు ప్రేమికులు పాల్గొన్నారు.



క్లుప్తంగా...

ఆప్ జూబ్లీహిల్స్ కో కన్వీనర్‌గా మహమూద్‌అలీ



రహమత్‌నగర్: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జూబ్లీహిల్స్ నియోజక వర్గం కో కన్వీనర్‌గా లెట్‌ఆజ్ సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ మహమూద్ అలీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆప్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ దిడ్డి సుధాకర్, సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ డాక్టర్ హరికిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ... ఆప్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో విజయారెడ్డి

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన 67వ హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఇంటర్ ఖైరతాబాద్ జోన్ లెవెల్ స్కూల్ కబాడీ, ఖోఖో టోర్నమెంట్స్ 2023, 24 గేమ్స్ విజేతలకు ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. సైఫాబాద్ కాలేజీ గ్రౌండ్స్‌లో గత రెండు రోజులుగా జరిగిన పోటీల్లో విద్యార్థులు వారి ప్రతిభను కనబర్చారు. సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

వెంగళరావునగర్: నిరంతరం భక్తి శ్రద్ధలతో, అచెంచల విశ్వాసంతో దైవ కార్యాలను చేపట్టాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలియజేశారు. జవహర్‌నగర్‌లో ఉన్న శ్రీసీతారామాంజనేయ కాశీ విశ్వేశ్వర భూనీల సమేత వేంకటేశ్వర పోచమ్మ దేవాలయం నూతన కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఈ కమిటీ సభ్యులతో ఆదివారం ఎమ్మెల్యే మాగంటి ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ చైర్మన్‌గా లక్ష్మణ్, వైస్ చైర్మన్‌గా యాదగిరి, అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా నందు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, అర్జున్, అశోక్, సందీప్, హేమంత్, కోశాధికారిగా దామోదర్, సంయుక్త కార్యదర్శులుగా భాను, జీవన్, విశాల్, రాఘవేంద్ర, అరుణ్, వినోద్, ప్రవీణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజు, చక్రధర్, లక్ష్మి, సాయిలతో పాటుగా పలువురు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తథ్యం



శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు నమ్మకంతో ఉన్నారని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని, కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని, అందరినీ సంఘటితం చేసి పార్టీకి పూర్వవైభవం తెస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహెల్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర రావు, రవిగౌడ్, ఎర్ర కృష్ణకుమార్, సలీంజావీద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సౌకర్యంలేని స్టోర్‌కు నోటీసులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ప్రధాన రహదారిలో ఇటీవల మనం పేరుతో చాక్లెట్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ స్టోర్‌కు సరిపోయినంత పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలన్నీ రోడ్డుపక్కన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. ఉదయం నుంచి రాత్రిదాకా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతూ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్‌లను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నా ఉపయోగం లేకుండా పోతున్నది. దీంతో ఆదివారం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్టోర్ మేనేజర్‌కు నోటీసులు అందజేశారు. సరైన పార్కింగ్ చేసుకునేవరకు షాపును మూసివేయాలని సూచించారు.

జూదరుల అరెస్టు

శ్రీనగర్‌కాలనీ: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 14 మంది వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. రహమత్‌నగర్‌లో పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. 14 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 25,450లను స్వాధీనం చేసుకున్నారు. తదపరి దర్యాప్తు కోసం వారిని మధురానగర్ పోలీసులకు అప్పగించారు.

త్వరలో ట్రాఫిక్ సమస్యలకు చెక్



తెలంగాణ భవన్‌ను ఆనుకొని వేస్తున్న రోడ్డు

- రూ. 6 కోట్లతో అంతర్గత రహదారి నిర్మాణం
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- బంజారాహిల్స్ రోడ్ నెం. 12 అగ్రసేన్ చౌరస్తాలో తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి నుంచి తెలంగాణ భవన్‌మీదుగా కళింగ ఫంక్షన్ హాల్ అగ్రసేన్ చౌరస్తాకు వెళ్లాలంటే వాహనదారులకు నిత్యం చుక్కలు కనిపిస్తున్నాయి. ఇరుకైన ఈ రహదారిలో పెరుగుతున్న వాహనాలు స్థానికులకు ప్రత్యక్ష నరకం అంటే ఏంటో కళ్లకు కడుతున్నది. రోడ్డును విస్తరించాలని చౌరస్తాను కుదించాలని ఎన్నో ఏళ్లుగా ప్రణాళికలు రూపొందిస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు.

- ఒక వైపు తెలంగాణ భవన్, మరో వైపు జగన్నాథ టెంపుల్, దీనికి తోడు ఇరుకైన రహదారులతో బంజారాహిల్స్ రోడ్ నెం 12 నరకానికి కేరాఫ్‌గా మారింది. ఇప్పుడు ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు హెచ్‌ఆర్‌డీసీఎల్ (హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) సంస్థ తగిన ప్రణాళికలతో ముందుకొచ్చింది.
- తెలంగాణ భవన్ పక్కనే ఖాళీగా ఉన్న లోయలాంటి ప్రాంతాన్ని రోడ్డు నిర్మాణం కోసం తీసుకుంది. తెలంగాణ భవన్ పక్క నుంచి కిలో మీటర్ దూరం వరకు 12 మీటర్ల వెడల్పుతో రూ. 6 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. భవన్ పక్క నుంచి కిలోమీటర్ దూరం వెళ్లాక రోడ్ నెం. 12 ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తూ మోర్ మెడికల్స్ వద్ద ఈ రోడ్డును కలుపుతున్నారు.
- 'ఎల్ రూ. షేప్‌లో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. నిర్మాణం పూర్తయితే రోడ్ నెం. 12 ట్రాఫిక్ ఇక్కట్లు చాలా వరకు తగ్గుముఖం పట్టనున్నాయి.
- రోడ్ నెం. 12 అగ్రసేన్ చౌరస్తాలో ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు అవకాశం ఏర్పడుతుంది. మోర్ మెడికల్స్ వద్ద ఈ రోడ్డు నిర్మాణం పూర్తికాగానే స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టనున్నారు.
- ఈ పనులన్నీ పూర్తయితే రోడ్ నెం. 12 వైపు వెళ్లే కాలనీవాసులు, సింగాడికుంట ఉదయ్‌నగర్, నాయుడునగర్ తదితర బస్తీవాసులు కూడా తేలికగా గమ్యస్థానాలకు చేరుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని ఇంజినీర్లు తెలిపారు. ఇంకోమూడు వారాల్లో ఈ నిర్మాణపనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సొబగులు

సొంత నిధులతో వసతులు కల్పించిన ఎమ్మెల్యే దానం



పలకలు పంపిణీ చేస్తున్న దానం

పంజగుట్ట: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో లేవని ఆయన తీసుకొచ్చిన 62 పథకాలు రాష్ట్రంలోని మహిళామణులకు వరంలాంటివని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వేరేపార్టీ నాయకులకు ఇప్పుడు ప్రజలు గుర్తుకు వస్తారని వారు బస్తీల్లోకి రాగానే ఇన్ని సంవత్సరాలుగా ఏం చేశారని ప్రశ్నించాలని ఆయన సూచించారు. గాంధీతాతా నగర్‌లో శిథిలంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను దానం సొంత నిధులతో పూర్తిగా ఆధునీకీకరించి ఆదివారం తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో ఈ అంగన్‌వాడీ సెంటర్‌లో 52 వేల విద్యుత్ బిల్లు బకాయి ఉండగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో దానం తన సొంత నిధులతో విద్యుత్ బకాయిలు చెల్లించి, సెంటర్‌ను పూర్తిగా ఆధునీకీకరించారు. స్థానికులు టాయిలెట్స్, మంచినీటి సరఫరా కావాలని అడగగా వెంటనే రెండు రోజుల్లో పనిపూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. పైన మరో అంతస్తు కావాలని కోరగా ఎమ్మెల్యే నిధులతో త్వరలోనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, బస్తీ అధ్యక్షుడు కరుణాకర్, వెంకట్‌రెడ్డి, బాలరాజు యాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మహేందర్ బాబు, మెట్టురాజు, జహంగీర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో సత్తాచాటిన దండు మేఘన



ప్రశంసాపత్రంతో దండు మేఘన

బంజారాహిల్స్: గ్రోవింగ్ ట్రీ 22 రోలర్ స్కేటింగ్ కాంపిటీషన్-2023లో జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ స్కూల్ 5వ తరగతి చదువుతున్న దండు మేఘన వరుసగా రెండు విభాగాల్లో సత్తా చాటి పతకాలు సాధించింది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో మేఘనకు నిర్వాహకులు పతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకుడు శ్రవణ్ నేతృత్వంలో ఆయన అనుచరులు ఎమ్మెల్యే ఎమ్మెల్యే గోపీనాథ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపీనాథ్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతుండటం ఆనందగా ఉందన్నారు.

గుర్తింపు లేని సంస్థల ద్వారా విదేశాలకు వెళ్తే ఇబ్బందులే

బంజారాహిల్స్: విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు కొన్ని గుర్తింపు లేని సంస్థల ద్వారా విదేశాలకు వెళ్లి అక్కడ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్లోబల్ ట్రీ సంస్థ ఫౌండర్ శుభకర్ అలపాటి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో యూఎస్, కెనడా దేశాలకు సంబంధించిన 50కిపైగా ప్రసిద్ధిచెందిన యూనివర్సిటీల ప్రతినిధులతో ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు ప్రతి మధ్య తరగతి కుటుంబం తమ పిల్లలను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపించాలని కోరుకుంటున్నారన్నారు. అలాంటి వారు ముందు అన్ని ఆయా దేశాలు, యూనివర్సిటీలకు చెందిన అన్ని వివరాలు తెలుసుకొని, అవగాహన చేసుకొని సరైన సంస్థల ద్వారానే విదేశాలకు వెళ్లాలని సూచించారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ 'ప్రవాసీ అభియాన్'



మాట్లాడుతున్న అనంతలక్ష్మి

శ్రీనగర్‌కాలనీ: అన్నివర్గాలు, మతాలను ఏకం చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కర్ణాటక ఎంఎల్‌సీ గోపీనాథ్‌రెడ్డి అన్నారు. శ్రీనగర్‌కాలనీలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రవాసీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ మహిళా మోర్చా ప్రెసిడెంట్ గారపాటి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ ఆలయాల ట్రస్టీలు, కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పలు అంశాలపై చర్చించి పార్టీ గెలుపునకు చేయాల్సిన ప్రణాళికలపై సలహాలు, సూచనలను చేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, ఆలయాల కమిటీ ప్రతినిధులు కృష్ణమూర్తి, శివారవు, రంగయ్య, రాహుల్ దేశ్‌పాండే, మహేందర్, శ్రీనివాస్, నేతలు లంకల దీపక్‌రెడ్డి, కిలారి మనోహర్, ప్రేమ్‌కుమార్, డాక్టర్ పద్మ వీరపనేని, కుంబాల గంగరాజు, బంగారు ప్రశాంత్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో అగ్నిప్రమాదం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని బిగ్గీస్ బర్గర్ షాప్‌లో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సమయంలో పక్కనే పెట్రోల్ బంక్ ఉండటంతో అప్రమత్తమైన పోలీసులు దాన్ని మూసివేయించారు. షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఘటనలో భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకుంది.

మండల స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల పరిధిలో జరిగిన మండల స్థాయి పాఠశాలల క్రీడా టోర్నమెంట్‌లో బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని గౌరీశంకర్ కాలనీ శ్రీ సరస్వతి స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. అండర్-17 ఖోఖోలో మనీషా, భానుశ్రీ, సాక్షి, తన్నూకుమారి, అండర్-17 ఖోఖో బాలుర విభాగంలో మురళీకృష్ణ, సందీప్, కబడ్డీ బాలుర విభాగంలో అంకిత్ దాస్, సూర్య పతకాలు సాధించారు. వీరందరూ ఇంటర్ స్కూల్ జిల్లా స్థాయిలో పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ రామసుబ్బయ్య నాయుడు వీరిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

హాస్టల్‌లో ల్యాప్‌టాప్, ఐ ఫోన్ చోరీ

వెంగళరావునగర్: హాస్టల్‌లో ఉంటున్న ఓ యువకుడి ల్యాప్‌టాప్, ఐ ఫోన్ చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఏపీకి చెందిన రెడ్డి విజయ లవకుమార్ ఎల్లారెడ్డిగూడలోని లక్ష్మీగణేష్ మెన్స్ ఎగ్జిక్యూటివ్ హాస్టల్‌లో హెచ్‌ఆర్ రిక్రూటర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 24న ఓ యువకుడు అతని రూములో జాయిన్ అయ్యాడు. 26న రాత్రి యధావిధిగా పడుకున్న లవకుమార్‌కు ఉదయం లేచి చూసేసరిగా అతని వాచ్, ల్యాప్‌టాప్, ఐ ఫోన్ కనిపించలేదు. అతనితో పాటు రాత్రి నిద్రించిన యువకుడు, తనకు చెందిన బ్యాగ్, ఇతర వస్తువులు కూడా లేవు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా..

వాహనాల అక్రమ పార్కింగ్‌కు చెక్

ఫిలింనగర్: ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిమార్లు తమ సమస్య చెప్పినా పట్టించుకోకపోగా ఫలితం ఉండటం లేదని భావించిన కాలనీవాసులు తామే నడుం బిగించి చేయి చేయి కలిపి డబ్బులు పోగు చేసుకొని సమస్యకు పరిష్కారం చూయించున్నారు. ఫిలింనగర్‌లో చోటు చేసుకున్న వివరాల ఇలా ఉన్నాయి. ఫిలింనగర్ క్లబ్‌ను ఆనుకొని ఎమ్మార్సీ కాలనీ స్కూల్ వైపు వెళ్లే రోడ్డులో నిత్యం రాత్రి పూట గంజాయి బ్యాచ్ న్యూసెన్స్‌గా మారింది రోడ్డు పక్కన, ఇళ్ల పక్కన వాహనాలు పార్కింగ్ చేస్తూ గంజాయి తాగుతూ, మద్యం సేవిస్తూ నరకానికి గురి చేస్తుండటంతో ఈ రోడ్డులో ఉన్న కాలనీవాసులు ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోలేదు. రాత్రి 8 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు పదుల సంఖ్యలో యువకులు రోడ్డు పక్కన తిష్టవేసి గంజాయి తాగుతూ స్థానికంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇక లాభం లేదని ఈ రోడ్డులో ఉండే నివాసితులు డబ్బులు పోగు చేసుకొని బైక్‌లు, ఆటోలు పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ కోన్స్‌ను ఏర్పాటు చేశారు.



కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న కోన్స్

యువకుడి అదృశ్యం



రియాజ్

రహమత్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ సమాచారం మేరకు... బోరబండలో నివాసముండే శైలజకు రియాజ్‌తో రెండు సంవత్సరాల క్రితం పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం వీరిద్దరికి వివాహం జరిగింది. ఇదిలా ఉండగా భార్యతో చెప్పకుండా శనివారం బయటికి వెళ్లిన రియాజ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని తల్లిదండ్రుల బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

బీఆర్‌ఎస్ వైపే యువత

ఫిలింనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బంజారాహిల్స్ రోడ్ నెం.1 2లోని ఎన్బీటీ నగర్‌కు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్బీటీ నగర్ సీనియర్ బీఆర్‌ఎస్ నేత మహేందర్ ఆధ్వర్యంలో యువకులకు ఆయన గులాబీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నేతృత్వంలో రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తున్నదని యువత నమ్ముతోందన్నారు. యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తీసుకురావడంలో మంత్రి కేటీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బీసీలకు ఆర్థిక చేయూత, దళిత బంధు, మైనార్టీ బంధు పథకాలను యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హిమాయత్‌నగర్‌లో..

హిమాయత్‌నగర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో మైనార్టీ మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే నాగేందర్ పార్టీ కండువాలు వేశారు. దత్తా నగర్‌కు చెందిన 40 మంది మైనార్టీలు పార్టీలో చేరగా అర్హులైన వారందరూ రూ. లక్ష మైనార్టీ ఆర్థిక సహాయాన్ని అందుకోవాలన్నారు. గృహలక్ష్మి పథకంలో భాగస్వామ్యం కావాలని సూచించారు.



దానం సమక్షంలో పార్టీలో చేరిన బంజారాహిల్స్ ఎన్బీటీనగర్ యువత



పార్టీలో చేరిన దత్తా నగర్ మహిళలు

వడ్డెర భవన్‌కు ఓబన్న భవన్‌గా నామకరణం చేయాలి

రహమత్‌నగర్: ప్రభుత్వం నిర్మించబోయే వడ్డెర భవనానికి వడ్డె ఓబన్న భవన్‌గా నామకరణం చేయాలని తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి ఆదివారం స్థానిక వడ్డె ఓబన్న విగ్రహం వద్ద పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ... అనాదిగా వెనుకబాటులో ఉన్న వడ్డెర కులస్తులను గుర్తించిన సీఎం కేసీఆర్ వడ్డెర భవనం కోసం ఉప్పల్‌లో స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు కేటాయిండచం పట్ల వడ్డెర జాతి హర్షం వ్యక్తం చేస్తున్నదన్నారు. ఈ నెల 30 భూమిపూజ నిర్వహించే వడ్డెర భవన్‌కు స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న పేరుపెట్టాలని సీఎం కేసీఆర్‌ను ఆయన కోరారు. వడ్డెర ఐక్య వేదిక నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, నగర మహిళ అధ్యక్షురాలు మేఘన పద్మ, ఓర్సు మల్లయ్య, పాండు, వెంకటేశ్, నాగమ్మ,సురేష్‌లతో పాటు వివిధ డివిజన్లకు చెందిన వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుమారుడికి పునర్జన్మనిచ్చిన తల్లి

కిడ్నీ దానం చేసిన మాతృమూర్తి



బంజారాహిల్స్: అతి చిన్నవయసులోనే కిడ్నీ సమస్య వచ్చిన ఓ యువకుడికి తన తల్లి కిడ్నీ దానం చేస్తూ ప్రాణాలు పోశారు. ఆదివారం ఎర్రమంజిల్‌లోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్ డాక్టర్ చల్లా రాజేంద్ర ప్రసాద్ వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన 21 ఏళ్ల విద్యార్థి మూడేళ్లుగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నాడని ఈ విషయాన్ని గుర్తించలేకపోవడంతో కొన్నాళ్ల తర్వాత గణనీయంగా బరువు తగ్గిపోయాడని అన్నారు. మూత్రపిండాలు దెబ్బతిన్న విషయం సమీపంలోని ఓ వైద్యుడు ధ్రువీకరించగా తమ ఆస్పత్రికి సిఫారసు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పది సెంటీమీటర్ల పరిమాణంలో ఉండాల్సినవి ఏడు సెంటీమీటర్లకు తగ్గిపోయాయని ఈ పరిస్థితుల్లో కిడ్నీ మార్పిడి మాత్రమే చేయాల్సి ఉంటుందని గుర్తించామన్నారు. తన తల్లి 42 ఏళ్ల వయసు కావడంతో కిడ్నీ దానం చేసేందుకు ముందుకు రావడంతో ఆమె నుంచి కిడ్నీ తీసి కుమారుడికి అమర్చామని శస్త్రచికిత్స విజయవంతంగా జరిగిందన్నారు. చిన్న వయసులోనే బీపీ ఉండటం వల్ల కిడ్నీ వైఫల్యం చెందిందని వెల్లడించారు.

వేతన బకాయిలను చెల్లించాలి

కాచిగూడ: వంట కార్మికులకు పెంచిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని జాతీయ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు బీవీ విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్‌నగర్‌లో రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేమ్ పావని అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన పథకంలో లక్షలాది మంది బడుగు బలహీన వర్గాల మహిళలు పనిచేస్తున్నారని, కోట్లాది మంది పిల్లలకు ఆహారం అందిస్తూ ఎంతో సహకరిస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి శ్రమను దోచుకుంటున్నారని వీరికి ఏలాంటి పని భద్రత లేక పాగా సామాజిక రక్షణ చర్యలైన ఈఎస్ఐ, పిఎఫ్ ప్రమాద భీమా పథకం, ఫించన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. వీరి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఖండించారు. ప్రతినెల బిల్లులు చెల్లించకపోవడం వలకల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వీరి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఓటు వేసి చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

ఓటరు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్‌సీ వెంకటేష్ దోత్రే

వెంకటేశ్వరకాలనీ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్న లక్ష్యంతో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేశామని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే అన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు అవుతారని ఈ ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని గతి ప్రభుత్వ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇన్‌కం ట్యాక్స్ క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన ఓటరు నమోదు శిబిరాలు సందర్శించి అక్కడికి వచ్చిన వారితో మాట్లాడారు. బీఎల్‌వోలతో మాట్లాడుతూ వచ్చిన ప్రతి ఒక్కరికి సంబంధిత ఫారాలను అందజేయాలని ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలో కూడా సూచించారన్నారు.

31న 'భూగ్రహీతల'తో ఆత్మీయ సమ్మేళనం

పంజగుట్ట: గత 14 సంవత్సరాలుగా మన్సూరాబాద్ కామినేని ఆస్పత్రి సమీపంలోని స్థలం విషయమై ఎన్నో పోరాటాలు చేసి హైకోర్టు ద్వారా భూమిలేని అన్ని వర్గాల నిరుపేదలకు ల్యాండ్ ఓనర్ ద్వారా ఒక్కొక్కరికి 100 గజాల చొప్పున గిఫ్ట్ డీడ్ చేయించినట్లు హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ షేక్ జిలానీ తెలిపారు. సదరు స్థలం పొందిన స్థల గ్రహీతల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 31వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఆత్మీయ సమ్మేళనంలో తమకు సహకరించిన ప్రభుత్వానికి, ప్రభుత్వ పెద్దలకు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలుపుతామన్నారు.

ముదిరాజ్‌లకు ప్రాధాన్యమివ్వాలి

శ్రీనగర్‌కాలనీ: ముదిరాజ్‌లకు ప్రాధాన్యమిచ్చే పార్టీలకే తమ మద్దతు అని గ్రేటర్ హైదరాబాద్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలో ముదిరాజ్ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధికార టీఆర్‌ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు మరిచిందని, ఒక్కసీటు కూడా ఇవ్వకపోవడం ముదిరాజ్‌లకు అవమానించడమే అని అన్నారు.

ఆలయ పనులకు భూమిపూజ

రహమత్‌నగర్: రహమత్‌నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధి పనులకు ఆదివారం కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంతో పురతన మైన బంగారుమైసమ్మ ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.

మహిళతో అసభ్యకర ప్రవర్తన: యువకుడి అరెస్టు

వెంగళరావునగర్: ఇల్లు ఖాళీ చేయమన్నందుకు మహిళ పట్ల అసభ్యంగా వ్యవహరించిన యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... జవహర్‌నగర్‌లో ఉంటున్న యాదిరెడ్డి, రెబకా దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి చెందిన ఇల్లు నాల్గవ అంతస్తులో రవీంద్ర అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. ఇటీవల రవీందర్ గదికి అతని స్నేహితులు తరచూ వస్తున్నారు. దాంతో విసుగుచెందిన రెబకా కిరాయిదారుడైన రవీందర్ గదికి వెళ్లి పరిచయం లేనివారిని రప్పించవద్దని చెప్పారు. అయితే రవీందర్ ఆమెతో తగవు పెట్టుకుని దుర్భాషలాడాడు. విషయం తెలుసుకున్న రెబకా కుమార్తె రవీందర్ వ్యాఖ్యలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా అతను మరింతగా రెచ్చిపోయి తన దుస్తులను పూర్తిగా విప్పి వారికి చూపించాడు. దానిని కూడా చిత్రీకరించిన తల్లీ కుమార్తెలు మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

క్లుప్తంగా...

డా.దేబల్ దేవ్‌కు 'ఆర్గానిక్' పురస్కారం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దేశీ వరి వంగడాల పరిరక్షకుడు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దేబల్ దేవ్‌కు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ 'ఐఫోమ్ ఆసియా ఆర్గానిక్ మెడల్ ఆఫ్ ఆనర్' లభించింది. వంద దేశాల్లో సేంద్రియ వ్యవసాయదారుల సంఘాల సమాఖ్య (ఐఫోమ్) ఆర్గానిక్స్ ఆసియా విభాగం, చైనాలోని క్సిచాంగ్ కౌంటీ సంయుక్తంగా 2023వ సంవత్సరపు ఆర్గానిక్ మెడల్ ఆఫ్ ఆనర్ పురస్కారానికి డా. దేబల్ దేవ్‌ను ఎంపిక చేశాయి. వైవిధ్యభరితమైన 1,440కు పైగా అపురూపమైన భారతీయ వరి వంగడాలను సేకరించడంతో పాటు, ఒడిశాలోని తన చిన్న పరిశోధనా క్షేత్రంలో ప్రతి ఏటా సాగు చేస్తూ పరిరక్షిస్తున్న డా. దేబల్ దేవ్ దశాబ్దాలుగా నిస్వార్థ సేవ చేస్తున్నారు. అవార్డులోతోపాటు 5 వేల డాలర్ల నగదుతో పాటు ప్రశంసాపత్రం ప్రదానం చేస్తారు. ప్రకృతి సేద్యానికి అనువైన ఈ వంగడాల ద్వారానే మన ఆహార సార్వభౌమత్వం నిలుస్తుందని డా. దేబల్ దేవ్ 'సాక్షి'తో అన్నారు.



గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో చేసిన విశేష సేవలకుగానూ డాక్టర్ దినకర్ రెడ్డికి హై9 హెల్త్ కేర్ కార్నివాల్ పురస్కారాన్ని అందచేస్తున్న మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ. హైదరాబాద్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

చేవెళ్ల డిక్లరేషన్‌పై కాంగ్రెస్ సంబురాలు

సాక్షి, హైదరాబాద్: దళిత, గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా శనివారం చేవెళ్ల సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించినందుకు ఆదివాసి, దళిత కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. సంప్రదాయ నృత్యాలు చేస్తూ సంబురాలను జరుపుకొన్నారు. అనంతరం ఆదివాసి కాంగ్రెస్ పార్టీ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్.. రాష్ట్రంలో దళిత, ఆదివాసి, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.

'హాకా'కు జాతీయ నోడల్ ఏజెన్సీ హోదా

ఆంక్షలు లేకుండా దేశవ్యాప్తంగా వ్యాపారం చేసే వీలు

- కేంద్రం తరపున ఆహార ఉత్పత్తుల కొనుగోలు
- తొలుత 50 వేల టన్నుల శనగలు కేటాయించిన కేంద్రం
- వీటిని పప్పుగా మార్చి వినియోగదారులకు అందించేలా చర్యలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ (హాకా)కు అరుదైన గుర్తింపు లభించింది. జాతీయ స్థాయి నోడల్ ఏజెన్సీగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో హాకా ఇకపై దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఎలాంటి ఆంక్షలు లేకుండా కేంద్ర ప్రభుత్వం తరపున వ్యాపారం చేయనుంది. ఈ హోదాతో దేశ వ్యాప్తంగా ఉన్న నాఫెడ్, నేషనల్ కో-ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌సీసీఎఫ్) వంటి సంస్థల సరసన హాకా చేరింది.

ఫలించిన మచ్చా కృషి

హాకాకు జాతీయ స్థాయి నోడల్ ఎజెన్సీగా గుర్తింపు కోసం ఆ సంస్థ అధికారులు సుమారు ఆర్నెల్లుగా తీవ్ర ప్రయత్నాలు చేశారు. హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు పలుమార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర కోఆపరేటివ్ అధికారులతో సమావేశమయ్యారు.



హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు

హాకాను మరింత బలోపేతం చేసేందుకు గానూ దేశ వ్యాప్తంగా వ్యాపారం చేసే అవకాశం కల్పించాలని కోరారు. చిట్టచివరకు జాతీయ హోదా కల్పించింది. ప్రస్తుతం హాకా తెలంగాణలో రైతుల నుంచి పలు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలకు ఆహార సరుకులను సరఫరా చేసే వ్యాపారం చేస్తోంది. అంగన్‌వాడీలకు పాలు పంపిణీ చేస్తోంది. వీటిని మరింత విస్తరించి దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ టెండర్లలో పాల్గొనేలా, ప్రభుత్వ సంస్థలకు సరుకులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టింది. హాకాకు జాతీయ నోడల్ ఏజెన్సీ దక్కడంతో ఇకపై దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఆయా ప్రభుత్వాలు వేసే టెండర్లలో పాల్గొనే అవకాశం దక్కుతుంది. తద్వారా హాకా టర్నోవర్‌తో పాటు ఆదాయం కూడా పెరగనుంది. రాబోయే రోజుల్లో దాదాపు రూ.25 వేల కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా హాకా లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

తొలుత శనగల ప్రాజెక్టు...

జాతీయ నోడల్ ఏజెన్సీ హోదాను దక్కించుకున్న హాకాకు కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా శనగల కొనుగోలు, పంపిణీ ప్రాజెక్టును ఇచ్చింది. దేశ వ్యాప్తంగా శనగపప్పు ధర అధికంగా ఉండడంతో ప్రభుత్వ పరంగా తక్కువ ధరకు వినియోగదారులకు అందించేలా కేంద్రం చేపట్టిన 'భారత్ దాల్' మిషన్‌లో భాగంగా హాకాకు శనగపప్పును సరఫరా చేసే బాధ్యతను అప్పగించింది. ప్రస్తుతం 50 వేల టన్నుల శనగలను కేటాయించింది. ఈ శనగలను వివిధ రాష్ట్రాల్లో కొనుగోలు చేసి, దాన్ని పప్పుగా మార్చాలి. ఆ పప్పును మార్కెట్లోకి విడుదల చేయాల్సిన బాధ్యత హాకాపై ఉంటుంది. అంతేకాకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే చౌక దుకాణాలకు కూడా హాకా సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాపారం ద్వారా హాకాకు అదనంగా మరో రూ.150 కోట్ల టర్నోవర్ పెరగనుంది. తద్వారా హాకా టర్నోవర్ ఒకేసారి రెండింతలు కానుంది. ప్రస్తుతం హాకా రూ. 150 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. భవిష్యత్తులో అవసరమైతే ధాన్యం కొనుగోలు రంగంలోకి కూడా దిగాలని కూడా భావిస్తోంది.

చైర్మన్‌కు అధికారి అడ్డంకులు...

హాకా చైర్మన్‌గా మచ్చా శ్రీనివాసరావు వినూత్న చర్యలు చేపడుతున్నప్పటికీ, ఆయనకు వ్యవసాయశాఖలోని ఒక కీలకాధికారి అడ్డంకులు సృష్టిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయన ప్రభుత్వ పెద్దల వద్ద తన గోడును విన్నవించుకున్నారని తెలుస్తోంది. హాకాను ఎంతో అభివృద్ధి చేయాలని కృషి చేస్తుంటే కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారని తెలిసింది. కాగా ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు ఉండటంతో మచ్చా అన్ని అడ్డంకులు అధిగమిస్తూ హాకాకు జాతీయ హోదా తీసుకొచ్చారని సంస్థ అధికారులు చెబుతున్నారు.

ప్రజల కోసం పనిచేసే పార్టీలను ఎన్నుకోండి

సీఎం చంద్రశేఖరరావు



సాక్షి, హైదరాబాద్: ప్రజల కోసం పనిచేసే పార్టీ, ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని భారత్ రాష్ట్ర సమితి అధినేత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అన్నారు. మహారాష్ట్ర బీజేపీ మైనార్టీ నేతలు పలువురు ఆదివారం ప్రగతిభవన్‌లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ వంటి సంఘసంస్కర్తలు, మేధావుల స్ఫూర్తితో దేశంలో సమూల మార్పు లక్ష్యంగా ప్రజలు చైతన్యవంతులై ఉద్యమించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీకి అధికారం ఇస్తున్నా జీవితాల్లో ఎలాంటి మార్పు రాకపోవడంపై ప్రజలు, యువత ఆలోచించాలన్నారు. సోలాపూర్ నుంచి వల్యాల నగేష్ నేతృత్వంలో ముస్లిం మైనార్టీ నేతలతో పాటు బీడ్ జిల్లా నుంచి పూల్‌చంద్ కరాడ్ ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే ముల్లర్ అంకోలా నుంచి, కొల్హాపూర్ నుంచి మహారాష్ట్ర కిసాన్ సెల్ ప్రెసిడెంట్ సంజయ్ పాటిల్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

సర్వీసులో చనిపోతే రూ.7లక్షలు

- ఎంప్లాయ్ డిపాజిటెడ్ లింక్డ్ ఇన్సూ్యరెన్స్ ఫెసిలిటీ అమలుకు ఆర్టీసీ నిర్ణయం
- ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు మరింత సాంత్వన
- గరిష్టంగా రూ.7 లక్షలు, కనిష్టంగా రూ.2.5 లక్షలు
- ఇప్పటికిప్పుడు 600 కుటుంబాలకు అందజేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: సర్వీసులో ఉంటూ చనిపోయే ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు సాంత్వన కలిగించే వార్త ఇది. భవిష్యనిధి(పీఎఫ్) ఆధారిత 'ఎంప్లాయ్ డిపాజిటెడ్ లింక్డ్ ఇన్సూ్యరెన్స్ ఫెసిలిటీ (ఈడీఎల్ఐఎఫ్)' ని వర్తింప చేసేందుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. ఈమేరకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. సర్వీసులో ఉంటూ (ఈపీఎఫ్ సభ్యత్వం) చనిపోయే ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు గరిష్టంగా రూ.7 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది. ఇది ఉద్యోగి భవిష్య నిధికి చెల్లించే కాంట్రిబ్యూషన్‌తో సంబంధం లేకుండా, సంస్థ చెల్లించే మొత్తానికి అనుబంధంగా ఉండనుంది. దీంతో ఈ రూపంలో అందే మొత్తం ఉద్యోగి కుటుంబానికి అదనపు లబ్ధిగా ఉండనుంది.



ఇదీ పాత పథకమే కానీ..

వాస్తవానికి ఇది పాత పథకమే. భవిష్య నిధి నిబంధనల ప్రకారం ఈపీఎఫ్ సభ్యులందరికీ కచ్చితంగా అందాల్సిందే. గతంలో ఈ మొత్తం తక్కువగా ఉండేది. 2021లో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ దీన్ని సవరించింది. కనిష్ట మొత్తాన్ని రూ.రెండున్నర లక్షలకు, గరిష్ట మొత్తాన్ని రూ.7 లక్షలకు పెంచింది. ఈ పెంపు 2020వ సంవత్సరం నుంచే వర్తిస్తుందని కూడా పేర్కొంది. కానీ, రకరకాల కారణాలతో ఇది ఆర్టీసీలో అమలు కాలేదు. ఏపీఎస్ఆర్టీసీకి, తెలంగాణ ఆర్టీసీకి గతంలో ఉమ్మడిగా పీఎఫ్ ట్రస్ట్ ఉండటం, ఇతర సాంకేతిక కారణాలతో ఈ సవరించిన లబ్ధి అందకుండా పోయింది. తాజాగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఈ లబ్ధిని అమలులోకి తేవాలంటూ కార్మిక సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వంలో విలీనం కంటే ముందే దీన్ని వర్తింప చేయాలని, తదుపరి వచ్చే సాంకేతిక కారణాలతో కొన్ని రకాల లబ్ధికి గండి పడే ప్రమాదం ఉందన్న ఆందోళనతో దీన్ని ముందుగానే వర్తింప చేయాలని పట్టుపట్టాయి. ఈమేరకు ప్రభుత్వానికి విన్నవించాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆర్టీసీ సానుకూల నిర్ణయం తీసుకుంది.

లెక్క ఎలా అంటే..

నెలవారీ సగటు వేతనంపై ఈ మొత్తాన్ని లెక్కిస్తారు. గరిష్ట సగటు వేతనం రూ.15 వేలుగా నిర్ధారించి దానికి 35 రెట్ల మొత్తాన్ని గుణిస్తారు. ఆపై రూ.1.75 లక్షల మొత్తాన్ని బోనస్‌గా దీనికి చేర్చి రూ.7 లక్షల మొత్తాన్ని గరిష్ట మొత్తంగా నిర్ధారిస్తారు. ఇది ఆ ఉద్యోగి చనిపోయే సమయానికి పీఎఫ్ ఖాతాలో ఉన్న నిల్వ ఆధారంగా గుణిస్తారు.

600 కుటుంబాలకు తక్షణ లబ్ధి..

గతంలో ఈ పథకాన్ని వర్తిస్తూ మధ్యలో నిలిపి వేశారని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. అలా 600 మంది ఉద్యోగుల కుటుంబాలకు కొత్తగా లబ్ధి అందకుండా పోయిందన్నారు. ఇప్పుడు ఆర్టీసీ నిర్ణయంతో ఆ 600 కుటుంబాలకు వెంటనే లబ్ధి చేకూరుతుందని, తదుపరి ఈపీఎఫ్ సభ్యులు చనిపోతే వారి కుటుంబాలకు సాయం అందుతుందని టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు తెలిపారు.

విమర్శలకు భయపడను

- దళితవాడలకు శ్రీవారిని తీసుకెళ్లి కళ్యాణం చేసింది.. మాడవీధుల్లో చెప్పులతో తిరగడాన్ని నిషేధించిందీ నేనే
- మతాంతీకరణలు ఆపడానికి 30 వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించా
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి: దళితవాడలకు శ్రీ వేంకటేశ్వరస్వామిని తీసుకెళ్లి కళ్యాణం చేసింది.. తిరుమల ఆలయ మాడవీధుల్లో చెప్పులు వేసుకుని తిరగకూడదని నిర్ణయం తీసుకుంది తానేనని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శకులకు గట్టిగా సమాధానమిచ్చారు. తాను క్రిస్టియన్ అని,



నాస్తికుడినని ఆరోపణలు చేస్తున్న వారికి ఇదే నా సమాధానమన్నారు. ఆరోపణలకు భయపడి మంచి పనులు చేయడం ఆపేవాడిని కాదని.. తాను పోరాటాల నుండి పైకొచ్చిన వాడినని, విమర్శలకు భయపడనని ఆయన స్పష్టంచేశారు. ఆదివారం తిరుపతిలో జరిగిన 'మూడుతరాల మనిషి' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయనతోపాటు ఈఓ ధర్మారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ.. తాను 17ఏళ్ల క్రితమే టీటీడీ చైర్మన్ అయిన వ్యక్తినని గుర్తుచేశారు. దేవుడి దయతో మతాంతీకరణలు ఆపడానికి 30 వేల మందికి కళ్యాణమస్తు ద్వారా సామూహిక వివాహాలు చేయించిన విషయాన్ని ఆయన వివరించారు. తిరుమల ఆలయ నాలుగు మాడవీధుల్లో చెప్పులు వేసుకుని తిరగకూడదనే నిర్ణయం కూడా తనదేనన్నారు. అన్నమయ్య 600వ వర్ధంతి ఉత్సవాలు చేసిన విషయాల గురించి తెలిపిందీ తానేనని ఆయన వెల్లడించారు.

నాలుగేళ్ల అభివృద్ధిపై పీపీటీ ప్రదర్శన..

తిరుమల శ్రీవారిపై ఉన్న భక్తివిశ్వాసాలను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. టీటీడీ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, భక్తుల వసతుల కల్పనపై నెలరోజుల్లో పీపీటీ ప్రదర్శన ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. టీటీడీ మీద విమర్శలు చేస్తున్న వారిలో తిరుపతి వాసులు కూడా ఉన్నారని తెలిపారు. టీటీడీని తిరుపతి వాసులు తమ సొంతంగా భావించాలని కోరారు. దేవుడి దయవల్లే తిరుపతిలో ప్రత్యక్షంగా పరోక్షంగా వేల మంది ఉపాధి పొందుతున్నారని, శ్రీవారివల్లే తిరుపతి ఎంతో అభివృద్ధి చెందుతోందని ఆయన స్పష్టంచేశారు.

నగర వార్తలు

నటీమణి కృష్ణవేణికి వంశీ-జమున జీవన సాఫల్య పురస్కారం



కృష్ణవేణికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న వంశీరామరాజు తదితరులు

బంజారాహిల్స్: ప్రముఖ నటి, నిర్మాత, గాయని కృష్ణవేణికి వంశీ-జమున జీవన సాఫ్యల పురస్కారాన్ని ఆదివారం ప్రదానం చేశారు. ప్రముఖ నటీమణి జమున పేరిట ఏర్పాటు చేసిన ఈ అవార్డును వారి కూతురు, మనవళ్ల చేతుల మీదుగా వంశీ అవార్డ్స్ చైర్మన్ వంశీరామరాజు ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ కృష్ణకుమారి, దర్శకుడు రేలంగి నర్సింహారావు, నిర్మాత రామ సత్యనారాయణ, ఎస్.ఆర్. అనురాధాదేవి, వీబీజీ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీ రామరాజు మాట్లాడుతూ. ఆ రోజుల్లో కృష్ణవేణి ఎన్టీఆర్‌ను, ఎస్వీ. రంగారావును, ఘంటసాలను చిత్రపరిశ్రమకు పరిచయం చేశారన్నారు. జమున కుమార్తె స్రవంతి మాట్లాడుతూ, తన తల్లికి కృష్ణుడు అంటే చాలా ఇష్టమన్నారు. తన పక్కన ఎప్పుడూ ఇద్దరు కృష్ణులు ఉండేవారు అంటుండేవారని, అందులో ఒకరు నటీమణి కృష్ణవేణి కాగా, ఇంకొకరు ఫ్యామిలీ డాక్టర్ కృష్ణకుమారి అని చెప్పేవారన్నారు. రేలంగి మాట్లాడుతూ, తన గురువు దాసరి ఇంట్లో తరచూ కృష్ణవేణిని చూసేవాడినని, ఆమెకు ఈ అవార్డు ఇవ్వడం సముచితమని అన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

– టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ పోరాట కమిటీ నేతలు

శంషాబాద్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.జంగయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల రాష్ట్రంలో విద్యారంగం నిర్వీర్యమవుతోందని వారు ఆరోపించారు. వచ్చే నెల 1వ తేదీన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పది వేల మందితో నిర్వహించనున్న కార్యక్రమ సన్నాహక సమావేశాన్ని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కమీషన్లు వచ్చే రంగాలను మాత్రమే పట్టించుకుంటున్నది తప్ప.. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దాల్సిన విద్యారంగాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. 22 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాల్సిన సర్కారు కేవలం 5900 ఖాళీలనే ప్రకటించడంతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్ రద్దు చేయాలని, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను సైతం వెంటనే విడుదల చేయాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జంగయ్య కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు రవి, రాజశేఖర్‌రెడ్డి, గాలయ్య, మాణిక్‌రెడ్డి, గోపాల్ నాయక్, వెంకటప్ప, విజయలక్ష్మి, ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు స్వాగతం

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఇరవై రోజుల కిందట ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు యాత్రను పూర్తి చేసుకుని ఆదివారం నగరానికి తిరిగి వచ్చారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు వారికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆత్మీయ స్వాగతం పలికారు. యాత్ర ఏర్పాట్లను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.

29న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బంజారాహిల్స్: దేశంలో అతిపెద్ద ప్రాంతీయ ఈవెంట్స్ అసోసియేషన్ తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ, తెలంగాణ ఈవెంట్ ఫెసిలిటేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ఈ నెల 29న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ పోస్టర్‌ను బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బల రాం బాబు, రవి, సందీప్ జైన్ పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌ను స్మరించుకున్న చిత్రపురి

మణికొండ: తనకు ఉన్న కళను సామాజిక చైతన్యానికి వినియోగించి ప్రజాకవి, ప్రజాగాయకుడిగా చరిత్రలో నిలిచిన గద్దర్‌ను చిత్ర కార్మికులు స్మరించుకున్నారు. ఆదివారం రాత్రి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి ఎల్ఐజీలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పరిశ్రమలో పనిచేస్తున్న 24 క్రాఫ్ట్‌లకు చెందిన కార్మికులు, టెక్నీషియన్లు, హౌసింగ్ సొసైటీ సభ్యులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నిర్మాత దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్, రచయితలు పరుచూరి గోపాలకృష్ణ, అందెశ్రీ, దర్శకుడు శంకర్, మాదాల రవిలు మాట్లాడారు. తన ఆట, పాటలతో తెలుగు వారందరినీ జాగృతం చేసి గొప్ప పోరాట యోధుడిగా గద్దర్ నిలిచారన్నారు. ఆయన ఆకస్మిక మరణం అభిమానులను తీవ్రంగా బాధించిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గద్దర్ పాటల విభావరి అందరినీ ఉర్రూతలూగించింది. హౌసింగ్ సొసైటీ సభ్యులు, 24 క్రాఫ్ట్‌ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, గద్దర్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మేధస్సును, ఏకాగ్రతను పెంచే క్రీడ చెస్: ఆర్‌పీ పట్నాయక్



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఆర్‌పీ పట్నాయక్

వెంగళరావునగర్: సమాజంలో రాణించాలంటే ఎన్నో క్రీడలు ఉన్నాయని, అయితే మేధస్సును, ఏకాగ్రతను పెంచే ఏకైక క్రీడ చెస్ అని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 25వ తేదీ నుంచి స్లాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిలో 1600 ఫిడే రేటెడ్ అంతర్జాతీయ చెస్ పోటీలు ముగిశాయి. ఆదివారం రాత్రి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఆర్‌పీ పట్నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెస్ అంటే తనకెంతో ఇష్టమైన క్రీడ అని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఆడటానికి అవకాశం ఉన్న క్రీడ చెస్ మాత్రమేనని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు చెస్ లాంటి క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో స్లాన్ సీఈఓ నవీన్‌నాయక్, వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్యం, వివిధ దేశాలు, రాష్ట్రాలకు చెందిన చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రథమ బహుమతి సాధించిన బీహార్ క్రీడాకారుడు

ఈ పోటీల్లో బీహార్‌కు చెందిన క్రీడాకారుడు శుభం కుమార్‌కు ప్రథమ బహుమతి లభించింది. ఇతనికి రూ. లక్ష నగదు బహుమతి, షీల్డ్, సర్టిఫికెట్ అందజేశారు. ద్వితీయ బహుమతి రూ. 60 వేల నగదును తెలంగాణకు చెందిన యశ్వీజైన్ గెలుచుకున్నారు. తృతీయ బహుమతి రూ.40 వేలును ఏపీకి చెందిన డీఎస్ఎస్‌యు సాత్విక్ దక్కించుకున్నారు. ఈ పోటీల్లో మొత్తం నాలుగు దేశాల్లోని 18 రాష్ట్రాలకు చెందిన దాదాపు 575 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత, సమగ్రతకు కళలు దోహదం

సుల్తాన్‌బజార్: జాతీయ సమైక్యత, సమగ్రతలకు కళలు దోహదపడతాయని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్‌లో నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో 48వ అఖిల భారత సంగీత నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ వెంకటేశ్వర వేదాంత వర్ధిని సాంస్కృతిక కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ దండూరి విద్యారణ్యస్వామి, నృత్యగురువులు నాగసాయి, కిరణ్మయిలను సంస్థ నిర్వాహకులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో జరిగే శాస్త్రీయ సంగీత నృత్య పోటీలు యువ కళాకారులకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జి.వసుంధర, హేమరాజు, విజయ్‌కుమార్, రేణుకా ప్రభాకర్, వాణి రమణ, స్నేహ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

జహీరాబాద్ లోక్‌సభ సభ్యుడు బీబీ పాటిల్



జంగమ సమాజం గ్రేటర్ హైదరాబాద్ నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న అతిథులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని జహీరాబాద్ లోక్‌సభ సభ్యుడు బీబీ పాటిల్ అన్నారు. తెలంగాణ జంగమ సమాజం గ్రేటర్ హైదరాబాద్‌కు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ సభ కొత్త అధ్యక్షుడు జె.భద్రేశ్వర్ అధ్యక్షతన బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బీబీ పాటిల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ కార్యక్రమంలో జంగమ సమాజం వారికి ప్రాధాన్యం ఇచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. కాగా, తెలంగాణ జంగమ సమాజం గ్రేటర్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా విశ్రాంత అదనపు డీసీపీ జె.భద్రేశ్వర్, మఠం యెర్రి స్వామి, కోశాధికారిగా ఒమ్ని ఆసుపత్రి జీఎం బి.విశ్వనాథం, సభ్యులుగా ఎం.శాంత్‌కుమార్, ఎం.రామలింగం, ఎ.సంఘమేశ్వర్, వి.సరిత, ఎం.బుచ్చిబాబు, కె.చంద్రకాంత్, జీఆర్ కవిత, ఎం.రాజు, జె.ప్రవీణ్‌కుమార్, ఎ.రాజేష్, హెచ్ఎం సదాశివయ్య, పి.రవికుమార్, ఎం.సంగయ్య, ఎం.ప్రభులింగం, ఎం.వైద్యనాథ్, ఎం.శివకుమార్, గురుప్రసాద్‌స్వామి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జంగమ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య, జంగమ సమాజం ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యక్షుడు వి.నాగభూషణం పాల్గొన్నారు.

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్



బిజినెస్ మింట్ అవార్డులు అందజేస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

సాక్షి, సిటీబ్యూరో: పన్నులు సకాలంలో చెల్లిస్తే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందని ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవిడియా అన్నారు. సామాజికంగా విభిన్న రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులకు బిజినెస్ మింట్ ఆధ్వర్యంలో 50వ జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. బంజారా హిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో 72 మందికి బిజినెస్ మింట్ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవిడియా, ఏసీపీ వి.ప్రదీప్ కుమార్ రెడ్డి, సంగీత దర్శకుడు అనుప్ రూబెన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌లాల్ లావిడియా మాట్లాడుతూ., భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని, ప్రస్తుతం 3.2 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్, టెస్లా వంటి కొన్ని బహుళజాతి కంపెనీలు దీనికి ఉదాహరణ అని అన్నారు. సామాజిక, నైతిక, మానవీయ విలువల పునాదులపై నిర్మించిన భారతదేశం ప్రపంచ దేశాలకు మార్గదర్శంగా నిలుస్తోందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. కార్యక్రమంలో బిజినెస్ మింట్ వ్యవస్థాపకుడు వినయ్ కాంత్ కొరపాటి, జెఎన్‌టీయు హైదరాబాద్ వైస్ చాన్సలర్ కె. నరసింహా రెడ్డి, విహబ్ సీఈఓ ఆర్.దీప్తి, లీడ్ ఇండియా ఫౌండేషన్, యూఎస్ఏ వ్యవస్థాపకులు డాక్టర్ హరి ఎప్పనపల్లి, ఎస్‌కే యూసుఫ్ ఉస్తాద్, డాక్టర్ మురహర్ పెంకులింటి, వర్షిత్ వీసంశెట్టి, వినీత్ వీసంశెట్టి పాల్గొన్నారు.

వేదాలకు ప్రతీక వీణ

గన్‌ఫౌండ్రీ: వేదాలకు ప్రతీక వీణ అని పలువురు ప్రముఖులు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత్‌ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో వీణా ఝరి పేరిట సుస్వర వీణావాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ గుప్తా, నీటిపారుదల శాఖ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాలాచార్యులు మాట్లాడుతూ, రవీంద్రభారతి వేదికపై వీణా ఝరి వంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ వేదికైన రవీంద్రభారతిలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన వీణావాద కార్యక్రమం హానర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించిందని సంస్థ ప్రతినిధి కేవీ రమణారావు తెలిపారు. కార్యక్రమంలో సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞ శర్మ, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రమణారావు, భారత ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లలితరావు పాల్గొన్నారు.





మంచిమాట

లక్ష్యం.. శుభమ్

ఏ వ్యక్తికైనా కావాల్సింది ఏమిటి? ఏం ఉన్నా, ఏం లేకపోయినా ఒక వ్యక్తికి ప్రధానంగా ఉండాల్సింది ఏమిటి? ఎలాంటి వ్యక్తి ఐనా, ఎలాంటి స్థితిలో ఉన్న వ్యక్తి ఐనా పొందాల్సింది ఏమిటి? ఎవరి ఆశలు వారివి. ఎవరి ఆకాంక్షలు వారివి. ఎవరి ఆశయాలు వారివి. మన అందరికీ అందాల్సిన వాటిల్లో ఏది అగ్రగణ్యమైంది? ఏది మనల్ని ఎప్పటికీ వీడిపోకుండా ఉండాలి? శుభం... శుభం... శుభం...

'అథాతో బ్రహ్మ జిజ్ఞాస' అని బ్రహ్మ సూత్రాల్లో మొట్టమొదటి సూత్రం తెలియజెప్పింది. అంటే శుభం కాబట్టి బ్రహ్మ జిజ్ఞాస అని అర్థం. ఆధ్యాత్మిక పరమైన బ్రహ్మం గురించిన జిజ్ఞాస ఎందుకు అంటే అది శుభం కాబట్టి. లౌకిక జీవనానికైనా, ఆధ్యాత్మిక జీవనానికైనా శుభమే మనిషికి లక్ష్యం; ఆ లక్ష్యానికి మనిషి లక్షణం. లక్ష్య, లక్షణ సమన్వితం జరగాలి. అంటే మనిషికి శుభం సమన్వితం అవ్వాలి.

క్షేమం, మంగళం, మేలు, సౌఖ్యం ఇవి అన్నీ శుభం ఔతాయి. శుభం మనకు నిండుగా ఉండాలి. మనకు శుభం కలగడానికి, మనం శుభంతో మెలగడానికి మనకు మనమే ఆధారం. కనుక మనంత మనమై శుభం కోసం ప్రయత్నం చేసుకోవాలి. ప్రయత్నం వల్ల ప్రయోజనం ఉంటుంది. మనం శుభం కోసం ప్రయత్నిస్తూనే ఉండాలి; మన ప్రయత్నాలకు ఫలితంగా మనం శుభాన్ని పొందుతూ ఉండాలి. శుభాలు ప్రభవించాలని ఎప్పుడైనా ఆకాంక్షించవచ్చు;

ప్రభవించిన శుభాలు విభవాన్నివ్వాలని ఎవరైనా ఆశించవచ్చు. కానీ ఇంత వరకూ ఆ పని సరిగ్గా జరగలేదు. ఎవరూ ఆ పనిని సరిగ్గా చేసేందుకు ముందుకు రాలేదు. మనం శుభం కోసం పని చెయ్యాలి. మన కోసం శుభం పంట పండాలి. ఇకపైనైనా మనం శుభం కోసం పని చేద్దాం; ఇక అంతా శుభమయం కావడానికి మనల్ని మనం సరిచేసుకుందాం. ఆశపడి, ఆకాంక్షించి, ఆశించి మనం శుభాన్ని సాధించుకుందాం.

కుత్సితం, మత్సరం, దాష్టీకం, దుర్మార్గం, ద్రోహం, వైరం, అసూయ, అక్కసు, బద్ధకం, నీరసం, అభిప్రాయాలు, మనోభావాలు, నమ్మకాలు, అపనమ్మకాలు, అపార్థాలు, అవిద్య, మూర్ఖత్వం, దుశ్చింతన, బుద్ధి మాంద్యం ఇవన్నీ శుభాన్ని మనకు లేకుండా చేశాయి. వీటిని మనం వెనువెంటనే వదిలించేసుకోవాలి. మన చెడు నడతను మనం మార్చుకోవాలి; మనం మనస్తత్త్వంలో మానవత్వాన్ని చేర్చుకోవాలి; మనం మస్తిష్కంలో మంచితనాన్ని కూర్చుకోవాలి. శుభం కోసం మనం ఇకపై సవ్యంగా ఉండాలి.

మనమే కాదు, మన పెద్దలు చేసిన తప్పులూ మనకు శుభాన్ని లేకుండా చేస్తున్నాయి; అవి మన సమాజంలో అశుభాన్ని రగిలిస్తున్నాయి; ఎప్పుడో ఎవరో చేసిన కుట్రలు ఇప్పటికీ శుభాన్ని రానివ్వకుండా ఇలాతలాన్ని ఇక్కట్ల పాలు చేస్తున్నాయి. ఈ స్థితిని సరిదిద్దుకుందాం; రానున్న ఆపదల్ని తొలగించుకుందాం; శుభాన్ని ఆవాహన చేసుకుని అందుకుందాం.

'శుభం కాబట్టి బ్రహ్మ జిజ్ఞాస' అని ఒక బ్రహ్మసూత్రం మనకు తెలియజెప్పాక 'సుఖ విశిష్టాభిధానాదేవ చ' అని మరో బ్రహ్మసూత్రం మనకు ఉండాల్సిన తెలివిడిని ఇస్తూ ఉంది. విశిష్టమైన సుఖం ఇస్తుందని నిశ్చయంగా చెప్పబడినందువల్లే అది బ్రహ్మం అని ఆ సూత్రానికి అర్థం. సుఖం లేదా శుభం విశిష్టమైంది అన్న సత్యాన్ని మనం ఆకళింపు చేసుకోవాలి. ఆ విశిష్టమైన శుభాన్ని మనం పొందుతున్నామా? ఈ ప్రశ్నను మనకు మనమే వేసుకుని సరైన జవాబుగా మనం శుభాన్ని పొందాలి; పొందుదాం. సర్వత్రా శుభం నెలకొనాలి; సర్వులకూ శుభం వెల్లివిరియాలి. శుభం భూయాత్.

– రోచిష్మాన్

> ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు వీటివల్ల శుభం కలుగుతుంది, జరుగుతుంది అని మనం మన మనసు, మెదడులతో తెలుసుకోవాలి. మన ఆశలు, ఆకాంక్షలు, ఆశయాల వల్ల శుభం మాత్రమే జరిగేట్లు మనం శ్రద్ధ వహించాలి. శుభం కోసం మనం పూనుకోవాలి; శుభంతో మనల్ని మనం పునర్నిర్మించుకోవాలి

వాగ్గేయకార వైభవం - 4

భూమికి తడి తగలాలి

ఊపిరి వాక్కుగా మారిన కారణంగా శరీరం పడి పోయినా, కీర్తి శాశ్వతంగా నిలబడిపోతుంది. నిజానికి మనకు సనాతన ధర్మంలో గొప్పది వేదం. వేదం అపౌరుషేయం. ఈశ్వరుడిచేత చెప్పబడినది. ఈశ్వరుడు ఎంత సనాతనుడో వేదం అంత సనాతనమైనది. నా ఊపిరి రెండు కాదు, ఊపిరి తీస్తున్నంతసేపే 'నేను' నేనుగా ఉన్నాను. ఊపిరి తీస్తూ మాట్లాడమంటే మాట్లాడలేను. ఊపిరి విడిచి పెడుతున్నప్పుడు అది వాక్కుగా మారుతుంది. తీసిన ఊపిరులను సమాజ శ్రేయస్సు కోసం వాక్కులుగా మార్చిన వారున్నారు. తామేదీ ఆశించకుండా కేవలం సమాజ శ్రేయస్సే కోరుకున్నారు వారు. భగవంతుడిచ్చిన ఊపిరిని వాక్కుగా మార్చి మాట్లాడుతున్నాను, అది నన్ను శాశ్వతుడిని చేస్తుందన్నాడు పోతన. శాశ్వతమైనది పరబ్రహ్మము. దానిలో చేరిపోతాను... అన్నాడు.


శంకరాచార్యులవారు శివానందలహరి చేస్తూ..అసలు భక్తికి చివరి మాట ఏది అన్నదానికి సమాధానంగా

... ''అంకోలం నిజ బీజ సంతతి
రయస్కాంతోపలం
సూచికా/ సాధ్వీ నైజ విభుం
లతా క్షితి రుహం సింధు స్సరిద్వ
ల్లభమ్/ ప్రాప్నోతీహ యథా తథా
పశుపతేః పాదార వింద ద్వయమ్/ చేతో
వృత్తి రుపేత్య తిష్ఠతి సదా సా భక్తి రిత్యుచ్యతే ''

అంటారు. నది సముద్రంలో కలిసిపోయిన తరువాత ఇక నదికి రంగు, రుచి ఇవేం ఉండవు. అటువంటి త్యాగమయ జీవితాన్ని గడిపి భగవంతునిలో ప్రవేశించాడు, నది సముద్రంలో కలసిపోయినట్లు కలిసిపోయాడు. కానీ ఆయన మాత్రం లోకంలో చిరస్థాయిగా ఉండిపోయాడు. ఎలా ... వాక్కు కారణంగా. భారతం ద్వారా నన్నయ అలా ఉండిపోయాడు. ఎర్రాప్రగడ, త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, రామదాసు... వీళ్ళందరూ అలాగే వాక్కుల కారణంగా ఉండిపోయారు. ఆ వాక్కును కొందరు పద్యరూపంగా, కొందరు గద్యరూపంగా, శ్లోకంగా, పాటగా చెప్పారు. పాటకున్న లక్షణం .. అది సంస్కృతికి మూలకందమై నిలబడుతుంది.

భూమినుంచి మొక్కలు పుట్టాలి... అంటే భూమికి ఆర్ద్రత ఉండాలి. అందుకే గ్రీష్మం తరువాత వర్షరుతువు వస్తుంది. దాని ముందు ఆషాఢమాసం ప్రవేశించగానే ప్రతి ఊరిలోనూ అధిష్ఠాన దేవతయిన గ్రామదేవతను దర్శించుకుని నైవేద్యం పెడతారు. ఎందుకు! ఆమె అనుగ్రహంతో నేను ఈ ఊరిలో ఉండి అన్నం తినగలుగుతున్నా... కాబట్టి ఏడాదికొక్కసారి నేను ఆమెకు నైవేద్యం పెట్టాలి. ఆమె భూమికి ఆర్ద్రత కలిగిస్తుంది, వర్ష రూపంలో. తడి తగలగానే ఏడాదికి సరిపడా నేను తినగలిగిన అన్నం నాకు దొరుకుతుంది... అన్న భావన.

భూమికి తడి తగలకపోతే, ఎండి పడిపోయిన జామ గింజలు, బత్తాయి గింజలు, ధాన్యపు గింజలు ఏవీ మొక్కలుగా పైకి లేవవు. తడి తగలగానే గడ్డిపరక నుంచి మొదలుపెట్టి, భూమికి చేరిన గింజలన్నీ మొక్కలై పెరుగుతాయి. అంటే ఆర్ద్రత ఉండాలి. ప్రాణుల మనుగడకు అది ఆధారం. అలాగే ఒక దేశ సంస్కృతి నిలబడాలంటే... భూమి అంతా చెమ్మగిల్లి మొక్కలు పుట్టినట్టు, కళలుండాలి. కళలద్వారా సంస్కృతి పెరుగుతుంది.





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

ధర్మతాదృష్టి



శీలభ్రష్టత అంటే వ్యభిచరించడం ఒక్కటే కాదు. అసత్యాలు పలకడం, దొంగిలించడం, నిండు ప్రాణాలు తియ్యడం, మత్తుపానీయాలు సేవించడం. ఇవన్నీ శీలభ్రష్టతలే! ఈ దోషాలు లేని వ్యక్తి గానీ, సమాజం గానీ నైతికంగా దిగజారదు. తప్పు చేయడం తప్పు కాదు. తెలియకుండా కొన్ని తప్పులు జరుగుతూనే ఉంటాయి. కానీ అవి తప్పు అని తెలిశాక కూడా అవే తప్పులు చేయడమే పెద్ద తప్పు.

తప్పు తెలుసుకుని సరిదిద్దుకోవడాన్ని మరలా ఆ తప్పుని చేయకపోవడాన్ని బుద్ధుడు ధర్మతాదృష్టి అంటాడు.

ఒక భిక్షువు వెనుకటి అలవాటుని మానుకోలేక సారాయి సేవించాడు. అతను భిక్ష కోసం వెళ్ళినప్పుడు గృహస్తులు చక్కగా భోజనం పెట్టారు. ధర్మ ప్రవచనం విన్నారు. ఆ తరువాత మొమాటం పెట్టి పానీయానికి బదులు పులిసిన ద్రవాన్ని ఇచ్చారు. అది సారాయి లాంటిదే అని తెలిసి కూడా నిగ్రహించుకోలేక కొద్దిగా సేవించాడు. కానీ.. ఆ తరువాత ఎంతో తప్పుచేసిన వాడిగా మధన పడ్డాడు. ఇంకెప్పుడూ ఇలాంటి తప్పు చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు. తిరిగి ఆశ్రమానికి వచ్చాక తన మిత్ర భిక్షువులు ఒకరిద్దరికి చెప్పుకున్నాడు. అయినా ఆ భిక్షువు మనస్సు శాంతించలేదు. ఏదో ఒక మూల తప్పుచేశాను అనే భావన తొలుస్తూనే ఉంది. చివరికి బుద్ధుని చుట్టూ బౌద్ధ సంఘం చేరి ఉంది. అప్పుడు బుద్ధుడు ఆ భిక్షువుని శాంతపరచి, అందరితోపాటు కూర్చోబెట్టి-

''భిక్షువులారా! తెలిసో తెలియకో తప్పులు, దోషాలు కలిగినప్పుడు వాటిని కప్పిపుచ్చుకునే వారు దుశ్శీలురు. కానీ కొందరు తమ దోషాన్ని విజ్ఞులకీ మిత్రులకీ చెప్పుకుంటారు. ఇకపై ఇలాంటి తప్పు జరగకుండా నడుచుకుంటారు. ఇలా సరిదిద్దుకునే పద్ధతిని 'ధర్మతా దృష్టి' అంటారు. వీరు పసిపిల్లలతో, ఆవుతో సమానం'' అంటూ భిక్షు సంఘాన్ని కలయ చూశాడు. ఆ భిక్షువు వంక పరిశీలనగా చూశాడు. అతనిముఖంలో తొంగి చూసే సిగ్గు, బిడియం పోయాయి. మనోనిర్మలత అతని ముఖంలో ప్రస్ఫుటంగా కనిపించింది. బుద్ధుడు మరలా-

''భిక్షువులారా! ఒక పసిబిడ్డ వెల్లికిలా పడుకుని ఉంటాడు గదా! ఆ పసితనంలో కూడా ఆ బిడ్డ తన చేతితో గానీ, కాలితో గానీ.. అగ్నిని ముట్టుకుంటే ఏం చేస్తాడు? చాలా వేగంగా.. ఆ చేతినో, కాలినో వెనక్కి ముడుచుకుంటాడు. అలాగే ధర్మతాదృష్టి కలిగిన వారూ తమ దోషాన్నుండి అంతే వేగంగా వెనక్కి మళ్ళుతారు. గట్టున మేస్తూ ఉన్న ఆవు ఆకలితో ఉండి, తాను ఆబగా మేస్తూ కూడా తన దూడను గమనిస్తూనే ఉంటుంది. అలాగే ఈ ధర్మతాదృష్టి కలిగిన వారు తమ దోషాల్ని తామే సరిదిద్దుకుంటూ.. ఆవులా జాగ్రత్తగా ఉంటూ తమ జ్ఞానాన్ని, శీలాన్నీ వృద్ధి చేసుకోవాలి'' అని చెప్పాడు.

ఆ భిక్షువుకి మనస్సులోని అల్లకల్లోలాలు శాంతించాయి. తన మీద తనకు ధైర్యం వచ్చింది. ధర్మసాధనలో అందరికంటే ముందు శిఖరాగ్రానికి చేరాడు. ఇలాంటి దృష్టి సంపన్నుడు ధర్మబలుడై లోకోత్తరుడౌతాడు. మనుషులు మానూ మాకులూ, రాయీ రప్పలూ కాదు ఏం దోషం చేయకుండా పడి ఉండటానికి. తాను సమాజంలో, సమాజం తనలో ఉండి నడిచేవారు. సమాజ హితాన్ని కోరే వారు ధర్మతాదృష్టితో తమని తాము సంస్కరించుకుంటూ, సమాజాన్ని సంస్కరించాలి. ఇదే ఉత్తమ ధర్మం. అత్యుత్తమ ధర్మం.

అలాంటి మార్గాన్ని అందించిన తథాగత బుద్ధుడు సదా స్మరణీయుడు!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

అంచనాలకు మించి!



● శిరీష్, 'దిల్' రాజు, నితిన్, శ్రీరామ్ వేణు

నితిన్ హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'తమ్ముడు' టైటిల్ ఖరారైంది. శ్రీరామ్ వేణు దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఫైనాన్షియర్ ప్రసాద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వంశీ పైడిపల్లి తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ''కొన్ని సినిమా టైటిల్స్ చాలా బాధ్యతతో వస్తుంటాయి. మీ అంచనాలకు మించి ఉండేలా ఈ సినిమా చేస్తాం'' అని పేర్కొన్నారు నితిన్. ''సెప్టెంబర్ 1నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది. 'దంగల్, కహానీ, తారే జమీన్ పర్' లాంటి సక్సెస్ ఫుల్ చిత్రాలకు వర్క్ చేసిన సత్యజిత్ పాండే (సేతు) ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. అయితే అక్క– తమ్ముళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం ఉండనుందని టాలీవుడ్ టాక్.



● అమితాబ్ బచ్చన్
● షారుక్ ఖాన్

పదిహేడేళ్ల తర్వాత...

బాలీవుడ్ సీనియర్ డాన్స్‌కు నూతన డాన్ రణ్‌వీర్ సింగ్ అండ్ టీమ్ నుంచి ఆహ్వానాలు అందనున్నాయని బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. రణ్‌వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 'డాన్ 3' చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికే బాలీవుడ్ వెండితెరపై డాన్ పాత్రలు చేసిన అమితాబ్ బచ్చన్(డాన్- 1978), షారుక్ ఖాన్ (డాన్-2006, 'డాన్ 2'-2011)లు 'డాన్ 3' చిత్రంలో అతిథి పాత్రల్లో కనిపించనున్నారట. ఇందుకోసం రణ్‌వీర్, ఫర్హాన్‌లు ప్రయత్నాలు మొదలు పెట్టారని టాక్. అయితే 2006లో వచ్చిన 'కభీ అల్విదా నా కహనా' తర్వాత అమితాబ్, షారుక్ స్క్రీన్ షేర్ చేసుకోలేదు. మరి..'డాన్ 3' కోసం దాదాపు 17ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటారా? వేచి చూడాలి.



● శ్రుతీహాసన్

మూడు రోజులు.. మూడు భాషలు

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'సలార్'. విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా, పృథ్వీరాజ్ సుకుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'సలార్' తొలిపార్టు 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. రిలీజ్ సమయం దగ్గర పడుతుండటంతో ప్రభాస్, ప్రశాంత్ అండ్ టీమ్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌తో బిజీగా ఉంటున్నారు. రీసెంట్‌గా 'సలార్: సీజ్‌ఫైర్' సినిమాకు బెంగళూరులో డబ్బింగ్ చెప్పారట ప్రభాస్. ఈ సినిమాలో ఆద్య అనే జర్నలిస్ట్ పాత్రలో శ్రుతీహాసన్ నటిస్తున్నారని ప్రచారం సాగింది. అయితే ఈ చిత్రంలో ఆమెది జర్నలిస్ట్ పాత్ర కాదని, టీచర్ ఆద్య పాత్ర అని తాజాగా తెరపైకి వచ్చింది. కాగా హిందీ, తెలుగు, తమిళంలో మూడు రోజుల్లో మూడు భాషల్లో డబ్బింగ్ చెప్పారు శ్రుతీహాసన్.

చంద్రముఖి 2 విజయం ఆయనకే దక్కుతుంది

– రాఘవ లారెన్స్



● కంగనా రనౌత్, రాఘవ లారెన్స్, సుభాస్కరన్, కీరవాణి, పి.వాసు

''డైరెక్టర్ వాసుగారు నాలుగు దశాబ్దాల అనుభవంలో ఎన్నో గొప్ప సినిమాలు చేశారు. 'చంద్రముఖి 2'ను కూడా గొప్పగా తెరకెక్కించారు.. ఈ సినిమా సాధించే విజయం ఆయనకే దక్కుతుంది'' అని హీరో రాఘవ లారెన్స్ అన్నారు. పి.వాసు దర్శకత్వంలో రాఘవ లారెన్స్ హీరోగా, కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 15న విడుదలవుతోంది. చెన్నైలో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో రాఘవ లారెన్స్ మాట్లాడుతూ–'' నేను నిర్వహిస్తున్న చారిటీ సంస్థకు సుభాస్కరన్‌గారు ఎంతో పెద్ద మనసుతో కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. ఆ డబ్బుతో ఓ స్థలం కొని భవనం కడతాను. ఇకపై నా చారిటీకి డబ్బులు ఇవ్వకండి.. నా చారిటీకి నేను ఉన్నాను. సాయం చేయాలనుకుంటే చాలా చారిటీ సంస్థలు ఉన్నాయి.. వాటికి ఇవ్వండి'' అన్నారు. ''నేను నటిగా కెరీర్ స్టార్ట్ చేసిన ఇన్నేళ్లలో 'చంద్రముఖి 2' వంటి గొప్ప చిత్రం చేయలేదు'' అన్నారు కంగన. ''చంద్రముఖి 2' ని లారెన్స్‌తో చేస్తున్నామని రజనీకాంత్‌గారికి చెప్పగానే.. సినిమా హిట్ అవుతుందని చెప్పారు'' అని పి.వాసు అన్నారు.

ఓటు మన బాధ్యత

హృతిక్ శౌర్య, తన్వి నేగి జంటగా రవి దర్శకత్వం వహించిన చిత్రం 'ఓటు'. ఫ్లిక్ నైన్ స్టూడియోస్‌పై ఫ్లిక్ ఫిలిమ్స్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని నటుడు, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, సినిమా హిట్ కావాలని ఆకాంక్షించారు. ''మన దేశంలో కుల, మత, ప్రాంతీయ అభిప్రాయ బేధాలు లేకుండా జరుపుకునే ఏకైక పండగ.. ఎన్నికల పండగ' అనే డైలాగ్‌తో టీజర్ మొదలవుతుంది. ''మందుకు, నోటుకు ఓటు అమ్మకోవడం కరెక్ట్ కాదు కదా?', 'ఓటు అనేది హక్కు కాదు.. మన బాధ్యత'' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. హృతిక్ శౌర్య మాట్లాడుతూ– ''ఫ్యామిలీ, లవ్ ఎమోషన్స్‌తో పాటు చాలా ముఖ్యమైన కథతో 'ఓటు' రూపొందింది'' అన్నారు. ''మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు తన్వి నేగి. నటుడు గోపరాజు రమణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: అగస్త్య, కెమెరా: ఎస్. రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామకృష్ణ.



● హృతిక్, తన్వి

ఖుషి గొప్ప అనుభూతినిచ్చింది

– హేషమ్ అబ్దుల్ వాహబ్



''ఓ సినిమాకు సంగీతం బాగుంటే ప్రేక్షకులు థియేటర్స్‌కు వస్తారనే నమ్మకం నాకు ఉంది. మంచి సంగీతం కోసం తాపత్రయపడే ఇండస్ట్రీ టాలీవుడ్'' అని సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ అన్నారు. విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా హేషమ్ అబ్దుల్ వాహబ్ మాట్లాడుతూ– ''నేను సంగీతం అందించిన మలయాళ హిట్ ఫిల్మ్ 'హృదయం' విడుదల తర్వాత 'ఖుషి' అవకాశం వచ్చింది. 'ఖుషి' టైటిల్‌సాంగ్‌కు ఎక్కువగా కష్టపడ్డాను. 'నా రోజా నువ్వే..' పాటలో మణిరత్నంగారి సినిమాల టైటిల్స్‌తో లిరిక్స్ ఉండేలా శివ నిర్వాణగారే ప్లాన్ చేసి, ఆయనే లిరిక్స్ కూడా రాశారు. సంగీతం పరంగా విజయ్‌గారు కూడా కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చారు. 'ఖుషి' ప్రయాణం నాకు గొప్ప అనుభూతినిచ్చింది.. విదేశాలకు వెళ్లినా 'ఖుషి' పాటల గురించి మాట్లాడుతున్నారు. ఈ సినిమా మ్యూజికల్ బ్లాక్‌బస్టర్ అవుతుంది. ప్రస్తుతం నాని 'హాయ్ నాన్న', శర్వానంద్ కొత్త సినిమాకు సంగీతం అందిస్తున్నా'' అన్నారు.

రీల్స్

సరికొత్త సికాడా..



● వందన, చందు మొండేటి, శ్రీజిత్

రజిత్ సీఆర్, గాయత్రి మయూర, జైస్ జోస్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సికాడా'. శ్రీజిత్ ఎడవనా దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాని తీర్నా ఫిల్మ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వందనా మీనన్, గోపకుమార్ పి.నిర్మిస్తున్నారు. తెలుగు, కన్నడ, తమిళ్, మలయాళ భాషల్లో రూపొందిన ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని దర్శకుడు చందు మొండేటి, హీరో సోహెల్ విడుదల చేశారు. ''సరికొత్త కథాంశంతో రూపొందిన చిత్రం 'సికాడా'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీజిత్ ఎడవనా.

సూపర్ హీరో



● 'ఏ మాస్టర్ పీస్' పోస్టర్

అరవింద్ కృష్ణ, అషు రెడ్డి జంటగా సుకు పూర్వజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఏ మాస్టర్ పీస్'. శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్న ఈ సినిమా ప్రీ టీజర్‌ను రిలీజ్ చేశారు. సూపర్ హీరోను పరిచయం చేస్తూ స్టన్నింగ్ విజువల్స్, డైలాగ్స్‌తో టీజర్ విడుదలైంది. 'బలమున్న వాడిని పట్టుకోవాలంటే పవర్ కావాలి.. కానీ, నీలా బలం ప్లస్ పవర్ ఉన్నవాడిని పట్టుకోవాలంటే ఎమోషన్ కావాలి..' వంటి డైలాగులు ప్రీ టీజర్‌లో ఉన్నాయి. ''ఏ మాస్టర్ పీస్' న్యూ కాన్సెప్ట్ సూపర్ హీరో మూవీ అనుభూతిని తెలుగు ప్రేక్షకులకు అందించబోతోంది. ప్రస్తుతం మా సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణ తుది దశలో ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

తండ్రీకొడుకుల యాక్షన్



● శాంతి చంద్ర, సిమ్రితి

శాంతి చంద్ర, దీపికా సింగ్, సిమ్రితి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. మూర్తి సాయి అడారి డైరెక్షన్‌లో జి. శాంతిబాబు నిర్మించిన ఈ సినిమా అక్టోబరులో విడుదల కానుంది. ''తండ్రీకొడుకుల యాక్షన్ డ్రామా ఈ చిత్రం. కొడుకు తప్పుడు మార్గంలో వెళ్తున్నాడని గ్రహించిన ఓ తండ్రి ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు? అన్నదే ఈ చిత్ర కథాంశం'' అన్నారు. ''ప్రేక్షకులు మెచ్చుకునే అన్ని అంశాలు మా సినిమాలో ఉన్నాయి'' అన్నారు మూర్తి సాయి. ఈ సినిమాకు సంగీతం: సతీష్.

హలో బేబీ షురూ



● అరోరా శ్రీ

అరోరా శ్రీ టైటిల్ రోల్‌లో 'హలో బేబీ' సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా రాంగోపాల్ రత్నం దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్‌కేఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్‌పై కాండ్రేగుల ఆదినారాయణ నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు యాదకుమార్ క్లాప్ కొట్టారు. ''సరికొత్త కథ, మంచి కథా బలం ఉన్న సినిమా 'హలో బేబీ'' అన్నారు కాండ్రేగుల ఆదినారాయణ, రాంగోపాల్ రత్నం. ''విభిన్నమైన కథా చిత్రమిది. ఇలాంటి సవాల్‌తో కూడుకున్న పాత్ర చేయడం హ్యాపీ'' అన్నారు ఆరోరా శ్రీ. ఈ చిత్రానికి కెమెరా: రమణ, సంగీతం: నితిన్.



ఆసియా క్రీడల్లో టీమిండియా హెడ్ కోచ్‌గా లక్ష్మణ్

జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చైర్మన్, మేటి క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత పురుషుల జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ప్రస్తుతం లక్ష్మణ్ బెంగళూరు శివారు ఆలూరులో వర్ధమాన క్రికెటర్లకు ఏర్పాటు చేసిన హైపెర్ఫార్మెన్స్ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్నాడు. మాజీ ఆల్‌రౌండర్ హృషికేశ్ కనిత్కర్‌కు మహిళల జట్టు తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆసియా క్రీడలు వచ్చే నెల 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలో జరుగుతాయి.

లైల్స్ 'ట్రిపుల్' ధమాకా

కార్ల్ లూయిస్, మౌరిస్ గ్రీన్, టైసన్ గే (అమెరికా), ఉసేన్ బోల్ట్(జమైకా) తర్వాత ఒకే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్ప్రింట్ రేసుల విభాగంలో మూడు స్వర్ణ పతకాలు గెలిచిన ఐదో అథ్లెట్‌గా అమెరికా స్టార్ నోవా గుర్తింపు పొందాడు. ఇప్పటికే 100, 200 మీటర్ల స్ప్రింట్ రేసుల్లో స్వర్ణ పతకాలు గెలిచిన నోవా లైల్స్ 4×100 మీటర్ల రిలేలోనూ బంగారు పతకం సొంతం చేసుకొని దిగ్గజాల సరసన చేరాడు.



వెర్‌స్టాపెన్ రికార్డు

సీజన్‌లో వరుసగా తొమ్మిదో విజయం



జాండ్‌వూర్ట్ (నెదర్లాండ్స్): ఫార్ములావన్ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ 11వ విజయం సాధించాడు. ఆదివారం జరిగిన డచ్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచి ఈ సీజన్‌లో వరుసగా తొమ్మిదో విజయం అందుకున్నాడు. తద్వారా ఫార్ములావన్ చరిత్రలో అత్యధిక వరుస విజయాలు సాధించిన డ్రైవర్‌గా సెబాస్టియన్ వెటెల్ (2013లో వరుసగా 9) పేరిట ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ సమం చేశాడు. వర్షం పలుమార్లు అంతరాయం కలిగించిన ఈ రేసులో నిర్ణీత 72 ల్యాప్‌లను వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా 2 గంటల 24 నిమిషాల 04.411 సెకన్లలో ముగించి అగ్రస్థానం దక్కించుకున్నాడు. అలోన్సో (ఆస్టన్ మార్టిన్) రెండో స్థానంలో, పియరీ గాస్లీ (అల్పైన్) మూడో స్థానంలో నిలిచారు. 22 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 13 రేసులు జరగ్గా 13 రేసుల్లోనూ రెడ్‌బుల్ డ్రైవర్లే విజేతలుగా నిలిచారు. వెర్‌స్టాపెన్ 11 రేసుల్లో గెలుపొందగా, మిగిలిన రెండు రేసుల్లో రెడ్‌బుల్‌కే చెందిన సెర్జియో పెరెజ్ టైటిల్స్ సాధించాడు. ప్రస్తుతం డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో వెర్‌స్టాపెన్ 339 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... పెరెజ్ 201 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. సీజన్‌లోని తదుపరి రేసు ఇటలీ గ్రాండ్‌ప్రి సెప్టెంబర్ 3న జరుగుతుంది.



భారత జట్టు చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, కోచ్ గురుసాయిదత్‌లతో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ కాంస్య పతక విజేత హెచ్‌ఎస్ ప్రణయ్





- జావెలిన్ త్రోలో పసిడి పతకం
- ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం నెగ్గిన తొలి భారతీయ అథ్లెట్‌గా రికార్డు
- ఈటెను 88.17 మీటర్లు విసిరిన భారత స్టార్

నీరజ్ స్వర్ణ చరిత్ర

నాలుగు దశాబ్దాల ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఏ భారతీయ అథ్లెట్‌కు సాధ్యంకాని ఘనతను జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా సాధించాడు. ఈ మెగా ఈవెంట్ చివరిరోజు ఆదివారం నీరజ్ చోప్రా భారత అభిమానుల్లో పసిడి కాంతులు నింపాడు. అందరి అంచనాలను నిజం చేస్తూ నీరజ్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. తద్వారా ఈ ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా కొత్త చరిత్రను లిఖించాడు.

బుడాపెస్ట్ (హంగేరి): భారతీయులు కూడా ఇక సగర్వంగా చెప్పవచ్చు... ప్రపంచ అథ్లెటిక్స్‌లో మాకు ఉన్నాడు ఒక ప్రపంచ చాంపియన్ అని... గత ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం నెగ్గిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈసారి పతకం రంగు మార్చాడు. 'రజత'ధీరుడి నుంచి 'పసిడి'వీరుడిగా మారాడు. ఆదివారం ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నీరజ్ చోప్రా స్వర్ణ పతకం సాధించాడు. నీరజ్ రెండో ప్రయత్నంలో విసిరిన జావెలిన్ అత్యధికంగా 88.17 మీటర్ల దూరం వెళ్లింది. మొత్తం ఆరు ప్రయత్నాల్లో ఈ దూరాన్ని మరో అథ్లెట్ అధిగమించలేకపోయాడు. ఫలితంగా నీరజ్‌కు బంగారు పతకం ఖరారైంది. పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 87.82 మీటర్లతో రజత పతకం దక్కించుకోగా... జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్) 86.67 మీటర్లతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన కిశోర్ కుమార్ జేనా 84.77 మీటర్లతో ఐదో స్థానంలో, మనూ 84.14 మీటర్లతో ఆరో స్థానంలో నిలిచారు.

ఫౌల్‌తో మొదలు...

క్వాలిఫయింగ్‌లో అగ్రస్థానంలో నిలిచిన నీరజ్ చోప్రా ఫైనల్‌ను నిరాశాజనకంగా ప్రారంభించాడు. నీరజ్ తొలి ప్రయత్నమే ఫౌల్ అయింది. దాంతో భారత అభిమానులు కాస్త ఆందోళన చెందారు. కానీ నీరజ్ వెంటనే తేరుకున్నాడు. రెండో ప్రయత్నంలో నీరజ్ జావెలిన్‌ను ఏకంగా 88.17 మీటర్ల దూరం విసిరాడు. ఈ ప్రదర్శనతో నీరజ్ చివరిదైన 12వ స్థానం నుంచి అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. నిర్ణీత ఆరు ప్రయత్నాల వరకు నీరజ్ అగ్రస్థానాన్ని కొనసాగించాడు.

అన్నీ సాధించాడు...

2016లో ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచి వెలుగులోకి వచ్చిన నీరజ్ ఈ ఏడేళ్ల కాలంలో ఇంతింతై వటుడింతై అన్నట్లు ఎదిగాడు. 2017 ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పాల్గొని 15వ స్థానంలో నిలిచిన నీరజ్ ఆ తర్వాత రాటుదేలాడు. అదే ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలిచిన నీరజ్... 2018 ఆసియా క్రీడల్లో, 2018 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ పసిడి పతకాలు సొంతం చేసుకున్నాడు. 2021లో టోక్యో ఒలింపిక్స్‌లో అందరి అంచనాలను తారుమారు చేస్తూ స్వర్ణ పతకం నెగ్గిన ఈ హరియాణా స్టార్ 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం, 2022 ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో స్వర్ణంతో మరింత ఎత్తుకు ఎదిగాడు. అదే జోరును కొనసాగిస్తూ తాజా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకంతో యావత్ భారతాన్ని ఆనందడోలికల్లో ముంచాడు. తాజా స్వర్ణంతో నీరజ్ అథ్లెటిక్స్‌లోని అన్ని మేజర్ ఈవెంట్లలో పతకాలు నెగ్గిన జావెలిన్ త్రోయర్‌గా నిలిచాడు.

భారత రిలే జట్టుకు ఐదో స్థానం

ఆదివారమే జరిగిన పురుషుల 4x400 మీటర్ల రిలే ఫైనల్లో అనస్ యాహియా, అమోజ్ జేకబ్, అజ్మల్, రాజేశ్ రమేశ్‌లతో కూడిన భారత బృందం ఐదో స్థానాన్ని దక్కించుకుంది. భారత బృందం 2 నిమిషాల 59.92 సెకన్లలో గమ్యానికి చేరింది. మరోవైపు మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ ఫైనల్లో భారత అథ్లెట్ పారుల్ చౌదరీ 11వ స్థానంలో నిలిచింది. పారుల్ 9 నిమిషాల 15.31 సెకన్లలో గమ్యానికి చేరి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది.

3 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు లభించిన మొత్తం పతకాలు. 2003లో మహిళల లాంగ్‌జంప్‌లో అంజూ జార్జి కాంస్యం సాధించగా... 2022లో నీరజ్ రజతం, 2023లో నీరజ్ స్వర్ణం గెలిచాడు.

2 ఒలింపిక్స్‌తోపాటు ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ స్వర్ణ పతకాలు గెలిచిన రెండో భారతీయ క్రీడాకారుడు నీరజ్ చోప్రా. గతంలో షూటర్ అభినవ్ బింద్రా ఈ ఘనత సాధించాడు. అభినవ్ బింద్రా 2006 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో పసిడి పతకాలు గెలిచాడు.

చాంప్ రాయలసీమ కింగ్స్

ఫైనల్లో కోస్టల్ రైడర్స్‌పై గెలుపు • ఆంధ్ర ప్రీమియర్ లీగ్



శ్రీకాంత్, వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఏపీఎల్ ట్రోఫీ అందుకుంటున్న కెప్టెన్ విహారి, గిరినాథ్ రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌లో రాయలసీమ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడి వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఫైనల్లో హనుమ విహారి సారథ్యంలోని రాయలసీమ కింగ్స్ ఐదు వికెట్ల తేడాతో గత సీజన్ చాంపియన్ కోస్టల్ రైడర్స్ జట్టును ఓడించింది. వర్షం వల్ల 18 ఓవర్లకు కుదించిన ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన కోస్టల్ రైడర్స్ 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ధరణి కుమార్ (23 బంతుల్లో 30; 5 ఫోర్లు), మద్దిల వర్ధన్ (32 బంతుల్లో 50; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రాయలసీమ బౌలర్లలో షేక్ కమరుద్దీన్ 3, హరిశంకర్ 2 వికెట్లు తీశారు. అనంతరం రాయలసీమ కింగ్స్ 16.3 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ హనుమ విహారి (29 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), బోధల కుమార్ (23 బంతుల్లో 53; 4 ఫోర్లు, 5 సిక్సర్లు) చెలరేగారు. ఆరంభంలో ఓపెనర్ హనీశ్ రెడ్డి (0), వంశీకృష్ణ (3) వికెట్లను కోల్పోయి తడబడిన కింగ్స్‌ను కెప్టెన్ హనుమ విహారి కడదాకా అజేయంగా నిలబడి గెలిపించాడు. శ్రవణ్ (18 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు అండగా నిలువగా... తర్వాత విహారి, కుమార్ నాలుగో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన కుమార్ అర్ధసెంచరీ సాధించాడు. అతని నిష్క్రమణ తర్వాత తేజ రెడ్డి (4) నిరాశపరచగా... గిరినాథ్ రెడ్డి (17 బంతుల్లో 29; 1 ఫోర్, 3 సిక్సర్లు) ఆశిష్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లోని తొలి మూడు బంతులను సిక్స్‌లుగా మలిచి రాయలసీమ కింగ్స్ విజయాన్ని ఖరారు చేశాడు. కోస్టల్ రైడర్స్ బౌలర్లలో స్టీఫెన్, ఆశిష్ రెండేసి వికెట్లు తీశారు. భారత జట్టు మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. తొలుత శ్రీకాంత్ వైఎస్ఆర్ స్టేడియంలో ఏసీఏ పూర్వ కార్యదర్శి ఎస్.వెంకటరావు గేట్‌ను ప్రారంభించారు.

పోటీ ఆ ఇద్దరి మధ్యే!

- టైటిల్ ఫేవరెట్స్‌గా జొకోవిచ్, అల్‌కరాజ్
- నేటి నుంచి యూఎస్ ఓపెన్ టోర్నీ



జొకోవిచ్



అల్‌కరాజ్

న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌కు రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో అందరి దృష్టి పురుషుల సింగిల్స్ విభాగంపైనే ఉంది. టైటిల్ నిలబెట్టుకునేందుకు ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)... 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో చరిత్ర పుటల్లో స్థానం సంపాదించేందుకు నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) పట్టుదలతో ఉన్నారు. జొకోవిచ్ విజేతగా నిలిస్తే... టెన్నిస్ చరిత్రలో అత్యధికంగా 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న రికార్డును సమం చేస్తాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీల్లో టైటిల్ నెగ్గి, వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో అల్‌కరాజ్ చేతిలో ఓడిపోయిన జొకోవిచ్‌కు ఈసారి ఈ స్పెయిన్ స్టార్ నుంచే గట్టిపోటీ ఎదురుకానుంది. కోవిడ్ టీకా వేసుకోని కారణంగా గత ఏడాది జొకోవిచ్ యూఎస్ ఓపెన్‌కు దూరమయ్యాడు. కోవిడ్ వ్యాక్సిన్ నిబంధనలు సడలించడంతో జొకోవిచ్ ఈసారి బరిలోకి దిగుతున్నాడు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

వరంగల్ ఐఎంఎస్‌లో వివిధ పోస్టులు

వరంగల్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్(ఐఎంఎస్)కి చెందిన ఈఎస్ఐ హాస్పిటల్/డిస్పెన్సరీల్లో.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
» **పోస్టుల వివరాలు:** సివిల్ అసిస్టెంట్ సర్జన్-03, డెంటల్ అసిస్టెంట్ సర్జన్-01, ఫార్మసిస్ట్-05.
» **వేతనం:** నెలకు సీఏఎస్/డీఏఎస్ రూ.58,850, ఫార్మసిస్ట్ రూ.31,040.
» **అర్హత:** ఎంబీబీఎస్, బీడీఎస్, డీఫార్మసీ, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది జాయింట్ డైరెక్టర్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, ఈఎస్ఐ హాస్పిటల్ క్యాంపస్, నర్సంపేట్ రోడ్, వరంగల్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరి తేది:** 28.08.2023.
» **వెబ్‌సైట్:** peddapalli.telangana.gov.in

ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, బెంగళూరులో 100 పోస్టులు

బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ).. ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **విభాగాలు:** మెకానికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్ఫోసైన్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్/ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.39,370 నుంచి రూ.46,990 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలి.
» **ఇంటర్వ్యూ వేదిక:** ఏడీఏ క్యాంపస్ 2, సురంజన్ దాస్ రోడ్, న్యూథిప్పసంద్ర పోస్ట్, బెంగళూరు-560075.
» **ఇంటర్వ్యూ తేది:** 04.09.2023, 07.09.2023, 11.09.2023, 14.09.2023. » **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 8.30 నుంచి 11 వరకు.
» **వెబ్‌సైట్:** www.ada.gov.in

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ నర్సింగ్ (బీఎస్సీ నర్సింగ్).
» **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
» **అర్హత:** ఇంటర్మీడియట్(బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ) లేదా ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. టీఎస్ ఎంసెట్-2023 ర్యాంకు సాధించి ఉండాలి. **వయసు:** 31.12.2023 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** టీఎస్ ఎంసెట్-2023 ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2023
» **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in

ఐఐటీ తిరుపతిలో 24 నాన్‌టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), తిరుపతి..డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ లైబ్రేరియన్-01,డిప్యూటీ రిజిస్ట్రార్-01, జూనియర్ సూపరింటెండెంట్-02, జూనియర్ అసిస్టెంట్-08, జూనియర్ హిందీ అసిస్టెంట్ గ్రేడ్1-01, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-02, జూనియర్ టెక్నీషియన్-08, ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ,ఆబ్జెక్టివ్-బేస్డ్ టెస్ట్, రాతపరీక్ష, స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.09.2023
» **వెబ్‌సైట్:** iittp.ac.in

ఐఐటీ ధన్‌బాద్‌లో ఇంజనీర్ పోస్టులు

ధన్‌బాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ సిస్టమ్స్ ఇంజనీర్.
» **విభాగాలు:** సిస్టమ్ అడ్మిన్, హెచ్‌పీసీ అండ్ క్లౌడ్ మేనేజ్‌మెంట్, నెట్‌వర్క్ అడ్మిన్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీటెక్/ఎంఎస్సీ/ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 40 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2023
» **వెబ్‌సైట్:** https://www.iitism.ac.in

ఐఐటీల్లో కోర్సు, పీఎస్‌యూ కొలువు @ గేట్

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్.. సంక్షిప్తంగా..గేట్! ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ + పీహెచ్‌డీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! దీంతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో(పీఎస్‌యూ).. ఎంట్రీ లెవల్‌లో ఇంజనీర్ ఉద్యోగాలకు సైతం గేట్ స్కోర్ ప్రామాణికంగా నిలుస్తోంది!! అందుకే ఏటా దేశవ్యాప్తంగా లక్షల మంది ఈ పరీక్షకు హాజరవుతున్నారు. ఇటీవల గేట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. గేట్‌తో ప్రయోజనాలు, పరీక్ష విధానం, కొత్త మార్పులు, సిలబస్ విశ్లేషణతోపాటు పరీక్షలో విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

గేట్ పరీక్షలో ప్రతి ఏటా ఏదో ఒక మార్పు కనిపిస్తోంది. ఈ ఏడాది కొత్తగా డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేపర్‌ను ప్రవేశ పెట్టారు. దీంతో.. గేట్ పేపర్ల సంఖ్య 30కి చేరింది. పలు ఐఐటీలు ఎంటెక్ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ ప్రోగ్రామ్‌లను అందిస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని.. కొత్తగా ఈ పేపర్‌ను ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది.

» గేట్ 2024 ప్రకటన విడుదల
» మొత్తం 30 పేపర్లలో గేట్ పరీక్ష
» కొత్తగా డేటా సైన్స్ అండ్ ఏఐ పేపర్
» రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం

అర్హతలు

బీటెక్, బీఈ, బీఆర్క్, బీఎస్సీ, బీకాం, బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. అదేవిధంగా ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా గేట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. నాలుగేళ్ల కోర్సులు చదువుతున్న విద్యార్థులు మూడో సంవత్సరం నుంచే గేట్‌కు దరఖాస్తు చేసుకునే వీలుంది.

రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం

గేట్-2024 నుంచి రెండు పేపర్లకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థులు తమ అర్హతకు అనుగుణంగా ఏదైనా ఒక పేపర్‌కు మాత్రమే హాజరయ్యే పరిస్థితి ఉండేది. తాజా మార్పుతో ఇకపై తమ అర్హతలకు సరితూగే రెండు పేపర్లలో పరీక్షకు హాజరు కావచ్చు. గేట్ నిర్వాహక కమిటీ నిర్దేశించిన నిబంధనలను అనుసరిస్తూ.. నిర్దిష్ట కాంబినేషన్స్‌లోనే పేపర్లను ఎంచుకోవాల్సి ఉంటుంది.

పరీక్ష గతంలో మాదిరిగానే

- ఈ ఏడాది గేట్ పరీక్ష విధానంలో ఎలాంటి మార్పులు లేదు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.
- గేట్ పరీక్ష పార్ట్-1, పార్ట్-2 పేరుతో రెండు విభాగాల్లో వంద మార్కులకు ఉంటుంది. మొత్తం 65 ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్-1లో జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగానికి 15 మార్కులు కేటాయిస్తారు. ఒక మార్కు ప్రశ్నలు అయిదు, రెండు మార్కుల ప్రశ్నలు అయిదు ఉంటాయి.
- పార్ట్-2లో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్‌లో 55 ప్రశ్నలు అడుగుతారు. ఇందులోనే ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ నుంచి కూడా 13 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఒక మార్కు ప్రశ్నలు 25, రెండు మార్కుల ప్రశ్నలు 30 ఉంటాయి.

మూడు రకాలుగా ప్రశ్నలు

గేట్‌లో ప్రశ్నలను మూడు విధాలుగా అడుగుతారు. అవి.. ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్, మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్(ఎంఎస్‌క్యూ), న్యూమరికల్ ఆన్సర్ టైప్ (ఎన్ఏటీ) ప్రశ్నలు ఉంటాయి. ఎంసీక్యూ విధానంలో నాలుగు లేదా అయిదు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాల్సి ఉంటుంది. మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్ విధానంలో అడిగే ప్రశ్నలకు.. ఒకటి కంటే ఎక్కువ ఆప్షన్లు సమాధానంగా ఉంటాయి. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం గుర్తించాలంటే.. సంబంధిత టాపిక్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగుండాలి. న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు కొంత కాలిక్యులేషన్స్‌తో కూడినవిగా ఉంటాయి.

గేట్‌తో ప్రయోజనాలెన్నో

గేట్ స్కోర్ ఆధారంగా ఆయా విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీలో ప్రవేశాలు ఖరారు చేసుకున్న వారికి పలు ప్రయోజనాలు లభిస్తున్నాయి. ఎంటెక్ వంటి పీజీ ప్రోగ్రామ్‌లో అడుగుపెడితే నెలకు రూ.12,400 స్టయిఫండ్, పీహెచ్‌డీలో చేరితే నెలకు రూ.28 వేల స్కాలర్‌షిప్ అందుతుంది. రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో పీజీలో ప్రవేశాలకు సంబంధించి గేట్ ఉత్తీర్ణులకు తొలి ప్రాధాన్యం ఇస్తారు.



పీఎస్‌యూ జాబ్స్

గేట్ స్కోర్ ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలను సైతం సొంతం చేసుకోవచ్చు. గత కొన్నేళ్లుగా నవరత్న, మహారత్న, మినీరత్న వంటి హోదా పొందిన పబ్లిక్ సెక్టార్ యూనిట్స్(పీఎస్‌యూ).. గేట్ స్కోర్ ఆధారంగా ఎగ్జిక్యూటివ్ ట్రైనీ, గ్రాడ్యుయేట్ ఇంజనీర్ వంటి పోస్టులను భర్తీ చేస్తున్నాయి. అభ్యర్థులు ఆయా సంస్థల నోటిఫికేషన్స్‌కు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసి తదుపరి దశలో గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. తుది ఎంపికలో గేట్ స్కోర్‌కు, జీడీ/జీటీలకు నిర్దేశిత వెయిటేజీ కల్పిస్తున్నాయి. గేట్ స్కోర్‌కు 75 శాతం వెయిటేజీ; గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్‌లకు గరిష్టంగా పది శాతం; పర్సనల్ ఇంటర్వ్యూకు 15 శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి. మరికొన్ని పీఎస్‌యూలు గేట్ స్కోర్‌కు 60 నుంచి 65 శాతం వెయిటేజీ కేటాయిస్తున్నాయి.

జీడీ/ఇంటర్వ్యూ ఇలా

- పీఎస్‌యూలు మలి దశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్‌లో ప్రతి అభ్యర్థికి సగటున అయిదు నుంచి ఆరు నిమిషాల సమయం లభిస్తుంది. ఈ సమయంలోనే అభ్యర్థులు సదరు టాపిక్‌పై తమ అభిప్రాయాలను తెలపాల్సి ఉంటుంది. గ్రూప్ టాస్క్ విధానంలో ఒక వాస్తవ సమస్యను అభ్యర్థుల ముందుంచి.. సమస్యకు పరిష్కారం కనుక్కోవాలని సూచిస్తున్నారు.
- పీఎస్‌యూల ఎంపిక ప్రక్రియలో చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ. గ్రూప్ డిస్కషన్ లేదా గ్రూప్ టాస్క్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్ నాలెడ్జ్‌లను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు.

ఐఐటీల్లోనూ మలిదశ

ఐఐటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ వంటి ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గేట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఐఐటీలు సైతం మలి దశలో గ్రూప్ టాస్క్, గ్రూప్ డిస్కషన్స్ పేరిట పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కొన్ని ఐఐటీలు రిటెన్ ఎస్సేలు నిర్వహించే విధానాన్ని కూడా అనుసరిస్తున్నాయి. వీటిలో విజయం సాధించిన వారికే సీట్ల ఖరారు అవుతున్నాయి.

కటాఫ్ పెరుగుతోంది

ఐఐటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ + పీహెచ్‌డీల్లో ప్రవేశం, అదే విధంగా పీఎస్‌యూ కొలువులకు షార్ట్ లిస్టింగ్ క్రమంలో గేట్ స్కోర్ కటాఫ్‌లు క్రమేణా పెరుగుతున్నాయి. జనరల్ కేటగిరీలో 750 నుంచి 800 స్కోర్, రిజర్వ్‌డ్ కేటగిరీలో 500 నుంచి 600 స్కోర్ సాధిస్తేనే మలి దశకు అవకాశం లభిస్తుంది.

మంచి స్కోర్‌కు మార్గం

ఎంచుకున్న సబ్జెక్ట్‌లో బేసిక్స్ నుంచి అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ వరకూ.. పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి టాపిక్‌ను చదివేటప్పుడు ప్రశ్నార్థమైన అంశాలను గుర్తించడంతోపాటు దానికి సంబంధించి ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఒక టాపిక్ నుంచి ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో గుర్తించి సాధన చేయాలి. గేట్ సిలబస్‌ను అకడమిక్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. వీక్లీ టెస్టులు,మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి. ఈ అప్రోచ్ విజయ సాధనలో ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది.

ప్రాధాన్యతను గుర్తిస్తూ

అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లోని టాపిక్స్‌కు లభిస్తున్న వెయిటేజ్, అకడమిక్‌గా ఉన్న ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారానికి ప్రిపరేషన్ పూర్తి చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఆ తర్వాత ఉన్న వ్యవధిలో ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరయ్యే విధంగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇలా ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో అడుగులు వేస్తే.. పరీక్షల్లో మంచి స్కోర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఆగస్ట్ 30 – సెప్టెంబర్ 29, 2023
- **ఆలస్య రుసుముతో చివరి తేదీ:** అక్టోబర్ 13, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** అక్టోబర్ 7 – 11, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** జనవరి 3, 2024
- **గేట్-2024 తేదీలు:** 2024 ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో (ప్రతి రోజు రెండు సెషన్లు. మొదటి సెషన్ ఉదయం 9-12, మధ్యాహ్నం సెషన్ 2-5 వరకు)
- **ఫలితాల వెల్లడి:** మార్చి 16, 2024
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://gate2024.iisc.ac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
366	121
64,887	19,266

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,591	△	127
డోజోన్స్	34,347	△	247
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,339	△	5
డాక్స్	15,632	△	10
షాంఘై	3,064	▽	18
నికాయ్	31,624	▽	663

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.27	83.94
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.61	107.01
€	యూరో	ఎస్‌బీఐ	89.29	92.44
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.46	58.22
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.65	54.95
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.35	62.31
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.98	22.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.50	23.29
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.46

బీమా పాలసీని వెనక్కి ఇచ్చేస్తే..?





విష్ణు స్వరూప్ (30) పేరిట రెండు జీవిత బీమా ఎండోమెంట్ పాలసీలు ఉన్నాయి. ఆరేళ్ల క్రితం తనకు ఉద్యోగం వచ్చిన కొత్తలో ఆ పాలసీలను విష్ణు పేరిట ఆయన తండ్రి ప్రారంభించారు. వీటి కోసం ఏటా రూ.50,000 ప్రీమియంను విష్ణు స్వయంగా చెల్లిస్తున్నారు. ఈ రెండింటి రూపంలో వస్తున్న బీమా రక్షణ రూ.10 లక్షలు. కాల వ్యవధి 20 ఏళ్లు. ఎందుకోగానీ తాను తీసుకున్న బీమా ఉత్పత్తులు తగినంత రక్షణ ఇవ్వడం లేదన్న అభిప్రాయం అతడిలో కలిగింది. దీంతో ఓ ఆర్థిక సలహాదారుడిని సంప్రదించాడు. పాలసీల పూర్తి వివరాలు, విష్ణు ఆదాయం, జీవిత లక్ష్యాలన్నింటినీ సమగ్రంగా విశ్లేషించిన అనంతరం.. వెంటనే సదరు రెండు ఎండోమెంట్ పాలసీలను సరెండ్ చేసేయాలని ఫైనాన్షియల్ అడ్వైజర్ సూచించారు. నిపుణుడిని సంప్రదిస్తే కానీ, ఆ పాలసీల వల్ల పెద్దగా ప్రయోజనం లేదన్న విషయం అతడికి బోధపడలేదు. విష్ణు మాదిరే ఎండోమెంట్ పాలసీలకు భారీ ప్రీమియం చెల్లించే వారు మన చుట్టూ ఎంతో మంది ఉన్నారు. అలాంటి ప్రతి ఒక్కరూ ఒక్కసారి తమ ప్లాన్‌ను సమీక్షించుకోవాల్సిన అవసరం అయితే ఉంది.

- ఎండోమెంట్ ప్లాన్‌లో రాబడి శూన్యం
- బీమా రక్షణ కొద్ది మాత్రమే
- దీనికి ప్రత్యామ్నాయం టర్మ్ ప్లాన్
- తక్కువ ప్రీమియంతో మెరుగైన రక్షణ
- ఎండోమెంట్ ప్లాన్‌ను వెనక్కి ఇచ్చేయొచ్చు
- పాలసీని సరెండర్ చేయడమే మార్గం
- లేదంటే పాలసీ పెయిడప్ చేసుకోవచ్చు

నిన్న మొన్నటి వరకు జీవిత బీమా అంటే ఎక్కువ మందికి తెలిసింది ఎండోమెంట్ పాలసీల గురించే. టర్మ్ ఇన్సూరెన్స్ ఇటీవలి కాలంలోనే ఆదరణను, ప్రాధాన్యాన్ని సంతరించుకుంటోంది. ఎండోమెంట్ పాలసీలు గతంలో ప్రజల సహజ పొదుపు మనస్తత్వం కోణం నుంచి అభివృద్ధి చేసినవి. అంతేకానీ, అచ్చమైన బీమా రక్షణ కోసం కావు. పెట్టుబడుల సాధనాలు, రాబడులపై అవగాహన విస్తృతమవుతున్న కొద్దీ, టర్మ్ పాలసీల ప్రాధాన్యం తెలిసి వస్తోంది. ఈ రెండింటి మధ్య వ్యత్యాసం గురించి క్లుప్తంగా చెప్పుకోవాలంటే.. పాలసీ హోల్డర్ దురదృష్టవశాత్తూ మరణిస్తే కుటుంబానికి మెరుగైన పరిహారం ఇచ్చి ఆదుకునేవి టర్మ్ ప్లాన్లు. కాల వ్యవధి ముగిసే రోజు వరకు జీవించి ఉంటే రూపాయి తిరిగి రాదు. దీనికి భిన్నంగా.. పాలసీ కాల వ్యవధిలో మరణించినా లేక పాలసీ గడువు ముగిసే వరకు జీవించి ఉన్నా.. ఈ రెండు సందర్భాల్లోనూ ఎంతో కొంత ముట్టజెప్పేవి ఎండోమెంట్ ప్లాన్లు. ఇవి తక్కువ బీమా రక్షణ, తక్కువ రాబడితో కూడినవి. బీమా ఏజెంట్లు ఎండోమెంట్ ప్లాన్ల విక్రయానికే ఎక్కువగా మొగ్గు చూపిస్తుంటారు. దీనిపై వారికి లభించే కమీషన్ ఎక్కువగా ఉంటుంది. మొదటి ఏడాది ప్రీమియంలో 10–25 శాతం వరకు వారికి కమీషన్‌గా ముడుతుంది. అంతేకాదు రెండో సంవత్సరం నుంచి పాలసీ ముగిసే వరకు ఏటా ప్రీమియంపై 5–7 శాతం కమీషన్‌గా ఏజెంట్లకు ఆదాయం వస్తూనే ఉంటుంది. టర్మ్ ప్లాన్ల పైనే ఇదే స్థాయిలో కమీషన్ ఉంటుంది. కాకపోతే టర్మ్ పాలసీల ప్రీమియం తక్కువ కనుక కమీషన్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. దేశ వాసుల్లో చాలా మందికి ఎండోమెంట్ ప్లాన్లే ఉన్నాయి. తెలిసిన ఏజెంట్ బలవంతం పెట్టాడని, స్నేహితులు, బంధువులు సూచించారని చెప్పి వీటిని తీసుకోవడం కనిపిస్తుంది. చెల్లిస్తున్న ప్రీమియానికి మెరుగైన బీమా రక్షణ ఇవ్వని, ప్రీమియం భారంతో కూడిన ఇలాంటి ఎండోమెంట్ ప్లాన్లను వదిలించుకునే మార్గం ఉంది. సరెండర్ చేసేయడమే..

ఎందుకు సరెండర్ చేయాలి..?

తాము తీసుకున్న జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్‌లో తగినంత కవరేజీ లేదని, ప్రీమియం ఎక్కువగా ఉందని అనిపిస్తే దాన్ని నిలిపివేయడంలో ఎలాంటి తప్పు లేదు. జీవిత బీమా ప్లాన్ తీసుకునేది ఎందుకు..? తమకు ఏదైనా జరిగితే కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పాలు కాకూడదనే. తమపై ఆధారపడిన వారు, అసాధారణ సందర్భాల్లో కష్టాలు పడకూడదంటే అందుకు తగినంత కవరేజీతో లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉండాల్సిందే. పిల్లల విద్య ఆగిపోకూడదు. వారి రోజువారీ జీవనం, ఇతర వ్యయాలు అన్నింటినీ జీవిత బీమా పరిహారం ఆదుకునే విధంగా ఉండాలి. అందుకే వార్షిక ఆదాయానికి ఎంతలేదన్నా కనీసం పది రెట్ల మేరకు బీమా కవరేజీ తీసుకోవాలన్నది నిపుణుల సూచన. విష్ణు స్వరూప్‌నే ఉదాహరణగా తీసుకుందాం. అతడు రూ.10 లక్షల కవరేజీ కోసం ఏటా రూ.50వేలు చెల్లిస్తున్నాడు. కానీ, కేవలం రూ.20 వేల వార్షిక ప్రీమియం చెల్లించడం ద్వారా విష్ణు రూ.1.5 కోట్ల టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు. ఫైనాన్షియల్ అడ్వైజర్ సలహాతో విష్ణు అదే పనిచేశాడు. ఉన్న ఎండోమెంట్ ప్లాన్లను సరెండ్ చేశాడు. రూ.1.5 కోట్ల టర్మ్‌ప్లాన్ తీసుకున్నాడు. 30 ఏళ్ల ఆరోగ్యవంతుడైన వ్యక్తి రూ.కోటి సమ్ అష్యూరెన్స్‌తో టర్మ్ ప్లాన్ తీసుకుంటే వార్షిక ప్రీమియం రూ.25,000. ఎండోమెంట్ పాలసీల్లో బీమా రక్షణతోపాటు, ఎంతో కొంత రాబడి ఉంటుందన్నది చాలా మంది అభిప్రాయం. కానీ, ఇందులో వాస్తవం ఏంటన్నది పాలసీదారులకు తప్పకుండా తెలిసి ఉండాలి. ఎండోమెంట్ ప్లాన్లలో రాబడి 4.5–5.5 శాతం మించి ఉండదు. అరుదైన సందర్భాల్లోనే రాబడి 6 శాతం ఉంటుంది. కానీ ద్రవ్యోల్బణం కూడా దీర్ఘకాల సగటు అదే స్థాయిలో ఉంది. దీంతో నికరంగా వచ్చే రాబడి ఏమీ ఉండదు. ఉదాహరణకు రూ.10 లక్షల సమ్ అష్యూరెన్స్‌తో ఎండోమెంట్ ప్లాన్ తీసుకున్నారని అనుకుందాం. సమ్ అష్యూర్డ్‌పై ఏటా 5 శాతం సింపుల్ గ్యారంటీడ్ అడిషన్ వస్తుంది. ఈ పాలసీలో మెచ్యూరిటీ కింద రూ.21 లక్షలు వస్తుంది. రాబడి రేటు 6.22 శాతం. ద్రవ్యోల్బణం 6 శాతం (సగటున) మినహాయిస్తే నికర రాబడి 0.22 శాతమే. అదే ఈక్విటీ పథకాల్లో దీర్ఘకాలానికి ఇన్వెస్ట్ చేస్తే రాబడి వార్షికంగా 10–12 శాతం లేదా అంతకంటే ఎక్కువే ఉంటుంది. డెట్ సాధనాల్లోనూ 7 శాతం మేర రాబడి వస్తుంది.

పాలసీని నిలిపివేస్తే..?



ఎండోమెంట్ ప్లాన్ గురించి ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత, ఇక వద్దనుకుంటే పాలసీదారుల ముందు రెండు ఆప్షన్లు ఉన్నాయి. అప్పటి నుంచి ప్రీమియం చెల్లించకుండా ఉండిపోవడం. లేదంటే పాలసీని సరెండర్ చేయడమే సరైనది. పాలసీలో కవరేజీ, రాబడి ఆకర్షణీయంగా లేదని అసంతృప్తిగా ఉంటే అప్పటి నుంచి ప్రీమియం చెల్లించకుండా ఆగిపోవచ్చు. కాల వ్యవధి తర్వాత ఫండ్ వెనక్కి వస్తుంది. దీన్నే పాలసీ పెయిడప్ అని అంటారు. మెచ్యూరిటీ తర్వాత ఎంత వస్తుందన్నది బీమా సంస్థ చెబుతుంది. అంతేకాదు, జీవిత బీమా కవరేజీ కూడా కొనసాగుతుంది. కాకపోతే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంకు అనుగుణంగా జీవిత బీమా కవరేజీని తగ్గిస్తారు. ఉదాహరణకు రూ.10 లక్షల సమ్ అష్యూర్డ్ పాలసీని 20 ఏళ్ల కాలానికి తీసుకుని, ఐదేళ్ల పాటు ప్రీమియం చెల్లించారని అనుకుందాం. అప్పుడు రూ.10 లక్షలకు బదులు రూ.2.5 లక్షల జీవిత బీమా కవరేజీ కాల వ్యవధి ముగిసే వరకు లభిస్తుంది. పెయిడప్ చేసే నాటికి జమ అయిన గ్యారంటీడ్ అడిషన్స్, బోనస్‌లు కలిపి పెయిడప్ వ్యాల్యూని నిర్ణయిస్తారు.

సరెండర్ చేస్తే..?

పాలసీ కాల వ్యవధి ముగియకముందే దాన్నుంచి వైదొలగాలని అనుకుంటే, సరెండర్ వేల్యూని వెనక్కి పొందొచ్చు. అప్పటి వరకు ఎన్నేళ్లపాటు ప్రీమియం చెల్లించారు, ఎంత చెల్లించారు, బోనస్, పెయిడప్ వేల్యూ ఆధారంగా సరెండర్ వేల్యూ ఎంతన్నది ఉంటుంది. ఇందుకు సరెండర్ వేల్యూ ఫ్యాక్టర్ చార్ట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. సరెండర్ ఫ్యాక్టర్ 35 శాతం అనుకుంటే.. రూ.10 లక్షల పాలసీలో రూ.3.5 లక్షలు పాలసీదారునికి దక్కుతుంది. పాలసీ తీసుకుని కాల వ్యవధి పెరుగుతూ వెళుతున్న కొద్దీ, ఈ సరెండర్ వేల్యూ ఫ్యాక్టర్ 70 శాతం వరకు చేరుతుంది. ''కాల వ్యవధికి ముందే పాలసీని సరెండర్ చేస్తే తీవ్రంగా నష్టపోవాలి. సరెండర్ ఫీజుల రూపంలో అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంలో గణనీయమైన మొత్తాన్ని కోల్పోతారు. కొన్ని కేసుల్లో బోనస్ వంటివి కూడా రావు. కనుక పాలసీ నియమ, నిబంధనలను చదివి అర్థం చేసుకోవాలి''అని ఫైనాన్షియల్ ప్లానింగ్ సంస్థ 'ఫైనాన్షియల్ స్మార్ట్' సీఈవో నీతా మెనెజెస్ సూచించారు. సరెండర్ వేల్యూ విషయంలో బీమా సంస్థల మధ్య ఏకరూపత కనిపించదు. కొన్ని బీమా సంస్థలు ప్రత్యేకమైన సరెండర్ వేల్యూ ఫ్యాక్టర్‌చార్ట్‌లను ఉపయోగిస్తున్నాయి. కొన్ని సంస్థల్లో అయితే చాలా దారుణంగా, నామమాత్రంగా సరెండర్ వేల్యూని నిర్ణయిస్తున్నారు. అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం ఆధారంగా సరెండర్ వేల్యూని కొన్ని ఖరారు చేస్తున్నాయి.

సరెండర్ చేస్తే ఎంతొస్తుంది?

సమ్ అష్యూర్డ్:	రూ.10లక్షలు
పాలసీ కాల వ్యవధి:	20 ఏళ్లు
వార్షిక ప్రీమియం:	రూ.50వేలు
బోనస్ అడిషన్ ఏటా:	రూ.50వేలు

సరెండర్ కాల వ్యవధి	5ఏళ్ల తర్వాత	10 ఏళ్ల తర్వాత	15 ఏళ్ల తర్వాత
పెయిడప్ వేల్యూ (రూ.లక్షల్లో)	5	10	15
సరెండర్ వేల్యూ ఫ్యాక్టర్ (శాతంలో)	35	50	70
సరెండర్ వేల్యూ (రూ.లక్షల్లో)	1.75	5	10.50

సరెండర్ ఎప్పుడు చేయాలి?




బీమా పాలసీల్లో సరెండర్ పెనాల్టీ ఎంతో ఎక్కువగా ఉంటుందని భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ కస్టమర్ ఆఫీసర్ నితిన్ మెహతా తెలిపారు. పాలసీ సరెండర్ చేయడానికి ముందే, ఎదురయ్యే ఆర్థిక ప్రతికూలతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అందుకుని సరెండర్ చేసే ముందు ఎంత వస్తుందన్నది తెలుసుకోవాలి. ఎండోమెంట్ ప్లాన్‌కు ప్రీమియం ఇక చెల్లించడం కష్టంగా ఉందని భావిస్తే అప్పుడు సరెండర్ చేస్తే ఎంతొస్తుంది? పెయిడప్‌గా మారిస్తే గడువు ముగిసిన తర్వాత ఎంతొస్తుందన్నది విశ్లేషించుకోవాలి. సరెండర్ చేసినా లేక పెయిడప్ చేసినా.. అదే సమయంలో టర్మ్ ప్లాన్ తీసుకోవడం తప్పనిసరి. లేదంటే అసలు లక్ష్యమే దెబ్బతింటుంది. రూ.10 లక్షల సమ్ అష్యూర్డ్ పాలసీని 20 ఏళ్ల కాలానికి తీసుకున్నారు. 5 ఏళ్ల పాటు ఏటా రూ.50,000 చొప్పున ప్రీమియం చెల్లించిన తర్వాత సరెండర్ చేసేయాలని నిర్ణయించారు. దీంతో అప్పటి నుంచి ఏటా రూ.50,000 ప్రీమియం రూపంలో ఆదా అవుతుంది. అప్పుడు ఏటా రూ.20,000 ప్రీమియంపై రూ.కోటి టర్మ్ ప్లాన్ తీసుకోవాలి. మిగిలిన రూ.30వేలను ఇండెక్స్ ఫండ్స్‌లో సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. ఇలా చేస్తే ఏటా 12 శాతం సగటు రాబడి అంచనా ఆధారంగా 15 ఏళ్ల తర్వాత రూ.12.50 లక్షలు సమకూరుతుంది. ఐదేళ్ల తర్వాత సరెండర్ చేయడం వల్ల వచ్చిన మొత్తాన్ని తీసుకెళ్లి ఇండెక్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల అది కూడా ఏటా 12 శాతం చొప్పున 15 ఏళ్లలో వృద్ధి చెందుతుంది. బీమా, పెట్టుబడిని కలిపి చూడకూడదు. అచ్చమైన బీమా రక్షణ ఏర్పాటు చేసుకోవడానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. మంచి రాబడి కోసం మేలైన పెట్టుబడి సాధనాలను ఎంపిక చేసుకోవాలి.

మరిన్ని ఫీచర్లతో ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్

న్యూఢిల్లీ: ఆదాయపన్ను శాఖ ఆధునికీకరించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. యూజర్లకు మరింత సౌకర్యంగా, విలువ ఆధారిత సదుపాయాలతో దీన్ని రూపొందించినట్టు ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) ప్రకటించింది. సీబీడీటీ చైర్మన్ నితిన్ గుప్తా ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.'కొత్త టెక్నాలజీకి అనుగుణంగా ఉండేందుకు, పన్ను చెల్లింపుదారులకు మెరుగైన అనుభవం కోసం ఐటీ శాఖ వెబ్‌సైట్ www.incometaxindia.gov.in ను యూజర్లకు అనుకూల ఇంటర్‌ఫేస్, విలువ ఆధారిత ఫీచర్లతో పునరుద్ధరించింది'అని సీబీడీటీ పేర్కొంది.

ధోనీ జెడ్ బ్లాక్ అగరబత్తి టీవీసీ యాడ్ విడుదల



హైదరాబాద్: జెడ్ బ్లాక్ బ్రాండ్ పేరుతో 3–ఇన్–1 అగరబత్తులను విక్రయిస్తున్న మైసూర్ డీప్ పెర్‌ఫ్యూమరీ హౌజ్ (ఎండీపీహెచ్) భారత మాజీ క్రికెట్ కెప్టెన్ ఎంఎస్ ధోనితో ఒక టీవీ కమర్షియల్ (టీవీసీ) ప్రచార యాడ్‌ను విడుదల చేసింది. రోజువారీ ప్రార్థనల ప్రాముఖ్యతను 'మన్ కీ శాంతి' పేరిట దీనిని రూపొందించినట్లు ఎండీపీహెచ్, జెడ్ బ్లాక్ డైరెక్టర్ అంకిత్ అగర్వాల్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జెడ్ బ్లాక్‌కు ఆరేళ్లుగా బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ధోని మరోసారి మా ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం గౌరవంగా భావిస్తున్నామని కంపెనీ డైరెక్టర్ అన్షుల్ అగర్వాల్ వెల్లడించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-8-2023	
విశాఖ	480–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
27-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435–00
వరంగల్	437–00
రిటైల్ ధర	4.95

సాక్షి స్టాక్స్

నోసిల్ | హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 212 టార్గెట్: రూ. 267



ఎందుకంటే: విభిన్న రబ్బర్ కెమికల్స్ తయారీ కంపెనీ నోసిల్‌కు రూ. 267 టార్గెట్ ధరను అంచనా వేస్తున్నాం. సామర్థ్య వినియోగాన్ని పెంచుకునే అవకాశాలు, ప్రత్యేకించిన రబ్బర్ కెమికల్స్ తయారీపై దృష్టి సారించడం ద్వారా మార్జిన్లను మెరుగుపరచుకోనున్న అంచనాలు ఇందుకు కారణమయ్యాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో మా అంచనాలకంటే 10 శాతం తక్కువగా నిర్వహణ లాభం(ఇబిటా), 5 శాతం తక్కువగా నికర లాభం ప్రకటించింది. ఇందుకు ఆదాయం 8 శాతం క్షీణించడం ప్రభావం చూపింది. మరోవైపు అంచనాలకుమించిన ఇతర వ్యయాలు, పన్ను చెల్లింపులు ఇందుకు జత కలిశాయి. అయినప్పటికీ అంచనాలకంటే ముడివ్యయాల భారం తగ్గడంతో పాటు.. ఇతర ఆదాయం పెరగడం లాభదాయకతకు కొంతమేర మద్దతిచ్చాయి. త్రైమాసికవారీగా(క్యూ4తో) చూస్తే ఏప్రిల్–జూన్(క్యూ1)లో మొత్తం ఆదాయం చెప్పుకోదగ్గ వృద్ధిలేకుండా రూ. 400 కోట్లుగా నమోదైంది. క్యూ4(జనవరి–మార్చి)తో పోల్చితే అమ్మకాల పరిమాణం 2 శాతం నీరసించగా.. ఉత్పత్తుల ధరలు(రియలైజేషన్స్) 2 శాతం మెరుగుపడ్డాయి. యూరోపియన్ మార్కెట్లో మాంద్య పరిస్థితుల కారణంగా ఎగుమతుల పరిమాణం వెనకడుగు వేసింది. దేశీయంగా బలమైన డిమాండ్ కొనసాగుతోంది. ఆసియా, అమెరికా మార్కెట్లలోనూ పటిష్ట డిమాండ్ కనిపిస్తోంది. ఈ ఏడాది క్యూ1లో సామర్థ్య వినియోగం 65 శాతానికే పరిమితమైంది. మొత్తం అమ్మకాల పరిమాణంలో స్పెషాలిటీ కెమికల్స్ వాటా 25 శాతంగా నమోదైంది.

అలెంబిక్ ఫార్మా | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 753 టార్గెట్: రూ. 875




ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో మా అంచనాలను మించుతూ అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ ఆదాయం 4 శాతం పుంజుకుంది. ఇందుకు నాన్‌యూఎస్ ఫార్ములేషన్లు, ఏపీఐ విక్రయాలు దోహదపడ్డాయి. అయితే కొత్త ప్లాంట్ల ఏర్పాటుతో పెరిగిన వ్యయాలు(రూ. 60–65 కోట్లు) నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు బలహీనపడ్డాయి. నికర లాభం మాత్రం 19 శాతం ఎగసింది. ఇందుకు ప్రధానంగా తరుగుదలతోపాటు.. పన్ను వ్యయాలు తగ్గడం సహకరించాయి. దేశీ ఫార్మా పరిశ్రమను మించుతూ కంపెనీ పనితీరులో 4–5 శాతం వృద్ధి నమోదుకానున్నట్లు యాజమాన్యం అంచనా వేసింది. స్వల్ప కాలిక అవకాశాలు, ధరల క్షీణత నేపథ్యంలో యూఎస్ ఫలితాలు మా అంచనాలను అందుకోలేకపోయాయి. నిర్మాణంలో ఉన్న మూడు ప్లాంట్లపై పెట్టుబడి రైటాఫ్(సీడబ్ల్యూఐపీ) రూ. 1,550 కోట్ల ప్రొవిజన్‌ను చేపట్టింది. అయితే సాధారణ రిజర్వ్‌ల నుంచి బదిలీ చేయడం ద్వారా లాభనష్టాల ఖాతాపై ప్రభావం పడకుండా చూసింది. ఈ మూడు యూనిట్ల కార్యకలాపాలు ప్రారంభమైన నేపథ్యంలో పెరగనున్న నిర్వహణ వ్యయాలకు ఇప్పటికే చేపట్టిన అలియోర్ డెర్మాస్యూటికల్స్ రైటాఫ్‌లు కొంతమేర చెక్ పెట్టనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో యూఎస్‌లో విడుదల చేయనున్న 20 కొత్త ఉత్పత్తులు సైతం వీటికి మద్దతివ్వనున్నాయి. వెరసి ఇకపై త్రైమాసికవారీగా మార్జిన్లు మెరుగుపడనున్నట్లు భావిస్తున్నాం. యూఎస్‌లో అమ్మకాల పరిధి పెరగనుండటం, మార్జిన్లలో వృద్ధి, మరిన్ని పెట్టుబడుల వ్యూహాత్మక కేటాయింపునకు అవకాశాల కారణంగా ఇకనుంచి కంపెనీ పనితీరు మరింత పుంజుకోనున్నట్లు అంచనా వేస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

మహీంద్రా మాన్యులైఫ్ బిజినెస్ సైకిల్ ఫండ్

మహీంద్రా మాన్యులైఫ్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బిజినెస్ సైకిల్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సెప్టెంబర్ 4 వరకు అందుబాటులో ఉంటుంది. బిజినెస్ సైకిల్స్ ఆధారంగా మెరుగ్గా రాణించే ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీస్‌లో ఈ ఫండ్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తారు. ఇది వన్ టైమ్ అలాగే సిప్ మార్గంలో పెట్టుబడులకు కూడా అనువైనదిగా ఉంటుందని సంస్థ ఎండీ ఆంథోనీ హెరెడియా తెలిపారు.



ఈ ఫండ్‌ను చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ కృష్ణ సంఘవి, రంజిత్ శివరామ్ రాధాకృష్ణన్ నిర్వహిస్తారు. ప్రస్తుత వ్యాపార దశ, రంగాలవారీ ట్రెండ్స్‌ను గుర్తించి తగు స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తారు. బిజినెస్ సైకిల్స్ సానుకూలంగా ఉన్న అత్యంత నాణ్యమైన, వివిధ మార్కెట్ క్యాప్స్ ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకోవడం వల్ల డైవర్సిఫికేషన్‌కు వీలుంటుంది.

రిటైర్మెంట్ ఫండ్‌కు మేలైన మార్గం..?

నేను విశ్రాంత జీవనం కోసం కావాల్సిన నిధిని సమకూర్చుకోవాలని అనుకుంటున్నాను. రిటైర్మెంట్ ఫండ్ వంటి దీర్ఘకాలిక లక్ష్యాలకు స్మాల్‌క్యాప్ ఫండ్స్ అనుకూలమేనా?

– వర్షిత్

స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులకు దీర్ఘకాలం ఒక్కటీ సరిపోదు. పెట్టుబడులు పెట్టిన తర్వాత స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి కనిపించే నష్టాలకు, యూనిట్ల విలువ క్షీణతకు తట్టుకోగలిగి ఉండాలి. దీర్ఘకాలంలో సంపద సృష్టికి స్మాల్‌క్యాప్ పథకాలను పరిశీలించొచ్చు. అయినప్పటికీ స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడులు అంత సులభమేమీ కాదు. అవి అదే పనిగా నిర్ణీత సమయాల్లో నష్టాలను ఎదుర్కొంటూ ఉంటాయి. మార్కెట్లో ఇతర విభాగాలు మంచి పనితీరు చూపిస్తూ, అదే సమయంలో స్మాల్ క్యాప్‌లో పెట్టుబడులు నష్టాలను చూపిస్తుంటే సామాన్య ఇన్వెస్టర్లు ఆందోళన చెందకుండా ఉండడం కష్టం. అందుకనే మీ మొత్తం పెట్టుబడుల్లో 10–15 శాతం మించి స్మాల్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేయకుండా ఉండడమే నయం. చిన్న కంపెనీని ఎంపిక చేసుకుంటే, అది ఆ తర్వాతి కాలంలో పెద్ద కంపెనీగా మారిందనడానికి వందలాది ఉదాహరణలు ఉన్నాయి. ఇటువంటి సందర్భాల్లో సంపద సృష్టి జరుగుతుంది. కానీ, అలా ఎంపిక చేసుకున్న ప్రతి కంపెనీ కూడా ఓ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కాదు. సంపదను తుడిచిపెట్టేవీ ఉంటాయి. ఆటుపోట్లను తట్టుకునే బలం చిన్న కంపెనీలకు తక్కువగా ఉంటుంది. దీర్ఘకాలంలో చిన్న కంపెనీలు సంపదను సృష్టించగలవు. లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే మంచి వృద్ధిని చూపించగలవు. సాధారణంగా చిన్న కంపెనీలను ఎక్కువ మంది అనుసరించరు. ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు చాలా చిన్న కంపెనీలకు దూరంగా ఉంటారు. ప్రతి స్మాల్‌క్యాప్ ఫండ్ భిన్నంగా పనిచేస్తుంటుంది. వివిధ పథకాల మధ్య ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. సిప్ ద్వారా స్మాల్‌క్యాప్ కంపెనీల్లో దీర్ఘకాలానికి ఇన్వెస్ట్ చేయడం వల్ల రిస్క్ తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా స్మాల్‌క్యాప్ కంపెనీల విషయానికొస్తే కావాల్సినంత లిక్విడిటీ ఉండదు. చిన్న కంపెనీలు కావడంతో ఫ్రీ ఫ్లోటింగ్ ఈక్విటీ తక్కువగా ఉంటుంది. దీంతో మార్కెట్ల కరెక్షన్లలో కొద్దిపాటి అమ్మకాల ఒత్తిడికే షేర్ల ధరలు భారీగా నష్టపోతుంటాయి. మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ కంపెనీలతో పోలిస్తే స్మాల్‌క్యాప్ కంపెనీలు రిస్క్ ఎక్కువతో ఉంటాయి. మారుతున్న మార్కెట్లకు అనుగుణంగా డైనమిక్‌గా ఉండేవి తక్కువే. ముఖ్యంగా చిన్న కంపెనీల్లో ఏ ధరలో కొనుగోలు చేశారు? (సహేతుక వ్యాల్యుయేషన్ వద్ద) అన్నది రాబడులకు కీలకం అవుతుంది.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 45 ఏళ్లు. నా విశ్రాంత జీవనం కోసం వచ్చే పదేళ్ల పాటు, ప్రతి నెలా రూ.50,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాలన్నది నా ప్రణాళిక. ఏ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– ఆశిష్ అథాలే

రిటైర్మెంట్ కోసం పొదుపు చేసుకోవాలనుకునే వారు వాస్తవికంగా ఆలోచించాల్సిందే. ముందుగా రిటైర్మెంట్ కోసం ఎంత మొత్తం కావాలన్నది నిర్ణయించుకోవాలి. రిటైర్మెంట్ నాటికి ఎంత నిధి సమకూర్చుకోగలరో అవగాహనకు రావాలి. విశ్రాంత జీవన అవసరాలకు కావాల్సినంత మీరు కూడబెట్టే విధంగా ప్రణాళిక ఉండాలి. రెండు నుంచి మూడు మంచి ఫ్లెక్సీక్యాప్ పథకాలను ఎంపిక చేసుకోవాలి. నెలవారీ సిప్ ద్వారా వాటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మరో పదేళ్ల పాటు మీ కెరీర్ కొనసాగనుంది. కనుక మీ పెట్టుబడి వృద్ధి చెందడానికి తగినంత వ్యవధి మిగిలి ఉంది. ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులకు సంబంధించి అవగాహన లేకపోతే, అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి అచ్చమైన ఈక్విటీ పథకాలతో పోలిస్తే కొంచెం తక్కువ అస్థిరతలతో ఉంటాయి. అలాగే రిటైర్మెంట్ కోసం ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాలు, ఈక్విటీ పథకాలను ఎంపిక చేసుకోవాలి. దీనివల్ల రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత.. ఈక్విటీ పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాల్లోకి మార్చాల్సిన అవసరం ఏర్పడదు. ఎందుకంటే సగం పెట్టుబడులు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్ ఫండ్స్) సాధనాల్లోనే ఉంటాయి. ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడుల కేటాయింపు జాగ్రత్తగా ఉండాలి. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని అధిగమించేలా, వడ్డీ రేట్లు తగ్గినప్పుడు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలపై పడే ప్రభావాన్ని అధిగమించేలా ఈ సమతూకం ఉండాలి.

సైబర్‌క్రైం ఎస్‌ఐ రాజేందర్ అరెస్టు

- నైజీరియన్ నుంచి డ్రగ్స్ స్వాధీనం... ఆరు నెలలుగా ఎస్‌ఐ ఇంట్లోనే
- మణికొండలో అరెస్ట్ చేసిన రాయదుర్గం పోలీసులు
- రూ.80 లక్షల విలువ చేసే 1750 గ్రాముల మెథాక్వాలోన్ డ్రగ్ స్వాధీనం



ఎస్‌ఐ రాజేందర్

గచ్చిబౌలి: ఓ నైజీరియన్ నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్‌ను ఇంట్లోనే దాచిపెట్టిన కేసులో సైబర్ క్రైం ఎస్‌ఐ రాజేందర్ అరెస్ట్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో తీవ్ర కలకలం రేపుతోంది. 2009 బ్యాచ్‌కు చెందిన కె.రాజేందర్ రాయదుర్గం, మాదాపూర్ పీఎస్‌లలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించాడు. మాదాపూర్ నుంచి సైబర్‌క్రైంకు బదిలీ అయ్యారు. గత ఫిబ్రవరి నెలలో ఓ సైబర్ క్రైం కేసు విచారణలో భాగంగా ముంబైకి వెళ్లాడు. డ్రగ్స్ సప్లయర్ నైజీరియన్‌ను అదుపులోకి తీసుకున్నాడు. అతడి నుంచి డ్రగ్ (మెథాక్వాలోన్) స్వాధీనం చేసుకున్నాడు. ఈ విషయం ఉన్నతాధికారులకు చెప్ప కుండా మణికొండలో తను ఉండే ఇంట్లో దాచిపెట్టాడు. ఇటీవల నార్కోటిక్ బ్యూరో అధికారులు డ్రగ్స్ కేసుల్లో భాగంగా ఆ నైజీరియన్‌ను విచారించారు. వారు ఇచ్చిన సమాచారంతో శని వారం తెల్లవారుజామున మణికొండలో వాహనంతో రోడ్డుపై వేచి ఉన్న రాజేందర్‌ను అరెస్ట్ చేశామని రాయదుర్గం పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ వాహనంలో ఉన్న 1750 గ్రాముల మెథాక్వాలోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.80 లక్షల వరకు ఉంటుంది. అయితే రాజేందర్ డ్రగ్స్ పెడ్లర్స్‌కు అమ్మేందుకు సిద్ధపడగా, సమాచారం తెలుసుకున్న పోలీసులు అరెస్టు చేశారు.

ఏసీబీ కేసులో ఉద్యోగం పోగొట్టుకొని...కోర్టు స్టేతో సర్వీస్‌లోకి...

రాయదుర్గం పీఎస్‌లో 2013లో ఎస్‌ఐగా పనిచేస్తున్న సమయంలో రాజేందర్ ఓ వాహనం రిలీజ్ చేసేందుకు రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. 2022 సెప్టెంబర్ 3న ఏసీబీ కోర్టు దోషిగా తేల్చి రెండేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించింది. అయితే ఏసీబీ కోర్టు తీర్పుపై హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టు నుంచి స్టే తెచ్చుకొని తిరిగి సైబరాబాద్‌లోని సైబర్ క్రైం విభాగంలో విధుల్లో చేరాడు. విధుల్లో చేరినే రాజేందర్ ఏడాది గడవకముందే తిరిగి డ్రగ్స్ కేసులో అరెస్ట్ కావడం చర్చనీయాంశమైంది. కాగా, ఎస్‌ఐ రాజేందర్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాడు. 'అవినీతికి నేను దూరం' అంటూ సోషల్ మీడియాలో స్టేటస్‌లు తరచూ పెట్టుకుంటాడు.

● టుడేస్ గ్రాఫిక్



హార్ట్ పేషెంట్ అయినా హైదరాబాద్ మారథాన్ పూర్తి

లింగం.. మారథాన్ సింగం!

అరుదైన ఫీట్ సాధించిన కార్మికుడు

సాక్షి, హైదరాబాద్

లింగం వయసు 50 ఏళ్లు. ఫుల్ మారథాన్ (42 కిలోమీటర్లు) పూర్తి చేశాడు. ఇది అంత పెద్ద విశేషమేమీ కాదు...కానీ అతను వెల్డింగ్ పనిచేసే సామాన్యమైన కార్మికుడు. అంతేకాదు హార్ట్ పేషెంట్ కూడా. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నివసించే లింగం ఆదివారం నెక్లెస్‌రోడ్‌లో ప్రారంభమైన హైదరాబాద్ మారథాన్‌లో పాల్గొని ఫుల్ మారథాన్ పూర్తి చేశారు. అయితే ఈ ఘనత సాధించిన హార్ట్ పేషెంట్‌గా ఆయన నిలిచారు. ఈ సందర్భంగా లింగం, ఆయనకు వైద్యం చేసిన డా.మురళీధర్ బాబీ 'సాక్షి'తో ఆ వివరాలు పంచుకున్నారు.



కరోనా అనుకుంటే...

వెల్డర్‌గా పనిచేస్తున్న లింగం రెండేళ్ల క్రితం తీవ్రమైన దగ్గు, ఆయాసంతో ఇబ్బంది పడుతూ ఇఎస్‌ఐ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. అయితే ఈ సమస్యకు కారణం కరోనా అని కుటుంబసభ్యులు అనుమానించారు. అయితే పరీక్షల అనంతరం వైద్యులు ఇది కరోనా కాదని, పల్మనరీ ఆర్టీరియల్ హైపర్‌టెన్షన్ అని..అప్పటికే లింగంకు తెలియకుండా రెండుసార్లు స్ట్రోక్స్ వచ్చి ఉండొచ్చని అంచనా వేశారు. ఆయనకు కొన్ని మందులు రాసిచ్చి వాడమన్నారు. కొద్దిరోజుల తర్వాత నిమ్స్‌కు రిఫర్ చేశారు. నిమ్స్‌లో యాంజియోగ్రామ్ తదితర పరీక్షలు చేసి బ్లాక్స్ లేవని, అయితే ఆయన గుండెకు పంపింగ్ సామర్థ్యం బాగా తక్కువగా..అంటే 18కి దిగిపోయిందని డాక్టర్లు తేల్చారు.

రిహాబ్‌తో రీచార్జ్

డాక్టర్ మురళీధర్ నిర్వహించే కార్డియాక్ రిహాబ్ సెంటర్ ప్రోగ్రామ్‌లో లింగం చేరారు. అక్కడ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని రకాల మందులు, చికిత్సలతో పాటుగా రెగ్యులర్‌గా ట్రెడ్‌మిల్ వ్యాయామం, ఆహారంలో రైస్ బాగా తగ్గించి కాయగూరలు, మొలకలు వంటివి బాగా పెంచారు. తద్వారా పంపింగ్ సామర్థ్యాన్ని 53 శాతానికి మెరుగుపరిచారు. ఫలితంగా గత ఏడాదిలో జరిగిన హాఫ్ మారథాన్ పూర్తి చేసిన లింగం...మంచి అలవాట్లు కొనసాగిస్తూ గుండెను మరింత బలోపేతం చేసుకున్నారు. ప్రస్తుతం ఫుల్ మారథాన్‌ను కూడా పూర్తి చేయగలిగారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.